

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శుక్రవారం | 26-4-2024 | పేజీలు: 6 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 116 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: విదియ ఉ. 7.46 తదుపరి తదియ; నక్షత్రం: అనూరాధ తె. 3.40 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: ఉ. 6.36-8.17; దుర్ముహూర్తం: ఉ. 8.26-9.16, మ. 12.38-1.28; అమృతఘడియలు: సా. 4.43-6.24; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.55; సూర్యాస్తమయం: 6.30 | శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు సిటీ

Nellore | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



నేడు నామినేషన్ల పరిశీలన

ఉదయగిరి, ఏప్రిల్ 25: నామినేషన్ల పరిశీలన శుక్రవారం చేపడతామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ గురువారం తెలిపారు. 29న మధ్యాహ్నం మూడు గంటలకు నామినేషన్ల ఉపసంహరణ అనంతరం గుర్తులు కేటాయిస్తామన్నారు.

మండల సమావేశం వాయిదా

ఉదయగిరి రూరల్: స్థానిక స్త్రీశక్తి సమావేశ మం దిరంలో గురువారం నిర్వహించాల్సిన మండల సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో దేవరకొండ ఈశ్వ రమ్మ తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- ఆత్మకూరుకు 27 నామినేషన్ పత్రాల దాఖలు
- చివరి రోజు ఆరు..
- ఉదయగిరిలో మొత్తం 41.. చివరిరోజే 20 దాఖలు



ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కాకర్ల

ఆత్మకూరు ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల పోరులో మరో అంకం పూర్తయింది. నియోజకవర్గంలో నామినేషన్ ఘట్టం గురువారం ముగిసింది. తమ ప్రత్యర్థులెవరో తేలిపోయింది. ప్రత్యర్థుల బలాబలాలను బట్టి పార్టీల వ్యూహాలు రూపొం దిస్తున్నాయి. ఆత్మకూరులో ప్రధానంగా టీడీపీ, వైసీపీ మధ్య పోటీ నెలకొంది. కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థులు గెలుపు ఓటముల్లో కీలకంగా మారారు. కాంగ్రెస్ పార్టీ సీపీఎంతో జతకట్టి ఎన్నికల రంగంలోకి దిగుతోంది. చివరిరోజు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చేవూరు శ్రీధర్‌రెడ్డి, పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పోలు రాజుతో పాటు కాంగ్రెస్, సీపీఎం, అనుబంధాల సంఘాల నేతలు, కార్యకర్తలుతో ర్యాలీగా బయలుదేరి వెళ్లి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి మధులతకు అందజేశారు. ఆయనతో పాటు ఐదు మంది స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు.

ఆత్మకూరు నియోజకవర్గం నుంచి..

మొత్తం 27 నామినేషన్లు దాఖలయ్యాయి. 15 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. టీడీపీ అభ్యర్థిగా ఆనం రామనారయణరెడ్డి నాలుగు సెట్లు నామినేషన్ దాఖలు చేయగా, వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి రెండు సెట్లు నామినేషన్లు వేశారు. ఆయన సోదరుడు మేకపాటి పృథ్వీరెడ్డి ఒక సెట్ నామినేషన్ దాఖలు చే శారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చేవూరు శ్రీధర్‌రెడ్డి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా బి.రాజేశ్వరి, బీఎ స్పీ అభ్యర్థిగా తోటగిరి కృష్ణ, సమాజ్ వాజ్ పార్టీ అభ్యర్థిగా రామిశెట్టి వెంకటేశ్వర్లు, ఇండి యన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ అభ్యర్థిగా షేక్ సుకూర్ నామినేషన్ వేశారు. వీరితో పాటు 8 మంది స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

ఉదయగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో గురువారంతో నామినేషన్ల దాఖలు పర్వం ముగిసింది. ఉదయగిరి అసెంబ్లీకి గురువారం 20నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థులుగా కాకర్ల సురేష్‌బాబు రెండు సెట్లు, కాకర్ల సునీల్ నాలుగు సెట్లు, వైసీపీ అభ్యర్థులుగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మేకపాటి అభినవ్‌రెడ్డిలు ఒక సెట్ చొప్పున, కాంగ్రెస్ అభ్యర్థిగా దుద్దుకూరు రమేష్‌నాయుడు ఒకటి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా నల్లపనేని వెంకటేశ్వర్లు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా కాకర్ల సురేష్ ఒకటి, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా పుష్పాంజలి ఒకటి చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే స్వతంత్ర్య అభ్యర్థులుగా చే జర్ల సుబ్బారెడ్డి, దొంతిరెడ్డి నరసింహారెడ్డి, లెక్కల కొండయ్య, తుమ్మల కిరణ్‌బాబు, రా యపాటి సాంబయ్య, దుద్దుకూరు రమేష్‌నా యుడు నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 18వ తేదీ నుంచి గురువారం వరకు జరిగిన నామినేషన్ల స్వీకరణలో మొత్తం 22మంది అభ్యర్థులు 41 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్ తెలిపారు.

73 ఏళ్ల వృద్ధుడి నామినేషన్

ఉదయగిరి అసెంబ్లీ స్థానానికి 73 ఏళ్ల లెక్కల కొండయ్య గురువారం స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. వింజమూరు మండలం నల్లగొండ్లకు చెందిన ఈయన నిరుపేద. నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో మైక్‌సెట్ ద్వారా రెవెన్యూ సమస్యలపై రైతులకు అవగాహన కల్పిస్తారు. బ్యాంకు ఖాతాలో రూ.వెయ్యి నగదుతో పాటు మూడెకరాల సాగు భూమి ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

- జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్



ఆత్మకూరు సబ్‌డివిజన్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్

ఆత్మకూరు, ఏప్రిల్ 25: ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ కె.ఆరీఫ్ హాఫీజ్ ఆదేశించారు. గురువారం ఆయన ఆత్మకూరు సబ్ డివిజన్ ఆఫీస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ డివిజన్ పరిధిలోని పోలీసుస్టేషన్ల పరిదులు, భౌగోళిక స్థితిగతులు, పో లింగ్‌స్టేసన్లు తదితర అంశాలపై ఆరా తీశారు. గత ఎన్నికల్లో నమోదైన కేసులు, ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఈ ఎన్నికల్లో ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన భద్రత చర్యలు గురించి సబ్ డివిజన్ పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇంతవరకు బైం డవర్ చేసిన వారి వివరాలు, పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. మండలాల పరిధిలో గ్రామసభలు నిర్వహించి, ఎన్నికల నిర్వహణకు ప్రజ లతో మమే కమై అహగాహన కల్పించాలని వివరించారు. ఆయన వెంట డీఎస్పీ కోటారెడ్డి, సీఐలు వేణు, వరినా యక్, ఎస్‌ఐలు ఉన్నారు.

తరుణవాయి పాఠశాలలో చోరీ

- ల్యాప్‌టాప్, ప్రింటర్, నాడు-నేడు ఫ్యాన్లు మాయం
- క్యూస్ టీమ్ పరిశీలన



దుండగలు పగలకొట్టిన హైస్కూల్ తలుపు

సంగం, ఏప్రిల్ 25: తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తలుపులను గుర్తుతెలియని దుండగలు పగలకొట్టి ల్యాప్‌ట్యాప్, ప్రింటర్, నాడు-నేడు వచ్చిన ఫ్యాన్లు చోరీకి పాల్పడ్డారు. ఈ విషయం గురువారం ఉదయం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉన్నత పాఠశాలకు ఇటీవల నాడు-నేడు పథకంలో ల్యాప్‌ట్యాప్, ఒక ప్రింటర్, ఫ్యాన్లు మంజూరయ్యాయి. మంగళవారం పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో ఉపాధ్యాయులు తాళాలు వేసుకుని వెళ్లారు. పాఠశాలకు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వాచ్‌మెన్‌గా ఉన్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రధానోపాధ్యాయుల గదికి వేసిన తలుపు తాళాలు పగలకొట్టి ఉన్నాయి. సమాచారం అందుకున్న ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు వచ్చి చూడగా అందులోని ఉన్న ల్యాప్‌ట్యాప్, ప్రింటర్, నాడునేడు వచ్చిన ఫ్యాన్లు కనిపించలేదు. దండగులు చోరీకి పాల్పడి ఉంటారని భావించిన ప్రధానోపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'ఓపెన్'లో జిల్లాకు ఉత్తమ ఫలితాలు

- టెన్త్, ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం
- సత్తాచాటినఅభ్యాసకులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 25 : సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఫలితాల్లో ఈఏడాది రెండు విభాగాల్లోనూ జిల్లా ద్వితీయస్థానం సాధించింది. గురువారం విడుదల చేసిన ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో జిల్లాకు చెందిన అభ్యాసకులు సత్తాచాటారు. ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం, టెన్త్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు.

నెలలోపే ఫలితాలు

ఓపెన్‌స్కూల్ ఆధ్వర్యంలో ఉన్నత చదువులు, పదోన్నతులు కోరుకునేవారికి ఈ ఏడాది మార్చి 18 నుంచి 27వతేదీ వరకు పదోతరగతి, ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. టెన్త్ పరీక్షలకు 1,713 మంది, ఇంటర్ పరీక్షలకు 3,591 మంది అభ్యాసకులు కలిపి మొత్తం 5,304 మంది హాజరయ్యారు. ఇందుకుగాను మొత్తం 30 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో గురువారం విడుదలైన ఫలితాల్లో పదోతరగతి పరీక్షలకు 1,624 మంది హాజరు కాగా 1,473 మంది ఉత్తీర్ణత పొందారు. 90.70 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో ద్వితీయస్థానం దక్కించుకున్నారు. అలాగే ఇంటర్ పరీక్షలకు 3,457 మంది హాజరు కాగా 2,985 మంది ఉత్తీర్ణత పొంది 86.35 శాతం ఉత్తీర్ణతను సాధించి రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచారు.

జూన్ 1నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ

ఫెయిల్ అయిన విద్యార్థులకు జూన్ 1 నుంచి 8వతేదీ వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అసదుల్లాఖాన్ తెలిపారు. అలాగే రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ఏప్రిల్ 29 నుంచి మే7వతేదీ వరకు ఫీజు చెల్లించాలన్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలోని ఓపెన్‌స్కూల్ కేంద్రాలను సంప్రదించి ఫీజు వివరాలు, ఇతర సమాచారం తెలుసుకోవాలన్నారు. అక్కడే సందేహాలను కూడా నివృత్తి చేసుకోవాలని తెలిపారు.

మలేరియాపై అప్రమత్తం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 25: మలేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు శివకల్పన, వినీతలు తెలిపారు. గురువారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అనంతసాగరం: అనంతసాగరంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశావర్కర్లు మలేరియా నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. వ్యాధి నివారణ చర్యలపై స్థానిక ఎస్టీ కాలనీలో అవగాహన కల్పించారు. వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణి, ల్యాబ్‌టెక్నీషియన్ మిరాన్ ఉన్నారు.

సీతారామపురం: వైద్యురాలు స్వప్న ఆధ్వర్యంలో సిబ్బంది పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ స్వప్న మలేరియా గురించి వివరించారు. దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎంపీహెచ్‌ఈవో మజీద్, రియాజ్, పీహెచ్‌ఎన్ క్రిష్టమ్మ, హెల్త్ అసిస్టెంట్స్ ల్యాబ్ టెక్నీషియన్ షబానా పాల్గొన్నారు.

విక్రమ్‌రెడ్డి నామినేషన్‌లో వీఆర్‌ఏ



పెన్నానది వంతెన వద్ద పెళ్లేరు వీఆర్‌ఏ కర్నాటి సుబ్బయ్య

చేజర్ల, ఏప్రిల్ 25: వైఎస్‌ఆర్‌సీపీ ఆత్మకూరు నియోజకవర్గ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం ఆత్మకూరులో జరిగిన నామినేషన్ కార్యక్రమానికి పెళ్లేరు వీఆర్‌ఏ కర్నాటి సుబ్బయ్య పాల్గొన్న వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. బుధవారం జన సమీకరణలో భాగంగా గ్రామంలో కొందరితో కలిసి నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరి సమీపంలోని పెన్నానది వంతెన వద్ద ఉండగా కొందరు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మండలంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై అధికారులు చర్యలు తీసుకున్నా కొందరిలో ఇంకా మార్పురాలేదు. ఈ సంఘటనపై అధికారులు చర్యలు తీసుకంటారో వేచిచూడాలి.

కేజీ పొగాకు ధర రూ.280

మర్రిపాడు. ఏప్రిల్ 25: డీసీపల్లి పొగాకు బోర్డులో ధరలు రైతులకు ఆనందాన్ని ఇస్తున్నాయి. గురువారం బోర్డుకు రైతులు 583బేళ్లను తీసుకొని వెళ్లగా 13కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొన్నారు. 387బేళ్లను కొనుగోలు చేశారు. నోబిడ్-79, నోసేల్-99, సీఆర్-15, జంపింగ్ లాట్స్-3 వీటి కారణాలతో 193 బేళ్లను తిరస్కరించారు. కిలో గరిష్ట ధర రూ.280కాగా కనిష్ట ధర రూ.218 పలి కింది. సగటున ధర రూ.246.54గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి జీ.రాజశేఖర్ తెలిపారు.

చంద్రబాబు సభకు తరలిరండి

- 27న ఆత్మకూరుకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రాక
- ఉమ్మడి నేతలు, కార్యకర్తలకు ఆనం పిలుపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 25: రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్ర బాబునాయుడు శనివారం సాయంత్రం 4గంటలకు ఎన్నికల పర్యటనలో భాగంగా ఆత్మకూరుకు రానున్నట్లు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆత్మకూరులో ఎన్నికల ప్రచారం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబునాయుడు రాక సందర్భంగా ఆత్మకూరు పట్టణంలోని జంక్షన్‌లో మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి చంద్రబాబునాయుడు సందేశాన్ని వినాలన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఏఎస్ పేటను పర్యాటక కేంద్రంగా చేస్తాం : వేమిరెడ్డి

ఏఎస్ పేట: తాను ఎంపీగా విజయం సాధించిన అనంతరం ఏఎస్ పేటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఏఎస్‌పేటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందరకర్భంగా వారికి పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. గతంలోనే నియోజకవర్గంలో పలు గ్రామలలో తాగునీటి ప్లాంట్లు ఏర్పాటు చేశానని, ఎంపీగా అవకాశం కల్పిస్తే కేంద్రం నుండి నిధులు తెలిపించి ఈ ప్రాంతంను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆనం మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి తాగునీరు అందిస్తే నేను సాగునీరు అందించానని చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు, గిరి నాయుడు, రంగమయూర్ రెడ్డి, షేక్‌జిలాని బాషా పాల్గొన్నారు. మండల మైనార్టీ నాయకుడు సయ్యద్ కాలేషా వే మిరెడ్డి, ఆనం సమక్షంలో టీడీపీలో చేరారు. ఈయన వెంట 400మంది ఉన్నారు.



ఏఎస్ పేట ప్రచారంలో ఆనం, వేమిరెడ్డి

చేజర్ల: ఆనం రామనారాయణరెడ్డి, గిరినాయుడు సమక్షంలో గురువారం మండల సీనియర్ నాయకులు తూమాటి పాపిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పువ్వాడి శ్రీనివాసరావు, సివపురం సత్య, గాదంశెట్టి సురేష్, దేవ తి సుబ్బారావు, మాదాల జనార్దన్‌నాయుడు, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ నజీర్, షేక్ సుభాని, బీసీ సంఘం నాయకులు రంపాటి ప్రసాద్, పలువురు వార్డు మెంబర్లతో పాటు వంద కుటుంబాలు తెలుగుదేశంలో చేరారు. కార్యక్రమంలో ఏటూరు గ్రామానికి చెందిన అలుపూరు రఘు, రావి లక్ష్మీనరసారెడ్డి, వీరరాఘవరెడ్డి పాల్గొన్నారు.

అనంతసాగరం: బొమ్మవరం వైసీపీ నేత పార్లపల్లి కృష్ణారెడ్డి, తన అనచరులతో కలిసి టీడీపీలో చేరారు. చేజర్ల మండలంలో ఆనం రామనారాయణరెడ్డి పర్యటనలో ఉండగా ఆయన సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో కాసా సుబ్బారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆనం కౌవల్యారెడ్డి ప్రచారం

ఆనం రామ నారాయణరెడ్డి కుమార్తె ఆనం కౌవల్యారెడ్డి సోమశిలలో మండలాధక్ష్యురాలు మునగపాటి సునీతతో కలసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుబ్బారాజు, ఉప్పల విజయ్‌కుమార్, వేగు పెంచలయ్య పాల్గొన్నారు.

పీకేపాడులో..

పడమటికంభంపాడులో జనసేన పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆత్మకూరు ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్, జనసైనికులు ఇంటింటికెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి నెల్లూరు పార్లమెంట్, ఆత్మకూరు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆనం రామ నారాయ ణరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్ర మంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ ఉదయగిరి రవి, భరత్ పాల్గొ తదితరులు ఉన్నారు.



ఆనం సమక్షంలో పార్టీలో చేరిన బొమ్మవరం కృష్ణారెడ్డి అనుచరులు

ఏఆర్‌టీ, ఎంఆర్‌వీల తనిఖీ



ఏఆర్‌టీలో పరిశీలిస్తున్న ఏడీఆర్‌ఎం శ్రీనివాసరావు

బిట్రగుంట, ఏప్రిల్ 25: బిట్రగుంట రైల్వేస్టేషన్ సెక్షన్ పరిధిలోని ఏఆర్‌టీ (యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్), ఎంఆర్‌వీ (మెడికల్ రిలీఫ్ వ్యాన్) డ్రైవర్లు, గార్డుల విశ్రాంతి భవనాన్ని విజయవాడ ఏడీఆర్‌ఎం శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. విజయవాడ నుంచి ఆయన బుధవారం రాత్రి బిట్రగుంట రైల్వే అధికారుల విశ్రాంతి భవనానికి ఆయన చేరుకున్నారు. రైలు ప్రమాదాలు జరిగిన సమయంలో ఏఆర్‌టీ ద్వారా సంఘటనా స్థలానికి తీసుకువెళ్లాల్సిన పరికరాలను, వస్తు సామగ్రిని ఆయన పరిశీలించారు. ఆ సమయంలో ఎలా పనిచేస్తారనే విషయమై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డ్రైవర్లు, గార్డుల విశ్రాంతి భవనంలో వసతుల విషయమై సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట సీనియర్ డీఎంఈ రవికిరణ్, సీనియర్ డీఎస్‌వో ప్రశాంత్, స్థానిక రైల్వే వైద్యులు సుధాకర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వాకర్స్‌తో మాటామంతీ

రైల్వే క్రీడామైదానంలో ఏడీఆర్‌ఎం శ్రీనివాసరావు వాకర్స్‌తో కలిసి గురువారం ఉదయం వాకింగ్ చేశారు. ఈ సందర్భగా అసోసియేషన్ కోశాధికారి జీవన్‌కుమార్ రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానం అభివృద్ధిపై ఆయనతో మాట్లాడారు. కాగా అక్కడున్న కుండలోని నీటిని ఏడీఆర్‌ఎం పిడతతో ముంచుకుని తాగారు.

ఉత్తర కాలువకు నీటి సరఫరా తగ్గింపు

అనంతసాగరం, ఏప్రిల్ 25: సోమశిల జలాశయం నుంచి ఉత్తర కాలువకు సరఫరా చేస్తున్న నీటి మోతాదును తగ్గించారు. డ్యాం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారానికి ప్రాజెక్టులో 8.316 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర కాలువకు 100 క్యూసెక్కుల నుంచి 5, దక్షిణ కాలువకు 25 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం

వింజమూరు, ఏప్రిల్ 25: స్థానిక ఎర్రపాలెంలోని శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం అర్ధరాత్రి అనంతరం స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మొదట ఎర్రబల్లిపాలెం భక్తబృందం సభ్యులు స్వామిని ఊరేగింపుగా భాజభజంత్రీలతో శివాలయం వద్ద ఉన్న కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. టీటీడీ వేదపండితులు కల్యాణంను ఘనంగా నిర్వహించగా వేడుకలో భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని అలంకరించి పట్టణ పురవీధుల్లో రథంపై ఊరేగిస్తూ చెన్నకేశవస్వామి గుడి దగ్గర నుంచి గంగమిట్ట వరకు తీసుకెళ్లారు. పట్టణంలోని పలు కూడళ్లలో యువకులు అన్నదానం, మంచినీరు మజ్జిగ, రస్నా వంటి శీతల పానీయాలను భక్తులకు అందజేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ కోటిరెడ్డి, కార్యనిర్వాహణాధికారి మల్లికార్జున్‌రెడ్డి, ధర్మకర్తలు గణపం సుదర్శన్‌రెడ్డి, గణపం వెంకటరమణారెడ్డి పర్యవేక్షించారు.

ఆర్‌టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



సీతారామపురం, ఏప్రిల్ 25: ఆర్టీసీ బస్సు అదుపు తప్పిన ఘటన సీతారామపురం సమీపంలోని జగనన్న లేఅవుట్ల వద్ద గురువారం చోటు చేసుకుంది. గ్రామం నుంచి ఉదయగిరికి ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సునకు ఆటో ఎదురుగా రావడంతో దానిని తప్పించబోయాడు. రోడ్డుకు ఇరువైపులా అంచులు దెబ్బ తినడంతో రహదారి దాటి గోతి వద్దకు వెళ్లి ఆగింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

డిగ్రీ పరీక్షలలో నలుగురి డీబార్

వెంకటాచలం, ఏప్రిల్ 25 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ ఐదవ, ఆరవ సెమిస్టర్ పరీక్షల్లో 541 మంది, మధ్యాహ్నం జరిగిన నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో 44 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఉదయం కావలిలోని జవహర్ భారతీ డిగ్రీ కళాశాలలో ఒకరు, మధ్యాహ్నం నెల్లూరులోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఒకరు, కావలిలోని జవహర్ భారతీ డిగ్రీ కళాశాలలో ఇద్దరు మొత్తం నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

టీడీపీ అధికారంలోకి రావడం తథ్యం

- ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్



తిరుమలాపురంలో మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న చెంచలబాబు, నేతలు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 25: రాష్ట్రంలో వైసీపీ పతనం ఖాయమైందని, ఈ సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం అధికారంలోకి రావడం తథ్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ తెలిపారు. గురువారం టీడీపీ నాయకులతో కలిసి సున్నంవారిచింతల, తిరుమలాపురం, వెంగళరావునగర్ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగివేజారిపోయారన్నారు. ఒక్క అవకాశమని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ అభివృద్ధి, సంక్షేమాన్ని మరిచి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఎన్నికలు ఎప్పుడొస్తాయా, వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెపుతామని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, ఎన్‌ఆర్‌ఐ శైలజ నాయకులు జల్సాయాదవ్, బాలఅంకయ్య, కొండయ్య, మాబాషా పాల్గొన్నారు.

ఉదయగిరి: రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వ పాలనలోనే మాదిగలకు న్యాయం చేకూరుతుందని ఎస్సీ, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాకి శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఉదయగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో వైఎస్ జగన్ మాదిగలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చి విస్మరించాడని గుర్తుచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాక ర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపి స్తామన్నారు. కాకి ప్రసాద్‌రావు, ఓబులాపురం ప్రసన్నకుమార్, జాషువా, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

సీతారామపురం: మండకేంద్రంతో పాటు సంగసానిపల్లిలో నియోజకవర్గ టీఎన్‌ఎస్‌ఎఫ్ ఉపాధ్యక్షుడు మెంటా హరీష్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం కింద విద్యార్థులకు ఏటా రూ.15వేలు, అన్నదాత పథకం కింద రైతులకు ఏటా రూ.20వేలు అందజేస్తామన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలను అందజేస్తామన్నారు. అందరం కలిసి ఆంధ్రప్రదేశ్ బాగు కోసం సానుకూల మార్పు తీసుకొస్తామన్నారు. ఉదయగిరి శాసనసభ అభ్యర్థిగా కాకర్ల సురేష్, పార్లమెంట్ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, సూపర్ సిక్సర్ క్యాలెండర్లను పంపిణీ చేస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు పాలిశెట్టి శ్రీనివాసులు, వార్డు మెంబర్ తోట మనోజ్‌బాబు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, తోట మాల్యాద్రి, బండి రవి,జన్యాల వెంకటేశ్వర్లు, కొణతం చందు పాల్గొన్నారు.



ఉదయగిరి: మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాకి శ్రీనివాసులు



కాకర్ల సురేష్‌బాబుతో సమీక్షిస్తున్న బీద రవిచంద్ర

బీద రవిచంద్రతో కాకర్ల చర్చలు

ఉదయగిరి రూరల్: బొమ్మరాజుచెరువు గ్రామంలోని పార్టీ కార్యాలయంలో ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌తో గురువారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నియోజకవర్గ పరిశీలకులడు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డిలు తాజా రాజకీయ పరిస్థితులపై సమీక్షించారు. నామినేషన్ల పర్వం ముగిసినందున నేతలను సమన్వయం చేసుకుంటూ గెలుపే లక్ష్యంగా గ్రామస్థాయి నుంచి ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి గట్టిగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కాకర్ల వెంకట్, కాకర్ల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి, రెండు కుక్కల మృతి

సీతారామపురం, ఏప్రిల్ 25: బసినేనిపల్లి పంచాయతీలోని పరమటి రొంపిదొడ్లలో పామూరుకు చెందిన నాగలూరి వెంకటేష్, రెండు కుక్కలు గురువారం పొలం వద్ద విద్యుదాఘాతానికి గురై మరణించాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పామూరు నాగలూరి వెంకటేష్, అతని బంధువులు వారితో పాటు రెండు కుక్కలతో అడవి పందులను వేటకు వెళ్లారు. గురువారం తెల్లవారు జామున 2గంటలకు ఇర్ల రామయ్య, ఇర్ల వెంటయ్య అనే రైతులు వారి మొక్కజొన్న పొలానికి వున్న కంచెకు విద్యుత్ సరఫరా ఇవ్వడంతో కరెంట్ షాక్ తగిలి రెండుకుక్కలు అక్కడిక్కడే మృతి చెందాయి. నాగలూరి వెంకటేష్‌కు విద్యుత్ తీగ తగిలి షాక్ తగిలి పడిపోగా అతన్ని అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ అక్కడ మరణించినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు సీతారామపురం ఎస్‌ఐ అనూష కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనికేపల్లిలో పోక్సో కేసు నమోదు

వెంకటాచలం: మండలంలోని అనికేపల్లి గ్రామానికి చెందిన రాజా అనే వ్యక్తిపై గురువారం పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. బుధవారం గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలుడికి గాలి పంపు ద్వారా రాజా గాలి కొట్టడంతో ఆ బాలుడి పొట్ట ఉబ్బిపోయి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆ బాలుడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈవిషయంపై గురువారం బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రాజాపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	138
లేయర్ లైవ్	93
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	272
లేయర్	158

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6848
వెండి కిలో ధర	రూ. 83,400
వెండి ఒక గ్రాము	రూ. 85.40



8 వేలల్లో 80 శాతం !

• జేఈఈ మెయిన్స్‌లో జిల్లా విద్యార్థుల సత్తా

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 25 : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పర్యవేక్షణలో ఏప్రిల్ 6 నుంచి 15వతేదీ వరకు పరీక్షలు జరిగాయి. జిల్లాలో 8వేల మందికిపైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకాగా వారిలో 80శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి. పలు విభాగాల్లో ర్యాంకులను సొంతం చేసుకున్నారు.

27 నుంచి అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తులు...

జేఈఈ మెయిన్స్‌లో కటాఫ్ మార్కులు సాధించిన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు వీలు కలుగుతుంది. ఆ పరీక్షకు ఈ నెల 27 నుంచి మే 7వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. మే 17 నుంచి 26వరకు అడ్మిట్ కార్డులు అందుబాటులో ఉంటాయి. మే 26వతేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. జూన్ 9న ఫలితాలు వెల్లడిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

కాకివాయి విద్యార్థినికి 789వ ర్యాంకు


మాదాల రీతికచౌదరి

చేజర్ల : జేఈఈ మెయిన్స్‌లో చేజర్ల మండలం కాకివాయికి చెందిన మాదాల రీతిక చౌదరి 789వ ర్యాంకు (99.95 శాతం) సాధించింది. ప్రభుత్వ ఉపాధ్యాయులైన మాదాల రవి, తనూజల కుమార్తె రీతిక చౌదరి ప్రాథమిక విద్యాభ్యాసం బిల్లుపాడు ప్రభుత్వ పాఠశాలలో సాగింది. జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా ర్యాంక్ సాధించడం పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్థులు రీతికను అభినందించారు.

• కూలీ బిడ్డకు 1,423వ ర్యాంకు


పూజిత

వలేటివారిపాలెం : తండ్రి చనిపోయాడు. తల్లి రెక్కలు ముక్కలు చేసుకుని బిడ్డను చదివించింది. ఆమె ఆశయాలకు అనుగుణంగా ఆ కుమార్తెకూడా చదువులో రాణించి జేఈఈ మెయిన్స్‌లో 1,423వ ర్యాంకు సాధించింది. మండల కేంద్రమైన వలేటివారిపాలెంకు చెందిన కండ్లగుంట పూజిత కు మూగ, చెముడు. తండ్రి చనిపోవడంతో పూజిత తల్లి కూలి పనులు చేసి కుమార్తెను చదివించింది. 10వ తరగతి వరకు వలేటివారిపాలెం హైస్కూల్లో చదివిన పూజిత ఇంటర్మీడియట్ ఒంగోలులో పూర్తి చేసి జేఈఈ మెయిన్స్‌లో 1,423వ ర్యాంకు సాధించింది. ప్రతిభకు వైకల్యం, పేదరికం అడ్డురాదని పూజిత నిరూపించింది. అత్యుత్తమ ర్యాంకు సాధించిన పూజితను కుటుంబసభ్యులతోపాటు గ్రామస్థులు, టీచర్లు అభినందించారు.

రేపే పాలీసెట్

ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు • హాజరు కానున్న 3,908 మంది

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 25 : పాలీసెట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్, మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీ. విజయ్‌కుమార్ తెలిపారు.గురువారం కళాశాలలో ఆయన చీఫ్ సూపరింటెండెంట్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ నెల్లూరు డివిజన్‌లో నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, వీఆర్ పీజీ కళాశాల, అల్‌హుదా పాలిటెక్నిక్ కళాశాల, డాక్టర్ ఎస్ఆర్‌కే పాఠశాల, జగన్స్ డిగ్రీ కళాశాలల్లోనూ, ఆత్మకూరు డివిజన్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనూ, కావలి డివిజన్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పీబీఆర్ విశ్వోదయా కళాశాలలోనూ శనివారం ఉదయం 11 నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నామన్నారు. విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి గంట ముందుగానే అనుమతిస్తామన్నారు. నెల్లూరులో జరిగే పరీక్షకు 2,559 మంది, ఆత్మకూరులో 476, కావలిలో 873 మంది కలిపి మొత్తం 3,908 మంది పరీక్షకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. కేంద్రాలన్నింటి వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలన్నీ నోఫోన్‌జోన్‌గా ప్రకటించామని, పరీక్ష నిర్వహణ సమయంలో ఎవరూ కూడా సెల్‌ఫోన్‌లు వినియోగించరాదన్నారు. ఫోన్ వినియోగం తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఫొటో ఆధారిత ధ్రువపత్రంతో హాజరు కావాలన్నారు. పాలీసెట్‌కు సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి, గూడూరు పాలిటెక్నిక్ కళాశాల హెచ్‌వోడీ భవానిశంకర్‌లను పరిశీలకులుగా నియమించినట్లు ఆయన తెలిపారు.

మద్యం డంప్‌ల సూత్రధారి కాకాణి

• ముందు ఆయన్ను అరెస్టు చేయాలి • డీపీవో వేదికగా ఫోన్లు ట్రాకింగ్
• టీడీపీ సర్వేపల్లి అభ్యర్థి సోమిరెడ్డి


కాకాణిపై నమోదైన కేసుల చార్జ్‌షీట్‌లను చూపుతున్న సోమిరెడ్డి

నెల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి నియోజకవర్గంలో పట్టుకుంటున్న భారీ మద్యం డంప్‌ల వెనుక అసలు సూత్రధారి కాకాణి గోవర్ధన్ రెడ్డి అని, ముందు ఆయనపై కేసు పెట్టి అరెస్టు చేయాలని సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వంటపాలెంలో సుధాకర్‌రెడ్డి ఇంట్లో 4,232 బాటిళ్లు, విరువూరులో రాజగోపాల్ రెడ్డి మిల్లులో 2069 బాటిళ్ల మద్యం డంప్‌లను అధికారులు పట్టుకున్నారు. సర్వేపల్లి నియోజకవర్గం మొత్తం 1.44 లక్షల మద్యం సీసాలను డంప్ చేసినట్లు తెలుస్తోంది. ఇదంతా కాకాణి సరఫరా చేసిన మద్యం. కాబట్టి అంతిమ లబ్ధిదారుడైన గోవర్ధన్‌రెడ్డిపై అధికారులు కేసు నమోదు చేయాలి. 2014 ఎన్నికల సమయంలోనూ ఇదేవిధంగా వైసీపీ నేతల ఇళ్లల్లో మద్యాన్ని పట్టుకున్నారు. నాడు అధికారులు విచారణ జరిపి హానికరమైన మద్యాన్ని ప్రజలకు పంచేందుకు కుట్ర చేసిన కాకాణిపై కేసులు పెట్టారు. మరి ఇప్పుడు కలెక్టర్, ఎస్పీలు ఎందుకు పట్టించుకోవడం లేదు..?' అంటూ సోమిరెడ్డి ప్రశ్నించారు. జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ స్పందించకపోతే కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. కాగా జిల్లా పోలీసు కార్యాలయం వేదికగా ప్రతిపక్ష పార్టీల నేతల ఫోన్లు ట్రాక్ చేస్తున్నారని సోమిరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. సర్వేపల్లిలో ఏడేళ్ల పనిచేసిన ఎస్ఐ శివకృష్ణారెడ్డిని కాకాణి స్పెషల్ బ్రాంచ్‌లో పోస్టింగ్ వేయించుకున్నారని, ఆ ఎస్సై తమతోపాటు తమ అనుచరుల ఫోన్లు ట్రాక్ చేస్తూ ఆ సమాచారాన్ని కాకాణికి చేరవేస్తున్నారని ఆరోపించారు. కాకాణి ఓఎస్డీగా వ్యవహరిస్తున్న ఎంపీడీవో సరళ అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని మానిటరింగ్ చేస్తూ కాకాణి కోసం చాలా కష్టపడుతోందని ఆరోపించారు.



కొల్లగొట్టింది.. వైసీపీ వారే!


• క్వార్ట్జ్ తవ్వకాలపై నిగ్గు
• మైనింగ్ అధికారుల విచారణలో వెల్లడి
• వైసీపీ నేతలకు షోకాజు నోటీసుల జారీ
• కేంద్రానికి నివేదిక ఇవ్వకుండా జాప్యం
• రిపోర్టు మార్చేందుకు మరోసారి విచారణ ?
• ప్రభుత్వ, అటవీ భూముల్లో తవ్వకాలు
• సూత్రధారులను కాపాడే యత్నాలు

క్వార్ట్జ్ (తెల్లరాయి) అక్రమ తవ్వకాల్లో వైసీపీ నాయకుల పాత్ర బయటపడింది. ఎన్నికల కోడ్ ముందు వరకూ తమ అధికారాన్ని అడ్డం పెట్టుకొని జరిపిన అవినీతి బాగోతం బట్టబయలైంది. క్వార్ట్జ్ తవ్వకాలు జరిపిన ప్రాంతాల్లో తనిఖీలు చేసి స్థానికంగా పంచనామా నిర్వహించారు. విచారణలో తవ్వకాలు జరిపింది వైసీపీ నాయకులేనని తేలడంతో వారికి మైనింగ్ అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఇప్పటివరకూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు నిజమని ఈ విచారణతో తేటతెల్లమవుతోంది. అసలు సూత్రధారులు ఎమ్మెల్యేలు, మంత్రులు కాగా, పాత్రధారులుగా వారి అనుచరులు ఉన్నారు. ఈ విషయమై వైసీపీ కేడర్‌లో కలకలం రేపుతోంది.

నెల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు మండలం మరుపూరులో అక్రమంగా క్వార్ట్జ్ తవ్వకాలు జరిపినందుకు మంత్రి కాకాణి ప్రధాన అనుచరుడు మోపూరు శ్రీనివాసులురెడ్డికి రూ.36.41 లక్షల పెనాల్టీతో మైనింగ్ అధికారులు షోకాజు నోటీసు జారీ చేశారు. మొగళ్లూరులో తవ్వకాలు జరిపినందుకు కొత్తలూరు కోటేశ్వరరావు, త్రిపురిశెట్టి రత్నంలకు రూ.25.39 లక్షలు, మొగళ్లూరులోనే మరో చోట అక్రమంగా తవ్వకాలు జరిపినందుకు యనమాల శ్రీనివాసులురెడ్డి, పేర్నాటి దినేష్‌రెడ్డిలకు రూ.1.40 కోట్లు, గురవాయ పాలెంలో తవ్వకాలు చేసినందుకు వర్షినేని కొండయ్యకు రూ.4.99 లక్షలు, కుంకు అన్నపూర్ణకు రూ.13.32 లక్షలు పెనాల్టీ విధిస్తూ షోకాజు నోటీసులు జారీ అయ్యాయి. వీరంతా వైసీపీ నాయకులు, కాకాణి అనుచరులు. అలాగే సైదాపురం మండలంలో కూడా మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అనుచరులకు షోకాజు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. దీంతో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు నిజమేనని, ఆ దొంగలు కూడా వైసీపీ నేతలేనని తేటతెల్లమైంది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పొదలకూరు, సైదాపురం, గూడూరు రూరల్, రాపూరు మండలాల పరిధిలో పదుల సంఖ్యలో వైసీపీ నేతలకు మైనింగ్ శాఖ నుంచి షోకాజు నోటీసులు అందాయి. ఎవరూ ఈ నోటీసులకు స్పందించకపోవడంతో త్వరలో డిమాండ్ నోటీసులు ఇచ్చిన అనంతరం వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

• తప్పించుకునేందుకు ఆపసోపాలు

ఎన్నికల కోడ్ వచ్చాక క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై మైనింగ్ అధికారులు కదిలారు. అప్పటి వరకూ తవ్వకాలు జరిపిన ప్రదేశాల్లో కొలతలు తీసి ఎంత మొత్తాన్ని తరలించారన్న లెక్కలు వేశారు. మైనింగ్ చట్టాల ప్రకారం క్వార్ట్జ్‌కు టన్నుకు రూ.90 సీనరైజ్ ఫీజు కాగా అనుమతులు లేకుండా తవ్వినందుకు పది రెట్లు పెనాల్టీలు వేస్తూ టన్నుకు రూ.900 చొప్పున షోకాజు నోటీసులు ఇచ్చారు. అయితే ఇదే టన్ను క్వార్ట్జ్ విలువ అంతర్జాతీయ మార్కెట్లో రూ.30 వేల వరకు ఉంది. ఇప్పటి వరకు నెల్లూరు జిల్లాలో రూ.12 కోట్ల వరకు జరిమానాలు విధించారు. ఈ లెక్కన రూ.400 కోట్ల విలువైన క్వార్ట్జ్‌ను ఇతర దేశాలకు ఎగుమతి చేసి వైసీపీ నేతలు సొమ్ము చేసుకున్నారు. ఇంత భారీ స్థాయిలో దోపిడీ జరుగుతున్నా ఎన్నికల కోడ్ ముందు వరకూ ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదు. చివరకు టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీలకు ఫిర్యాదు చేయడంతో గుట్టు రట్టయ్యింది.


GOVERNMENTOF ANDHRA PRADESH
DEPARTMENT OF MINES & GEOLOGY

O/o the
District Mines and Geol[illegible]
SPSR Nellore

SHOW-CAUSE NOTICE

Quartz/2024-3, Dt: 19-03-[illegible]

[illegible]b:- Mines & Quarries - Illegal Quarrying for Quartz in Gover[illegible] Land in Sy.No: 583, 584 & 585 of Marupuru Village, Pod[illegible] Mandal, SPSR Nellore District - Illegal Quarrying done by Sri M[illegible] Srinivasula Reddy - Show - Cause Notice - Issued - Regardin[illegible]

[illegible]ef:- 1. Inspection & Survey Report Dated 18.03.2024.
2. Panchanama dated: 18.03.2024.
-o0o-

[illegible]erting to the subject and references cited, Sri Mopuru Srinivasula[illegible] [illegible]y informed that the undersigned along with this office Technical S[illegible] [illegible] they have inspected the land in Sy.No: 583, 584 & 585 of Ma[illegible] [illegible]calakur Mandal, SPSR Nellore District. During the course of our insp[illegible] [illegible]oticed that, the Quartz & Feldspar extracted and dispatched from t[illegible] [illegible]igging various pits after removal of overburden, we have arriv[illegible] of Quartz & Feldspar extracted from the said land by measuring [illegible] deducting the overburden and Quantity of Quartz stocked at pit he[illegible]

మంత్రి కాకాణి ప్రధాన అనుచరుడు మోపూరు శ్రీనివాసులురెడ్డికి మైనింగ్ శాఖ జారీ చేసిన షోకాజు నోటీసు



మండుటెండలో ఇదేం పద్ధతి...!

• చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలతో ప్రయాణికులకు ఇక్కట్లు

నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలో చింతారెడ్డిపాళెం క్రాసు రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఎన్నికల అధి కారులు వాహన తనిఖీల నిమిత్తం చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసుల తీరు తో వాహనదారులు, ప్రయాణికులకు చుక్కలు కనపడుతున్నాయి. జాతీయ రహదారి నుంచి నెల్లూరులోకి ప్రవే శించే కార్లను కనీసం రోడ్డు పక్కన కూడా ఆపించకుండా తనిఖీల కోసం రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. దీంతో వెనుక పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోతున్నాయి. రహదారి మలుపు వద్ద చెన్నై - విజయవాడ, కావలి - చెన్నై వైపు వెళ్లే వాహనాలన్నీ బారులుతీరుతున్నాయి. ఒకపక్క మండే ఎండ.. మరోపక్క ట్రాఫిక్ జామ్‌తో వాహనాల్లోని ప్రయాణికులు తీవ్రంగా అవస్థ పడుతున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోవాలని వాహనదా రులు కోరుతున్నారు.

- నెల్లూరు రూరల్

నేడు జిల్లాలో బాలకృష్ణ పర్యటన

● గుడ్లూరు, నెల్లూరులో రోడ్‌షోలు

నెల్లూరు (వైద్యం)/కందుకూరు ఏప్రిల్ 25 : టీడీపీ సీనియర్ నాయకుడు, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు గుడ్లూరు మామిడి చెట్ల సెంటర్ నుంచి బాలకృష్ణ రోడ్‌షో ప్రారంభమై, బస్టాండ్ సెంటర్‌కు చేరుకుంటుంది. అక్కడ జరిగే బహిరంగ సభలో బాలకృష్ణ మాట్లాడతారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు నెల్లూరుకు చేరుకుని మైపాడు గేటు నుంచి నవాబుపేట, జలకన్య విగ్రహం, ఆత్మకూరు బస్టాండ్, గాంధీబొమ్మ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు రోడ్‌షో జరగనుంది. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి బాలకృష్ణ మాట్లాడతారు. ఇందుకు సంబంధించి టీడీపీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.


ఉదయగిరిలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న 73 ఏళ్ల లెక్కల కొండయ్య

ముగిసిన తొలి ఘట్టం

చివరిరోజు భారీగా నామినేషన్లు
98 మంది.. 113 సెట్లు
టోటల్‌గా అసెంబ్లీకి 237, పార్లమెంట్‌కి 29..
నేడు పరిశీలన

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల పర్వం ముగిసింది. చివరిరోజు గురువారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఈఒక్క రోజే ఎనిమిది అసెంబ్లీ సెగ్మెంట్‌లకు 98 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 113 సెట్ల నామినేషన్లు వేశారు. కందుకూరులో 14 మంది, కావలిలో 8, ఆత్మకూరులో 7, కోవూరులో 24, నెల్లూరు సిటీలో 16, నెల్లూరు రూరల్‌లో 8 , సర్వేపల్లిలో 7, ఉదయగిరిలో 14 మంది చొప్పున నామి నేషన్లు దాఖలు చేశారు. అలానే నెల్లూరు పార్లమెంట్‌కు 14 మంది నామినేషన్లు వేశారు. ఇందులో చాలావరకు ఇదివరకే నామినేషన్లు దాఖలు చేసి వాటికి అదనంగా మరో సెట్ నామినేషన్ వేసిన వారే ఉన్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు కూడా చివరి రోజున మరో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు వేసేం దుకు భారీ సంఖ్యలో అభ్యర్థులు రావడంతో రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు కిటకిటలాడాయి. మధ్యాహ్నం మూడు గంటలకు నామినేషన్ల గడువు ముగిసినా, చివరి రోజు ఎవరెవరు నామినేషన్లు వేశారన్న వివరాలు వెల్లడించేందుకు అధికారులకు రాత్రి తొమ్మిది గంటల వరకు సమయం పట్టింది. ఇక ఈనెల 18వతేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా చివరి రోజుతో కలిపి ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 237 మంది, పార్లమెంటుకు 29 మంది నామినేష న్లు దాఖలు చేశారు. కాగా నామినేషన్ల పరిశీలన శుక్రవారం జరుగుతుంది. సాయంత్రం లోపు స్క్రూటినీ పూర్తి చేస్తారు. అనంతరం అర్హత సాధించిన నామినేషన్ల వివరాలను వెల్లడిస్తారు. ఈనెల 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహ రణకు గడువు ఉంది. 29వ తేదీ మధ్యాహ్నం మూ డు గంటల తర్వాత ప్రధాన పార్టీల అభ్యర్థులకు పార్టీ గుర్తులు కేటాయిస్తారు. ఇండిపెండెంట్ అభ్య ర్థులకు నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయిస్తారు. ఆ తదుపరి బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

85 శాతం పోలింగ్‌కు చర్యలు • ఎన్నికల పరిశీలకుల సమావేశంలో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలో సార్వత్రిక ఎన్నిల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగిన ఎన్నికల పరిశీలకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏర్పాట్లను పరిశీలకులకు వివరించారు. ఈసారి 85 శాతానికి పోలింగ్ పెంచ డానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కనీస సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఎన్నికల పటిష్ట నిర్వహణకు 16 మంది నోడల్ అధికారులను నియమించామన్నారు. ఇప్పటి వరకు 450 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని చెప్పారు. ఇప్పటి వరకు 18వేల మంది ఫాం-12 అందచేశారని తెలిపారు. హోంఓటర్లుగా 1712 మందిని గుర్తించామని, మొదటి దశలో మే 3 నుంచి 5వ తేదీ వరకు, రెండో దశలో 8 నుంచి 10వ తేదీ వరకు ఓటు హక్కు వినియోగించుకొనేలా ఏర్పాట్లు చేశామన్నారు.

● 20.59 లక్షల మంది ఓటర్లు

జిల్లాలో ఇప్పటివరకు 20,59,546 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. వీరిలో పురుషులు 10,07,444, స్త్రీలు 10,51,891 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు. పూర్తి స్థాయిలో ఓటర్ల వివరాలు కొద్దిరోజుల్లో విడుదల చేస్తామని చెప్పారు. పోలింగ్ లొకేషన్లు 1444, పోలింగ్ కేంద్రాలు 2,470, ప్రభుత్వ ఉద్యోగులు 14657 మంది ఉన్నారని, వారిని ఎన్నికల విధులకు వినియోగిస్తున్నామని చెప్పారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు, వలంటీర్లను ఎన్నికల విధుల్లో వినియోగించటం లేదని చెప్పారు. ఈ సమావేశంలలో సాధారణ పరిశీలకులు రామ్‌కుమార్ గౌతమ్, నితిన్ సింగ్ బాధురియా, కరేగౌడ, పోలీస్ పరిశీలకులు అశోక్ పి.దుదే, ఎన్నికల వ్యయ పరిశీలకులు జ్యోతి మోయ్ భైలంగ్, కంచన్‌రామ్ మీనా, ప్రసాద్ దత్తాత్రేయ, ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.


పరిశీలకుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

• టీడీపీ విజయం చారిత్రాత్మక అవసరం
• ఆత్మకూరు ప్రచారంలో టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి, ఆనం


ప్రచారంలో అభివాదం చేస్తున్న వేమిరెడ్డి, ఆనం

ఆత్మకూరు, ఏప్రిల్ 25 : రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ చంద్రబాబు నాయుడు రావాలని నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆత్మకూరులో పంటవీధి, చల్లావీధి, పెద్దమసీదు మీదుగా బీఎస్ఆన్ సెంటర్ వరకు వారు ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల అభ్యున్నతికి సమ ప్రాధాన్యం ఇచ్చి సుపరిపాలన అందించిన టీడీపీ తిరిగి పట్టం కట్టాలని పిలుపు నిచ్చారు. ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు అన్నదాతను ఆదుకునేందుకు మరింత ప్రగతి పథంలోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కాగా, టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి టీడీపీ కరపత్రాలు అందజేశారు. ప్రచారానికి వచ్చిన ఆనం, వేమిరెడ్డిలకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, టీడీపీ నాయకులు గిరినాయుడు, శైలజారెడ్డి, చంద్రారెడ్డి, చిట్టమూరి వెంకటేశ్వర్లురెడ్డి, చంద్రా వెంకటసుబ్బా నాయుడు, బీజేపీ నేతలు కర్నాటి ఆంజనేయరెడ్డి, సుధాకర్ రెడ్డి, జనసేన నాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మంటల్లో దళం!

• అగ్నిమాపక దళాన్ని పట్టించుకోని జగనన్న!
• ఐదేళ్లలో ఒక్క ఫైర్ స్టేషన్‌కూ అనుమతుల్లేవ్!
• మంజూరైన వాటికి బిల్లుల పెండింగ్!
• సిబ్బందికీ అందని పీపీఏలు




పొదలకూరులో ఆగిన ఫైర్ స్టేషన్ పనులు

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అగ్నిమాపక దళం నిర్వీర్యమై పోయింది. ఆ శాఖ పురోభివృద్ధిపై కన్నెత్తి చూడకపోవడంతో ఒక్క స్టేషన్ కూడా కొత్తగా ఏర్పాటు కాలేదు. దీనికితోడు ఉన్న స్టేషన్ల స్థానంలో కొత్తవి నిర్మాణ పనులు చేపట్టినా బిల్లులు మంజూరుకాక ఎక్కడివక్కడ ఆగిపోయాయి. ఖాళీ పోస్టులు భర్తీకాకపోగా, ఉన్నవారిపై పనిభారం పెరిగింది. ఐదు సంవత్సరాల్లో ఒక్క కొత్త ఫైర్ ఇంజన్ మాత్రమే జిల్లాకు చేరగా, సిబ్బందికి పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్ వంటివి కూడా అందలేదు. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. ఆయా ఫైర్ స్టేషన్లలో 150 మందికిగానూ 110 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. వీరిలో హోమ్‌గార్డులు 40 మంది, అగ్నిమాపక శాఖ సిబ్బంది 70 మంది మాత్రమే ఉన్నారు. బుచ్చి, వెంకటాచలం, నెల్లూరు-2 కొత్త ఫైర్ స్టేషన్‌ల మంజూరు కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇప్పటివరకు అతీగతీలేదు. వైసీపీ ప్రభుత్వంలో పొదలకూరు, ఆత్మకూరు, కావలిలో నూతన భవనాల నిర్మాణాలకు అనుమతులు అందాయి. అయితే పొదల కూరు, ఆత్మకూరు స్టేషన్ల నిర్మాణ పనులు ప్రారంభమైనా కాంట్రాక్టర్లకు బిల్లులు అందక పోవడంతో పనులు పూర్తిగా నిలిచి పోయాయి. కావలిలో అసలు పనులే ప్రారంభం కాలేదు. అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో ఫైర్ ఇంజన్ ఎంత త్వరగా ఘటనాస్థలికి చేరుకుంటే అంత నష్టాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. అయితే, జిల్లాలో ఒక్కో స్టేషన్ పరిధి 35 నుంచి 40 కిలోమీటర్ల మేర ఉంది. అంటే దూర ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఫైర్ ఇంజన్ అక్కడకు చేరుకోవాలంటే అధిక సమయం పడుతుంది. దీంతో మంటలు ఆర్పడం ఆలస్యం అవుతుండటంతో నష్టం పెరుగుతోంది మరోవైపు ఫైర్ ఇంజన్లకు నిరంతరం నిర్వహణ లేకపోవడంతో వాహనాలు అధ్వానంగా ఉంటున్నాయి. ఉన్నవాటితోనే అగ్నిమాపక దళం నెట్టుకు వస్తోంది.

- నెల్లూరు (క్రైం)




ఇదీ మందు

"అన్నా.. బాగుండారు గదా.. గెలవబోయేది మళ్లీ మనమే. మనం కోరుకున్నది చేసుకోవచ్చు. ఎలక్షను ఖర్చులు బాగా పెరిగిపోయినాయని తెలుసుకదా. మనోడు వొచ్చి కలుస్తాడు. మరిచిపోబాకండి" అంటూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వ్యాపారులకు ఫోన్‌లు వస్తున్నాయి. అయిదేళ్లుగా అధికార పార్టీ దందాలు కళ్లజూసిన వీరు ఇటువంటి ఫోన్ రాగానే హడలిపోతున్నారు. మొబైల్ మోగగానే ఎక్కడి నుంచా అని ఆందోళనగా చూస్తున్నారు. నాయకుడి అసలు నెంబరు నుంచి గాక ప్రతిసారీ ఏదో కొత్త నెంబరు నుంచే ఫోన్‌లు వస్తున్నాయి. అడిగినంత ఇచ్చుకోలేక. అలా అని ఇవ్వకపోతే ఏమవుతుందో అనే భయం వదులుకోలేక వ్యాపారులు ఆందోళనపడుతున్నారు. 'ఇసుకలో బానే ఎనకేసుకున్నారు గదా. భూములు, పంచాయతీలు అని కోట్లు సంపాయిస్తిరి.. ఇప్పుడు మళ్లీ మనమింద పడ్డారేంది స్వామీ' అని ఒకరికొకరు కలబోసుకుని కడుపు చించుకుంటున్నారు.

- రేణిగుంట

రాష్ట్ర మంత్రి రోజా ఎక్కే గడప దిగే గడపతో సతమతమవుతున్నారు. పుత్తూరుకు చెందిన వైసీపీ కీలకనాయకుడు ఏలుమలై మొదలియార్ టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో ఆమె అలెర్ట్ అయ్యారు. అసమ్మతి వర్గ నేతల పట్ల ఇప్పటిదాకా ఉన్న బింకాన్ని సడలించుకుని వారి ఇళ్లకు తిరుగుతున్నారు. ఏలుమలై మొదలియార్ వర్గంకే చెందిన వైసీపీ నాయకుడు నారాయణబాబు ఇంటికి వెళ్లి తనకు సహకరించాలని రోజా కోరారు. అలాగే విజయపురం మండలంకు చెందిన అసమ్మతి నాయకుడు లక్ష్మీపతిరాజును కలిసేందుకు ప్రయత్నించినా ఆయన అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు. బుధవారం నగరి మున్సిపాలిటీకి చెందిన మొదలియార్ సామాజికవర్గంలో కీలక నాయకుడు పురుషోత్తం మొదలియార్‌ను ఆయన ఇంట్లోనే కలిశారు. అదే రోజు మధ్యాహ్నం నగరి మున్సిపల్ మాజీ చైర్మన్ కేజే కుమార్ ఇంటి గడప తొక్కారు. 'ఇప్పటి వరకు జరిగిందేదో జరిగిపోయింది...ఈ ఎన్నికల్లో నాకు సహకరించండి' అంటూ వారందరినీ కోరుతున్నట్లు సమాచారం. అయితే వెళ్లిన ప్రతిచోటా సానుకూలత లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నట్లు నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. రెండు వారాల క్రితం తిరుపతిలో శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డి వారి చక్రపాణిరెడ్డిని కలిసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారని తెలిసింది. 'జరగాల్సిన నష్టం జరిగిపోయాక ఇప్పుడు గడప గడపకు తిరిగి లాభం ఏమిటి' అనే నిట్టూర్పులు వైసీపీలోనే వినిపిస్తుండడం విశేషం.

- పుత్తూరు అర్బన్



జన కేతనం


- ఖాతాల్లో జమ కాని విద్యాదీవెన, వసతి దీవెన సొమ్ము
- విద్యా సంవత్సరం ముగుస్తోందని విద్యార్థులు ఆందోళన
- అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్న తల్లిదండ్రులు
- జగన్ మాటలకు మోసపోయామంటూ లబోదిబో

మీ బిడ్డల చదువుల విషయం నాకొదిలేయండి. జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాలతో పెద్ద చదువులు చదివించండి.

- విద్యార్థుల తల్లిదండ్రులకు సీఎం జగన్ తరచూ చెప్పే మాటలివి

రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని సీఎం జగన్‌రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇందుకు విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను క్రమం తప్పకుండా అమలుచేస్తున్నామంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆయన పచ్చి అబద్ధాలు చెబుతున్నారని అర్థం అవుతుంది. విద్యాదీవెన పథకంలో ప్రారంభ సంవత్సరం నుంచి పలు అంశాలను సాంకేతిక కారణాల సాకుగా చూపుతూ లబ్ధిదారుల సంఖ్యను కుదిస్తూ వచ్చారు. ఆఖరు సంవత్సరానికి మొత్తం చేతులెత్తేశారు.

- తిరుపతి(కలెక్టరేట్)



బటన్ నొక్కి రెండు నెలలు..
డబ్బులేవి జగన్ మామా..!

పేద విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలల్లో రూపాయి కూడా ఫీజు రూపంలో చెల్లించాల్సిన పని లేదని, అంతా ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చిన జగన్ ఆచరణలో విద్యార్థుల నడ్డివిరిచారు. విద్యాదీవెన, వసతి దీవెన కింద ఆర్థిక సాయాన్ని జమ చేయడానికి ఆయన బటన్ నొక్కి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జమ కాలేదు. ఐదేళ్లుగా పథకాలకు నిధులు సక్రమంగా విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ విద్యాసంవత్సర త్రైమాసికానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఈఏడాది మార్చి 1న ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ ఫోటో ఫోజులిచ్చి నమూనా చెక్కులు విడుదల చేశారే తప్ప డబ్బులు జమయ్యాయా లేదో తెలుసుకోలేదు. ఈ విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకున్నా పథకాల సొమ్ము అందలేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలు ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఫార్మశీ కళాశాలల యాజమాన్యాలు ఫీజు చెల్లిస్తేనే వార్షిక పరీక్షలకు అనుమతిస్తామంటున్నాయి. దీంతో అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారు.

జిల్లాలో కాకిలెక్కలు

జిల్లాలో 2019 నుంచి ఇప్పటివరకు వసతి దీవెన కింద రూ.188.92 కోట్లు, విద్యాదీవెన కింద రూ.475.23 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు కాకి లెక్కలు చెబుతున్నారు. క్షేత్రస్థాయికి వచ్చే సరికి తల్లిదండ్రుల ఖాతాల్లో చాలా వరకు నగదు జమ కాలేదు. ఇక చివరకు ఈ ఏడాది మొదటి త్రైమాసికానికి 39,368 మంది విద్యార్థులకు రూ.29.50కోట్లు జమ చేస్తున్నట్లు ఫోటోలకు ఫోజులు ఇచ్చారు. కానీ తమకు అందలేదని విద్యార్థులూ, తల్లిదండ్రులూ చెబుతున్నారు.

అప్పు చేసి సర్టిఫికెట్లు తీసుకున్నాం



అప్పు చేసి రూ.56 వేలు ఫీజు కడితే సర్టిఫికెట్లు ఇచ్చారు. పుత్తూరులోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం కూడా పూర్తయింది. విద్యాదీవెన రాలేదు. అధికారులను అడిగితే తెలియదన్నారు. ఫీజు కడితే కానీ సర్టిఫికెట్లు ఇవ్వమని కళాశాల యాజమాన్యం చెప్పింది. చేసేది లేక మా తల్లిదండ్రులు అప్పు చేశారు. మాలాంటి పేదవారిపట్ల ప్రభుత్వం ఇలాగేనా ప్రవర్తించేది.

- వై.లోకేష్(బీటెక్), ఆర్‌సీపురం

ప్రభుత్వం మోసం చేసింది

మా తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లేవారు. లేకపోతే పూటగడవదు. ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదివినప్పుడు విద్యాదీవెన కింద ప్రభుత్వం రూ.8వేలు ఖాతాలో వేసింది. ఇపుడు డిగ్రీ పూర్తవుతోంది. ఇంత వరకూ ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. ఎలా ఫీజు కట్టేది. ప్రభుత్వం మమ్మల్ని మోసం చేయడం కరెక్టేనా.



- వినయ్, మిట్టగాంధీ పురం, తిరుపతి రూరల్

ఒక విడత కూడా అందలేదు

విద్యాదీవెన ఆసరాగా ఉంటుందని ఓ ప్రైవేటు కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సులో చేరాను. ప్రభుత్వం ఇచ్చే రీయింబర్స్‌మెంట్ చదువుకు ఉపయోపడుతుందనుకున్నా. విద్యాదీవెన ద్వారా ఇప్పటి వరకు ఒక విడత కూడా సాయం అందలేదు. అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నా. విద్యా దీవెన ఎప్పటికొస్తుందో అర్థం కాకుండా ఉంది.

- వంశీకృష్ణ, చిల్లకూరు





ఇంకా జమకాలేదు

నేను తిరుపతిలోని ఓప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాను. జగన్ మామయ్య బటన్ నొక్కి రెండు నెలలవుతోంది. ఇప్పటికీ రూపాయి కూడా జమకాలేదు. విద్యాసంవత్సరం కూడా ముగుస్తోంది. డబ్బులు ఎపుడు వస్తాయో తెలియని పరిస్థితి.

- విశాల్, తిరుపతి రూరల్



డబ్బులు రాని బటన్ నొక్కడం ఎందుకు

అధికారంలోకి వస్తానే విద్యావ్యవస్థకు పెద్దపీట వేసి పేద విద్యార్థులకు సొంత మామయ్యలా అండగా ఉంటానని సీఎం జగన్‌రెడ్డి డాంబికాలు పలికారు. ఉత్తుత్తి బటన్లు నొక్కుతున్నారు. విద్యాసంవత్సరం ముగుస్తున్నా తల్లిదండ్రుల ఖాతాల్లో పైసా కూడా జమ కాకపోవడం దుర్మార్గం. ముమ్మాటికీ ప్రభుత్వం మోసం చేసినట్లే.

- ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి



వైసీపీ నేతల చెరలో చెరువులు

- రూపాయి చెల్లించకుండా అక్రమార్జన

అధికారం అడ్డం పెట్టుకుని వైసీపీ నాయకులు చేస్తున్న అక్రమాలు అన్నీఇన్నీ కావు. ప్రశ్నిస్తే ఏం జరుగుతుందోనని ప్రజలు మౌనంగా భరిస్తున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంట మండల పరిధిలో పంచాయతీ చెరువులను అధికార పార్టీ నేతలు గుప్పెట్లో పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్నారు. ఒక్క రూపాయి కూడా ప్రభుత్వానికి చెల్లించకుండా దర్జాగా చెరువుల్లోని చేపలను అమ్ముకుంటున్నారు. లక్షల్లో వెనకేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మండల పరిధిలో పంచాయతీ, సొసైటీ చెరువులు 52 ఉన్నాయి. ఇందులో పంచాయతీ ఆధీనంలో 19 పెద్ద చెరువులున్నాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి సంవత్సరం వేలం పాట నిర్వహించారు. తరువాత 2020 కరోనా రావడంతో 2021లో గతంలో పాడిన వారికి నష్టాలు చూపుతూ కొనసాగించారు. ఆ తరువాత నుంచి గామాల్లోని వైసీపీ నేతలు చెరువుల వేలం జరగనివ్వకుండా సిండికేట్ అయిపోతున్నారు. సాధారణంగా గత పాట ధరకు ప్రతి ఏటా పదిశాతం పెంచాల్సి ఉంది. వైసీపీ నేతల ఒత్తిడితో ఐదు శాతం మాత్రం పెంచుకుని 19 చెరువులనూ దక్కించుకున్నారు. ఎలమండ్యం, ఆర్ మల్లవరం, కరకంబాడీ, వెదళ్ల, అనుగుంట, చీరాలమ్మ, అత్తూరు, గాజులమండ్యం, తూకివాకం, కోట్ర మంగళం, జీపాళెం, ఆంనేయపురం, రామవపురం చెరువులకు ఇప్పటి వరకు రూపాయి చెల్లించలేదు. గత ఏడాది పాడుకున్న తుమ్మలగుంట, లక్ష్మమాక చెరువులకు సైతం పైసా చెల్లించలేదు. రేణిగుంట మండల పరిధిలోని మత్స్యకార శాఖ ఆధీనంలోని 33 సొసైటీ చెరువులను సొసైటీ సభ్యుల పేరుతో వైసీపీ నేతల బినామీల అతి తక్కువ ధరతో దక్కించుకుంటున్నారని సమాచారం. ఇప్పటికీ ప్రతి వారంలో రెండుసార్లు చెరువులో చేపలను పట్టి దర్జాగా బహిరంగ మార్కెట్లో విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు.



వైసీపీ నేతల ఆధీనంలో ఉన్న వెంకటాపుం పెద్దచెరువు

- రేణిగుంట

సత్యవేడు చరిత్ర

టీడీపీకి పెట్టని కోట

1983 తరువాత ఆరుసార్లు గెలిచిన తెలుగుదేశం

రెండుసార్లు మాత్రమే కాంగ్రెస్ విజయం



సత్యవేడు,ఏప్రిల్ 24: టీడీపీకి సత్యవేడు నియోజకవర్గం పెట్టని కోట. 1983లో ఆ పార్టీ ఆవిర్భవించాక వరుసగా టీడీపీ విజయదుందుభి మోగిస్తోంది. కేవలం రెండు సార్లు మాత్రమే కాంగ్రెస్ గెలవగలిగింది. తమిళనాడు సరిహద్దులోని ఈ నియోజకవర్గం 1961కు ముందు ఆ రాష్ట్రంలోని నాటి చెంగల్‌పట్టు జిల్లా తిరువళ్ళూరు తాలూకాలో అంతర్భాగంగా ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా పటాస్కర్ అవార్డు ప్రకారం 1962 ఏప్రిల్ 2న ఆంధ్రప్రదేశ్‌లో కలిసింది. తొలుత ఏడు మండలాలుండేవి. 2009లో నియోజకవర్గాల పునర్విజనలో భాగంగా తొట్టంబేడు, పెళ్ళకూరు మండలాలను దీని నుంచి వేరు చేశారు. నారాయణవనం, కేవీబీపురం మండలాలను కలిపారు. ఇప్పటి వరకూ అత్యధికంగా ఆరుసార్లు టీడీపీ గెలుపొందింది. ఐదుసార్లు కాంగ్రెస్ గెలుపొందింది. 1978 ఎన్నికల వరకూ ఈ నియోజకవ్గంలో కాంగ్రెస్ విజయకేతనం గెలవగా తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం తర్వాత పరిస్థితి తారుమారు అయింది. టీడీపీ హవా కొనసాగించింది. కాంగ్రెస్ రెండుసార్లు మాత్రమే గెలిచింది. 1978లో గెలుపొందిన సీ.దాస్, 1999లో ఎన్నికైన ఎస్.శివప్రసాద్ మాత్రమే మంత్రులుగా పనిచేశారు.

ఎప్పుడు ఆవిర్భవించింది : 1962
ఎన్నిసార్లు ఎన్నిక జరిగింది: 13

నియోజకవర్గంలో మండలాలు:
సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, కేవీబీపురం.

ఎమ్మెల్యేలు

1962	టి.బాలక్రిష్ణయ్య	కాంగ్రెస్
1967	కె.మునస్వామి	స్వతంత్ర్య
1972	సి.దాస్	కాంగ్రెస్
1978	సి.దాస్	కాంగ్రెస్
1983	తలారి మనోహర్	టీడీపీ
1985	ఎం.సురాజ్	టీడీపీ
1989	సి.దాస్	కాంగ్రెస్
1994	ఎం.సురాజ్	టీడీపీ
1999	ఎన్.శివప్రసాద్	టీడీపీ
2004	కె.నారాయణస్వామి	కాంగ్రెస్
2009	హెచ్.హేమలత	టీడీపీ
2014	తలారి ఆదిత్య	టీడీపీ
2019	కోనేటి ఆదిమూలం	వైసీపీ

ఓటర్ల వివరాలు

మొత్తం : 2,11,378
పురుషులు : 1,02,568
మహిళలు : 1,08,797
ఇతరులు : 13

'పేట' హ్యాట్రిక్ వీరుడు



మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పిట్ల వెంకటసుబ్బయ్య

విశేషం

సూళ్లూరుపేట హ్యాట్రిక్ వీరుడిగా పిట్ల వెంకటసుబ్బయ్యను అందరూ తలచుకుంటారు. పదహారేళ్ల ఎమ్మెల్యేగా చేసిన ఆయన పింఛను మీద ఆధారపడే చివరిదాకా జీవించారు. 1962లో సూళ్లూరుపేట నియోజకవర్గం ఏర్పడింది. 1967లో జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పిట్ల వెంకటసుబ్బయ్య పోటీ చేసి, తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి మేర్లపాక మునస్వామిపై 1853 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 1972 ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీచేసిన కటారి మునస్వామిపై 11,425 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1978 ఎన్నికల్లో జనతాపార్టీ అభ్యర్థి దొడ్డి వీరాస్వామిపై 21,414 ఓట్ల తేడాతో విజయఢంకా మోగించారు. ఈ హ్యాట్రిక్ రికార్డు సూళ్లూరుపేటలో ఇప్పటిదాకా ఎవ్వరూ బ్రేక్ చేయలేకపోయారు. 1994, 1999 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పరసా వెంకటరత్నయ్య రెండుసార్లు గెలుపొందినా, 2004లో ఓడిపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచారు. మూడోసారి పోటీ చేస్తున్నారు.

- తడ

నోట్ దిస్ పాయింట్

ప్రచారంలో గీత దాటితే..

నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ప్రచారాలు హోరెత్తుతున్నాయి. ఈ సందట్లో పార్టీలూ కార్యకర్తలూ నిబంధనలు మరచిపోయి అత్యుత్సాహంతో ప్రవర్తిస్తుంటారు. ఎన్నికల సంఘం ప్రచారాలకు స్పష్టమైన గీత గీసింది. ఆ నిబంధనలు ఇవీ...

- వెంకటగిరి/డక్కిలి

- ప్రచార వాహనాలకు రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి. అనుమతి పత్రాన్ని వాహనానికి అతికించాలి. వాహనాన్ని అనుమతి పొందిన అభ్యర్థే వాడాలి. ఇతరులు వాడితే చర్యలు తీసుకుంటారు.
- విద్యాసంస్థల్లో, వాటి మైదానాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదు.
- కరపత్రాలపై ముద్రణాలయాల పేరు, చిరునామా కచ్చితంగా ఉండాలి
- ప్రచారంలో టోపీలు, కండువాలు ఇవ్వవచ్చు, వీటిని ఎన్నికల ఖర్చులో చూపించాలి. ధరించే దుస్తులు మాత్రం ఇవ్వకూడదు.
- దేవుళ్ల ఫోటోలు, అభ్యర్థి ఫోటోతో కలిపి డైరీలు, క్యాలెండర్లు ప్రచురించకూడదు. వాహనాలపై కూడా మతపరమైన ఫోటోలు, అభ్యర్థి ఫోటోలు ఉండకూడదు.
- ప్రార్థనా స్థలాలకు, పాఠశాలలకు, పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల లోపు రాజకీయ పార్టీల తాత్కాలిక కార్యాలయాలు ఉండకూడదు.
- రాత్రి 10 గంటల తర్వాత, ఉదయం 6 గంటల లోపు మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదు.
- ఏజెంట్ సంబంధిత పోలింగ్ బూత్ పరిధిలో ఓటరై ఉండాలి.
- ఊరేగింపు రూటును ముందుగానే పోలీసులకు తెలియజేయాలి.
- దిష్టి బొమ్మలు తగల బెట్టకూడదు.



సేవా దృక్పథం కలిగిన వేమిరెడ్డి, కాకర్లను ఆదరిద్దాం

● మెట్టుకూరి చిరంజీవిరెడ్డి

జలదంకి, ఏప్రిల్ 25: సేవా దృక్పథం కలిగిన టీడీపీ ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్‌లను ఆదరించి గెలిపిద్దామని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవలే తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయన గురువారం తన ప్రధాన అనుచరుడు తొక్కేలు నారాయణరెడ్డి అనారోగ్యానికి గురికావడంతో పరామర్శించేందుకు మండలంలోని కోదండరామపురం వచ్చారు. ఆయన వస్తున్నాడనే విషయం తెలుసుకుని వేములపాడు ఎంపీటీసీ గొర్రెపాటి యలమందారెడ్డి, మాజీ సర్పంచు మద్దూరి శ్రీనివాసులరెడ్డి, గోసల శివారెడ్డి, దేవిరెడ్డి కామేష్ రెడ్డి, మట్టెపు ఏడుకొండలు, ముక్కు మల్లికార్జున తదితరులు అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా చిరంజీవి రెడ్డి తాను పార్టీ ఎందుకు మారాల్సి వచ్చిందనే విషయాన్ని, తన అనుచరులపై పెడుతున్న కేసులు, ప్రస్తుతం ఎన్నికల సమయంలో తనపై వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రవర్తించిన విధానం తదితర విషయాలు వివరించారు.


స్థానికులతో మాట్లాడుతున్న చిరంజీవిరెడ్డి

వెనుకబడ్డ ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కాకర్ల సురేష్‌లను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్వతహాగా వీరిద్దరూ సేవాదృక్పథం కలవారని, ఇప్పటికే వారిద్దరు ట్రస్టులు పెట్టి ఎలా సేవచేయగలిగారో ప్రజలందరికీ తెలిసిన విషయమేనని, దీనిని దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గ ప్రజలు వారిని ఆదరించి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విజ్ఞులైన నియోజకవర్గ ఓటర్లు ఆలోచించి ఓట్ల రూపంలో తమ నిర్ణయాన్ని తెలపాలని పేర్కొన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపిస్తే..

అల్లూరులో ఎంపీ క్యాంపు కార్యాలయం

అల్లూరు, ఏప్రిల్ 25 : టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డిలను గెలిపిస్తే అల్లూరులో శాశ్వత ఎంపీ క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించేందుకు కార్యాచరణ చేపడతామని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి అన్నారు. గురువారం స్థానిక టీడీపీ నేత షేక్ రఫీమాలిక్ ఆధ్వర్యంలో ఆర్‌డీఆర్ కాలనీ, బీసీ కాలనీ, రజక కాలనీ, కట్టకింద అరుంధతీయవాడ కాలనీ వాసులు స్థానిక టీడీపీ కార్యాలయానికి చేరుకుని వారు ఎదుర్కొంటున్న సమస్యలను కోటారెడ్డి ఎదుట ఏకరువు పెట్టారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే తాగునీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి దాహార్తిని తీరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడా శ్రీనివాసులు రెడ్డి, మేడా రామకృష్ణారెడ్డి, మేడా కృష్ణారెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, అర్షిత్ రెడ్డి, పాపాల


అల్లూరులో వేమిరెడ్డి కోటారెడ్డికి సమస్యలు తెలుపుతున్న కాలనీ వాసులు

విజయ కుమార్ రెడ్డి, దేవళ్ల హరిప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

143 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, ఏప్రిల్ 25: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 526 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 383 బేళ్ల కొనుగోలు చేశారు. నోబిడ్-123, ఆర్ ఆర్-4, సీఆర్-9, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 143 బేళ్ల తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.218, సగటు ధర రూ.242.80గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

కుటీర పరిశ్రమగా బెల్టు షాపులు!

● బహిరంగంగా విక్రయం ● ఈసీ టార్గెట్ అంటూ ప్రభుత్వ దుకాణాలు మధ్యాహ్నమే మూత ● దొడ్డిదారిన తరలించి అధికార పార్టీ నేతలకు అందజేత ● సెబ్, పోలీసులు సహకరిస్తున్నారంటూ టీడీపీ ఆరోపణ

ఉలవపాడు, ఏప్రిల్ 25 : మండలంలో బెల్టు షాపులు కుటీర పరిశ్రమలగా మారాయి. ఈసీ మద్యం విక్రయాలపై దిశానిర్దేశాలు విధించడంతో మధ్యాహ్నం 2 గంటలకే ప్రభుత్వ మద్యం దుకాణం మూతేస్తున్నారు. అయితే దుకాణంలోని మద్యాన్ని అడ్డదారిలో అటు బెల్టు దుకాణాలకు, ఇటు అధికార పార్టీ నేతలకు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జోరుగా సాగుతున్న ఎన్నికల ప్రచారాల్లో అధికార పార్టీకి చెందిన వారికి మాత్రమే మద్యం లభిస్తుండగా ప్రతిపక్ష పార్టీలకు దొరకడం లేదు. దీంతో సెబ్, పోలీస్ సహకారంతో వైసీపీ నేతలకు మద్యం అందజేస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. మందుబాబులు మాత్రం అధిక ధరలకు బెల్టు షాపుల్లో కొనుగోలు చేసి జేబులు ఖాళీ చేసుకొంటున్నారు. మండలంలో ఉలవపాడులో రెండు, కరేడు, చాకిచర్లలో ఒక్కొకటి చొప్పున ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఉలవపాడు టౌన్‌లో అన్ని సామాజికవర్గాలలో సుమారు 40 మంది బెల్టు షాపుల నిర్వహణను పార్ట్ టైం జాబ్‌గా మార్చుకున్నారు. బాటిల్‌పై రూ.50 అదనం అయినా మందుబాబులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఇళ్లలో ఖాళీగా ఉన్న వృద్ధులు సైతం 10 నుంచి 20 సీసాలు తెప్పించుకొని రోజుకి సుమారు రూ.500 నుంచి రూ.1000 సంపాదిస్తున్నారు. ఇక యువకులు అక్రమ మద్యం విక్రయాలను వ్యాపారంగా మార్చుకొని రోజుకి రూ.3000 సంపాదించే వాళ్ల లేకపోలేదు. పోలీస్, సెబ్ అధికారులు అటు వైపు వెళ్లరన్న నమ్మకంతో తీరప్రాంత గ్రామాల్లో బహిరంగంగా విక్రయాలు జరుగుతున్నాయి.



ఉలవపాడులో మూసిఉన్న మద్యం దుకాణం


లింగసముద్రంలో ప్రభుత్వ మద్యం దుకాణం, పక్కనే కూల్‌డ్రింక్ షాపు

ఈసీ టార్గెట్‌తో బెల్టు షాపులకు...

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఈసీ ప్రభుత్వ షాపులకు టార్గెట్‌లు నిర్దేశించింది. గత ఏడాది ఏప్రిల్ నెలలో రోజుకు ఎంత మద్యం విక్రయాలు జరిగాయో సరాసరి ప్రస్తుతం అంతే విక్రయించాలన్న నిర్ధారించింది. దీంతో టార్గెట్ పూర్తి అయ్యిందంటూ సూపర్‌వైజర్లు, సేల్స్ మెన్‌లు దొడ్డిదారిలో మద్యం అక్రమంగా విక్రయాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అందులో భాగంగా మధ్యాహ్నం 2 గంటలకే దుకాణాలు మూతవేసి టార్గెట్ మేరకు మద్యం సీసాలను వైసీపీ నేతలకు, బెల్టు షాపులకు విక్రయిస్తూ లాభార్జన పొందుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

అనధికార బార్లుగా కూల్‌డ్రింక్ షాపులు

లింగసముద్రం : మండలంలోని పెదపవని, లింగసముద్రం గ్రామాల్లోని ప్రభుత్వ మద్యం దుకాణాల పక్కనే అనధికార బార్లు నడుపుతున్నారని తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మద్యం దుకాణాల పక్కన తినుబండారాలు, కూల్‌డ్రింక్స్, మంచినీళ్ల సీసాలు, గ్లాసులు విక్రయిస్తుండడంతో మందుబాబులు వాటిని కొనుగోలు చేసి అక్కడే మద్యం తాగుతున్నారు. వాస్తవానికి మద్యం దుకాణాల సమీపంలో మద్యం తాగకూడదు. కానీ ఈ గ్రామంలో యథేచ్ఛగా అక్కడే మద్యం తాగుతూ, ఆ ఖాళీ సీసాలను పక్కనే పొలాల్లో వేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఈ రెండు గ్రామాల్లో రెండేసి గదులను నిర్మించి ఒక గదిలో మద్యం దుకాణం, మరో గదిని కూల్‌డ్రింక్స్ షాపులకు ఇచ్చారు. దీంతో మద్యం దుకాణాల వద్ద అనధికార బార్లు నడుస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

ఎన్డీఏ అభ్యర్థుల గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ ప్రచారం

కొండాపురం, ఏప్రిల్ 25: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ ఆదేశాలమేరకు మండలంలోని పార్లపల్లి, గానుగపెంట, ఆదిమూర్తిపురం, లింగనపాలెం తదితర గ్రామాలలో గురువారం ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ ప్రచారంలో ఆశాఖ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్న ఎన్డీయే కూటమికి ఎమ్మార్పీఎస్ పూర్తిస్థాయిలో మద్దతిస్తుందన్నారు. ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గెలిపించుకునే బాధ్యత ప్రతి మాదిగ బిడ్డపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఆశాఖ మండల నాయకులు గోసాల సుధాకర్ మాదిగ, మల్లెల తిరుమలేశు మాదిగ, గోచిపాతల ఆనందరావుమాదిగ, గంగపట్ల నాగరాజుమాదిగ, గోసాల సందీప్ మాదిగ, నాగరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జగన్‌కు ఓటేస్తే మళ్లీ విధ్వంసమే : ఇంటూరి సౌజన్య

వలేటివారిపాలెం, ఏప్రిల్ 25 : జగన్‌కు ఓటేస్తే రాష్ట్రంలో మళ్లీ విధ్వంసమేనని కందుకూరు నియోజకవర్గం టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య తెలిపారు. మండలంలోని కళవళ్లలో గురువారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. మహిళా కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను వివరించి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో గత టీడీపీ ప్రభుత్వ పానలతో పోలిస్తే 10 శాతం అభివృద్ధి కూడా జరగలేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ.1500 ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.


కళవళ్లలో ఇంటింటి ప్రచారంలో ఇంటూరి సౌజన్య

మలేరియాపై అవగాహన ర్యాలీ

కందుకూరు, ఏప్రిల్ 25: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కందుకూరు పట్టణంలో గురువారం మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కందుకూరు అర్బన్ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో మలేరియా నివారణపై అవగాహన కల్పిస్తూ ప్లేకార్డులు, నినాదాలతో ప్రధాన వీధులలో జరిగిన ర్యాలీలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టరు బ్యూలాగ్రేస్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమకాటుకి గురికాకుండా దోమతెరలు వాడాలని సూచించారు. మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవడంతో పాటు నీటి తొట్టెలపై మూతలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ఐ పద్మావతి, కే. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వేమిరెడ్డి, కాకర్లను గెలిపించండి

జలదంకి, ఏప్రిల్ 25: మండలంలోని జలదంకి, తదితర గ్రామాల్లో గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఎన్నికల మేనిఫెస్టో సూపర్‌సిక్స్, భవిష్యత్తుకు గ్యారెంటీల పథకాలను ఓటర్లకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లు ట్రస్టుల ద్వారా చేస్తున్న సేవలను వివరించారు. ఈ ప్రచారంలో కూటమి పార్టీల మండల అధ్యక్షులు పులుగుంట మధురెడ్డి, కంచర్ల శరత్‌బాబు, తోట మురళీతో పాటు జిల్లా నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, మారెళ్ల బ్రహ్మారెడ్డి, నిమ్మలపల్లి రామ్‌చైతన్య, తదితరులు పాల్గొన్నారు.


జలదంకిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న నేతలు

మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు

లింగసముద్రం, ఏప్రిల్ 25 : టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు మహిళకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తారని మండలంలోని పెదపవని టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, కందుకూరు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ నాయబ్‌రసూల్ చెప్పారు. గురువారం సాయంత్రం గ్రామంలో స్థానిక టీడీపీ నేతలతో కలిసి గ్యాస్ సిలిండర్లను ప్రదర్శిస్తూ, ఇంటింటికి టీడీపీ, జనసేన నేతలు కరపత్రాలను పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీ, కందుకూరు ఎమ్మెల్యే టీడీపీ ఉమ్మ డి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామిశెట్టి మాలకొండయ్య, షేక్ రఫీ, కె కొండలరావు, దనుం మధు, రాఘవేంద్ర, రామిశెట్టి వెంకటేశ్వర్లు, కరీముల్లా, జనసేన నేతలు మలిశెట్టి మనోహర్, కోటుపల్లి దినేష్, దారా రాజారత్నం పాల్గొన్నారు.


గ్యాస్ సిలిండర్లతో ప్రచారం చేస్తున్న నాయకులు

టీడీపీలో చేరిన వారికి సముచిత స్థానం : కావ్య


కావలి : టీడీపీలో చేరిన 36వ వార్డు నేతలతో కావ్య, వంటేరు


కావలి : వైసీపీ నుంచి టీడీపీలో చేరిన బట్లదిన్నె వాసులతో కావ్య

● వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి వలసల జోరు

కావలి, ఏప్రిల్ 25: ఇతర పార్టీల నుంచి తెలుగుదేశం పార్టీలో చేరే వారికి సముచిత స్థానం ఉంటుందని కావలి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి స్పష్టం చేశారు. గురువారం కావలి పార్టీ కార్యాలయానికి వచ్చి పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. పట్టణంలోని వివిధ వార్డుల నుంచి, పలు గ్రామాల నుంచి వచ్చిన వారందరికీ కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పట్టణ టీడీపీ నాయకులు తాతా వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీనివాసులు, మెట్టుకూరి అమర జీవిరెడ్డి, డాకా శ్రీనివాసులరెడ్డిల ఆధ్వర్యంలో 36వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు, అలాగే 26వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు తోడ్రెడ్డి రామ క్రిష్ణారెడ్డి వైసీపీలో చేరారు. కావలి రూరల్ మండలం తాళ్లపాలెం పంచాయతీ బట్లదిన్నెకు చెందిన మాజీ ఎంపీటీసీ బండ్ల వెంకట్రావు, పంచాయతీ 9వ వార్డు సభ్యురాలు ఉప్పాల రమణమ్మ తోపాటు మరో 30 కుటుంబాలు టీడీపీలో చేరారు. అదేవిధంగా టీడీపీ నాయకులు మోర్ల చెంచురామయ్య, దినేష్, రవి, దాసుల ఆధ్వర్యంలో రూరల్ మండలం ఆముదాలదిన్నె పంచాయతీ కొనదిన్నెకు చెందిన 15 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారందరికీ కావలి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డిలు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నియోగజకవర్గంలో టీడీపీలోకి రోజురోజుకు వైసీపీ నుంచి వలసలు పెరుగుతుండడంతో నేతల్లో జోష్ నెలకొంది.



బిట్రగుంట : పార్టీ కండువా వేస్తున్న దగుమాటి వేణుగోపాల్‌రెడ్డి

టీడీపీలోకి పలువురి చేరిక

బిట్రగుంట, ఏప్రిల్ 25: బోగోలు మేజర్ పంచాయతీ అరవపాలెంకు చెందిన పీ.వేళాంగిణి, కే.ప్రభావతి, వై.వేళాంగిణి, ఎస్.శాంతిప్రియ, పి.శివకుమార్ తదితరులు టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, బోగిరి ప్రభాకర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి కావలి టీడీపీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డి సోదరుడు దగుమాటి వేణుగోపాల్‌రెడ్డి కండువాలు వేసి ఆహ్వానించారు. మధ్యాహ్నం విశ్వనాథరావుపేట నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. సాయంత్రం ఇబ్రహీంపేట, ముస్లింవీధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్.సుధీర్‌బాబు, అహ్మద్ బాషా, అడపా ప్రసాద్, జానకిరామయ్య, తోట ప్రసాద్, పేట శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బోగోలు అరవపాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త ఫిలిమెన్ రవి(60) అనారోగ్యంతో గురువారం మృతి చెందగా ఆయన పార్థివ దేహానికి దగుమాటి వేణుగోపాల్‌రెడ్డి, మాలేపాటి నాగేశ్వరావు, బోగిరి ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట మేకల కిరణ్‌కుమార్, పిచ్చయ్య, రవిగన్, ఎహిజికేల్, మొల్ల తదితరులు ఉన్నారు.

వైసీపీని వీడి 17 కుటుంబాలు...

అల్లూరు, ఏప్రిల్ 25 : మండలంలో నార్తుఆములూరు పంచాయతీకి చెందిన 17 కుటుంబాల నుంచి 70 మంది వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఆపార్టీని వీడి నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. ఆ గ్రామానికి చెందిన రాచగొల్ల సుబ్బయ్య, రాచగొల్ల కరుణాకర్, షేక్ మస్తాన్, బదనాపురి వెంకటేశ్వర్లు, వంగపాటి రమేష్, ఒట్టూరు మల్లికార్జున, రాచగొల్ల వెంకటేశ్వర్లుల ఆధ్వర్యంలో వీరు టీడీపీలో చేరగా బీద గిరిధర్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మేడా కృష్ణారెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, దాసరి కరుణాకర్, దాసరి ప్రభాకర్, పెయ్యల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


అల్లూరు : నార్తుఆములూరు వాసులకు కండవా వేస్తున్న గిరిధర్

ముగిసిన నామినేషన్ల పర్వం

● కావలి అసెంబ్లీకి 25 మంది, 43 సెట్లు

కావలి, ఏప్రిల్ 25: కావలి అసెంబ్లీకి నామినేషన్ల గడువు గురువారంతో ముగిసింది. మొత్తం 25 మంది అభ్యర్థులు 43 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. చివరి రోజు 8 నామినేషన్ల పత్రాలను ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో శీనానాయక్‌కు అందచేశారు. టీడీపీ అభ్యర్థి దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తరుపున నాలుగో సెట్ నామినేషన్ వేయగా వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తరుపున మూడో సెట్ నామినేషన్ వేశారు. సమాజవాది పార్టీ తరుపున ఆనం లత, యంగ్‌సీనియర్ రిచ్‌కామన్‌పీపుల్ కింగ్స్ పార్టీ తరుపున ఉప్పాల రవికిరణ్, కాంగ్రెస్ పార్టీ తరుపున లేలపల్లి సురేష్‌బాబులు తమ నామినేషన్లను వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా బచ్చల సంధ్యారాణి, దేవరపల్లి క్రిష్ణారెడ్డి, వీ శ్రీనివాసులు నామినేషన్లు వేశారు.

కందుకూరులో 25 మంది, 40 సెట్లు

కందుకూరు : కందుకూరు అసెంబ్లీకి 25 మంది అభ్యర్థులు 40 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బీఎస్పీ, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా, జైభారత్ నేషనల్ పార్టీ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా, నీతి నిజాయితీ పార్టీ, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీలతో పాటు మరో 14మంది ఇండిపెండెంట్లుగా నామినేషన్లు వేశారు.

బాలకృష్ణ బహిరంగ సభకు తరలిరండి : ఇంటూరి

కందుకూరు, ఏప్రిల్ 25: హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ శుక్రవారం మండల కేంద్రమైన గుడ్లూరులో ఎన్నికల ప్రచారసభలో పాల్గొంటారని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత కావలిలో బయలుదేరి 3 గంటలకు తెట్టు జంక్షన్ వద్దకు చేరుకుంటారని, మూడున్నర గంటలకు గుడ్లూరు శివార్లలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి బాలయ్య బాబుకు ఘనస్వాగతం పలుకుతామని తెలిపారు. అక్కడి నుంచి గుడ్లూరు మెయిన్ సెంటర్ వరకు ర్యాలీ జరుగుతుందని 4 గంటలకు బహిరంగసభలో బాలకృష్ణ ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమం అనంతరం బాలకృష్ణ నెల్లూరులో జరిగే ఎన్నికల ప్రచార కార్యక్రమానికి బయలుదేరి వెళ్తారన్నారు. నియోజకవర్గంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, బాలయ్య అభిమానులు, ప్రజలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు.

వృద్ధ మహిళ నేత్రదానం

జలదంకి, ఏప్రిల్ 5: కలిగిరి మండలం వెలగపాడు కమ్మవారిపాలెంకు చెందిన మేదరమెట్ల రమణమ్మ(85) గురువారం మండలంలోని బీకే అగ్రహారంలో తన కుమార్తె కంచర్ల రాధ నివాసంలో మృతి చెందారు. ఆమె నేత్రాలను ఆమె కుమార్తెలు దానం చేశారు. కావలి రెడ్‌క్రాస్ సిబ్బంది వచ్చి నేత్రాలను సేకరించి తీసుకెళ్లారు.

ఇంటూరి సోదరుల కలయికతో టీడీపీలో జోష్

ఉలవపాడు, ఏప్రిల్ 25 : వైషమ్యాలు వీడి ఇంటూరి సోదరులు ఒక్కటవడంతో తెలుగు తమ్ముళ్లలో జోష్ నింపింది. టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావును విబేధించి ఇటీవల మండలంలో ఇంటూరి రాజేష్, మాజీ ఎమ్మెల్యే దివి శివరాంలు ప్రచారం చేయడంతో టీడీపీ శ్రేణులు అయోమయానికి గురయ్యారు. ఈ క్రమంలో ఇంటూరి రాజేష్ ఇండిపెండింట్‌గా పోటీలో ఉంటే సోదరులిద్దరూ ఓట్లు చీల్చుకుంటే వైసీపీకి లాభం చేకూరుతుందని భావించారు. ఈ క్రమంలో వారి ఆశలు అడియాశలు చేస్తూ ఇంటూరి నాగేశ్వరరావు నామినేషన్ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చక్రం తిప్పి ఇంటూరి బ్రదర్స్, దివి కుటుంబం మధ్య సయోధ్య కుదర్చడంతో ఇటూ టీడీపీ నేతల్లో జోష్ పెరిగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం రాత్రి మండలంలోని కొల్లూరుపాడు బీసీ కాలనీ, ఉలవపాడు, కరేడు, చాకిచర్ల, బద్దిపూడి, భీమవరం గ్రామాల్లో పర్యటించి రాజేష్ వర్గీయుల ఇళ్లకు వెళ్లి పార్టీ విజయం కోసం పనిచేయాలని, అన్ని వేళల అందుబాటులో ఉండి పని చేస్తానని మాట ఇచ్చారు. రాజేష్‌తో కలిసి నడిచిన వారంతా అధికశాతం యాదవ సామాజిక వర్గం వారే కావడంతో మండలంలో టీడీపీకి యాదవ సామాజిక వర్గం బలంగా మారింది.


ఉలవపాడు : ఇంటూరి రాజేష్ వర్గీయులతో సమావేశమైన టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు

వైసీపీని వీడి టీడీపీలో చేరిక

ఉలవపాడు : మండలంలోని చాకిచెర్ల పంచాయతీ తూర్పు సంఘంలోని వైసీపీకి చెందిన మానికల వెంకటేశ్వర్లు, చిలకపాటి సురేష్, ఇడింపల్లి వెంకటేశ్వర్లు, మల్లవరపు కృష్ణ, పొట్లూరి పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, మల్లవరపు వెంకటేశ్వర్లు, పొన్నూరి నాగయ్య, అన్నం చెంచయ్య, చేవూరి శేషయ్య, చేవూరి బాబు, పోట్లూరి చెంచయ్య, పోట్లూరి తిరుపతయ్య, నంబూరి కలగయ్య తదితరులు టీడీపీలో చేరారు. గురువారం కందుకూరులోని టీడీపీ కార్యాలయంలో వారికి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు టీడీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మిరియం మల్లికార్జున, సుదర్శి సాంబయ్య, పాయలపాటి శ్రీను, చిలకపాటి శ్రీను, మిరియం భాస్కర్, సుదర్శి శ్రీను, జువిగుంట యలమంద, ఎందేటి శ్రీను, రఘు, మట్టెపు రామకృష్ణ, సన్నెబోయిన సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి కొండికందుకూరు...

కందుకూరు : మండలంలోని కొండికందుకూరు ఎస్సీ కాలనీవాసులు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. గురువారం కాలనీకి చెందిన మెండా గోవిందు, వెంకటేశ్వర్లు, భాస్కర్, నాగార్జున, మాల్యాద్రి, ప్రసాద్, కొండయ్య, మెడబలిమి వెంకటేశ్వర్లు, సుదర్శి రామకృష్ణ, దాసరి గిరిబాబు తదితరులు స్థానిక టీడీపీ కార్యాలయానికి చేరుకుని పార్టీకి మద్దతిచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేయగా వారందరికీ పార్టీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన పోకూరి వెంకటేశ్వర్లు కూడా ఇంటూరి నాగేశ్వరరావు సమక్షం లో తెలుగుదేశం పార్టీలో చేరారు. వలేటివారిపాలెం మండలం శింగమ నేనిపల్లి గ్రామానికి చెందిన నాంచారమ్మ దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త చిడిపోతు వెంకటేశ్వర్లు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. దీంతో తెలుగుదేశం పార్టీ బలం రోజురోజుకు పెరుగుతోందని టీడీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నార్నె రోశయ్య, రెబ్బవరపు మాల్యాద్రి, ఎస్వీ సుబ్బారావు, ఈదర నరసయ్య, గుళ్లా శ్రీను, బొడపాటి అనిల్, యడ్లపల్లి చంద్రయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


కందుకూరు : టీడీపీలో చేరిన కొండికందుకూరు ఎస్సీ కాలనీ వాసులు


సాల్మానుపురం వద్ద రోడ్డు మార్జిన్‌లో దహనక్రియలు జరుగుతున్న దృశ్యం

వారంతా పునరావాస ప్రజలు. పొట్టచేత పట్టుకుని కడప జిల్లా నుంచి ఊరుగాని ఊరొచ్చారు. చేతికందిన పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎలాగోలా పూట గడిచిపోతున్నా గ్రామంలో ఎవరైనా చనిపోతే దహనక్రియలకు మరుభూమి లేక అవస్థలు పడుతున్నారు. నిత్యం వాహనాల రద్దీ ఉండే రోడ్డు పక్కనే దహనక్రియలు చేసుకుంటున్నారు. 'ఒక్కచాన్స్' పేరుతో పాదయాత్ర చేస్తూ తమ ఊరికి వచ్చిన వైసీపీ అధినేత జగన్‌కు తమ సమస్యను మొరపెట్టుకున్నారు. అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానన్న జగన్ ఆరేళ్లు గడిచినా ఇప్పటికీ అతీగతీ లేదు.

మరుభూమికీ ఎన్ని కష్టాలయ్యా!?

- శ్మశానం కోసం పాదయాత్రలో జగన్‌తో మొర
- అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ
- ఆరేళ్లవుతున్నా అతీగతీ లేదు!

సోమశిల ప్రాజెక్టు ముంపు గ్రామాల (కడప జిల్లా) నుంచి 40 ఏళ్ల క్రితం బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లి పంచాయతీ సాల్మానుపురానికి వలస వచ్చారు. గ్రామం, పరిసరాలు అభివృద్ధి చెందేకొద్దీ గ్రామానికి స్మశానం సమస్య ఏర్పడింది. గ్రామంలో 350 కుటుంబాలు, 1100 మంది జనాభా, 700 మంది ఓటర్లు ఉన్నారు. ఎవరైనా చనిపోతే ప్రధాన రహదారి పక్కనే దహనక్రియలు చేస్తున్నారు. దీనివల్ల ఆ రోడ్డుపై వెళ్లే వాహనదారులు, ప్రజలు ఇబ్బందిపడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల ముందు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లాలో చేపట్టిన పాదయాత్రలో భాగంగా జొన్నవాడ, బుచ్చి మార్గంలో పెనుబల్లి, సాల్మానుపురం మీదుగా బుచ్చికి వెళ్లారు. సాల్మానుపురం వద్ద ఆ గ్రామ ప్రజలు ఆయనకు స్వాగతం పలికి వారి భూములు, స్మశాన సమస్యలను విన్నవించుకున్నారు. దీంతో స్పందించిన జగన్ అధికారంలోకి రాగానే ఆ సమస్యల పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అయితే, ఇది జరిగే దాదాపు ఐదేళ్లు గడుస్తున్నా ఆ సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. స్మశాన వాటిక లేకపోవడంతో గ్రామంలో ఎవరైనా చనిపోతే మృతదేహాలను రోడ్డు మార్జిన్‌లోనే దహనం చేసుకుంటున్నారు. ఆరేళ్లు గడిచినా తమ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో సాల్మానుపురం వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం

చేతులుడిగి చూస్తున్నాం

గ్రామ సమీపంలో ఆక్రమణలో ఉన్న సర్వే నెంబరు 151-సీలోని 53 సెంట్లు డొంక పోరంబోకును స్మశానానికి కేటాయిస్తూ గ్రామ పంచాయతీ తీర్మానించినా ప్రయోజనం శూన్యం. అప్పటి నుంచి పలువురు కలెక్టర్లు, తహసీల్దార్లు, మంత్రులకు మొరపెట్టుకున్నా న్యాయం చేయకపోగా ఆ డొంక పోరంబోకు భూమిని కూడా అధికారులు కబ్జాదారులకే కట్టబెట్టారు. ఆరేళ్ల క్రితం మా సమస్యను ప్రస్తుత సీఎం జగన్‌కు విన్నవించుకున్నా ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో చేసేదిలేక చేతులుడిగి చూస్తున్నాం.

- సిద్దన కొండారెడ్డి, మాజీ ఎంపీటీసీ

యువత భవితకు భరోసా ఇచ్చేవారికే ఓటు



యువత భవితకు భరోసా ఇచ్చే వారికే నా తొలి ఓటు. యువతీ,యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలసజీవు లుగా మారుతున్నారు. ఉచితాల పేరుతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చకుండా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ప్రభుత్వాలు ఆసరాగా నిలవాలి. ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం ఉచితంగా అందించేలా నేతలు కృషిచేయా లి. ప్రతి ఒక్కరూ ఆలోచించి తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలి.

- మాదాల జనార్దన్, బీటెక్ సెకండ్ ఈయర్, ముసునూరు, కావలి

యువగళం


వినండహో..

ఉచితంగా 'లంచం-రాజకీయాలు' కరదీపిక



ఎన్నికల్లో గెలిపే పరమావధిగా అభ్యర్థులు ఓటర్లను వివిధ రకాలుగా ప్రలోభపెడుతున్నారు. ఇప్పటి వరకు ఎన్నికల్లో లంచం రాజకీయాలపై అక్షరాల నిప్పుకణికలను కరదీపికగా రూపొందించారు. రక్తదాత తిక్కవరపు సుకుమార్‌రెడ్డి సొంత ఖర్చులతో ముద్రించిన ఈ కరపత్రాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కావాల్సిన వారు రూపాయి విలువ కలిగిన తపాలా బిళ్ల అంటించి సొంత చిరునామా రాసిన 5 ఇంటూ 8 సైజు కవరును ఆయనకు పంపితే ఆ కరదీపికను పోస్టులో పంపుతారు. చిరునామా - తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, డోర్ నెంబరు 223/2వ అంతస్తు, సచివాలయం ఎదురు భవనం, ఈశ్వరప్రగడవారి వీధి, సుమంగళి కళ్యాణ మండపం ఎదురువీధి, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు-524002, ఫోన్ నెంబరు 0861-2325125.

- నెల్లూరు (సాంస్కృతికం)



కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం కేడర్‌లో జోష్ కనిపిస్తోంది. ఇంటూరి నాగేశ్వరరావుకు టికెట్ ఇవ్వడాన్ని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, యువనేత ఇంటూరి రాజేష్‌లు తీవ్రంగా వ్యతిరేకించారు. తనను పార్టీ నిర్లక్ష్యం చేస్తున్నదన్న అసంతృప్తితో ఇండిపెండెంట్‌గా పోటీకి సిద్ధపడ్డ ఇంటూరి రాజేష్ తన మనసు మార్చుకున్నారు. నాగేశ్వరరావుపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతూ ఆయన విజయానికి పనిచేసేదే లేదని భీష్మించుకున్న దివి శివరాం సైతం మెత్తబడ్డారు. ఈ పరిణామాలు టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కొండంత ఉత్సాహాన్ని ఇచ్చాయి.

- కందుకూరు

కందుకూరులో ఒక్కటైన టీడీపీ నాయకులు

వైసీపీ కేడర్‌లో గుబులు

ఇప్పుడిప్పుడే బయటపడుతున్న విభేదాలు

చల్లారిన జ్వాల.. తమ్ముళ్లలో జోష్!

టీడీపీలోని వర్గవిభేదాలు తమకు కలిసివస్తాయని వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్‌తోపాటు ఆ పార్టీ నాయకులు సంబరపడ్డారు. మరోవైపు ఈ పరిణామాలతో టీడీపీ కేడర్‌లోనూ తీవ్ర నిరాశ నిస్పృహలు నెలకొన్నాయి. పంచా యతీ ఎన్నికల సమయంలో తమకు అండగా నిలిచిన రాజేష్‌ను కాదనాలా, ఎన్నో ఏళ్లుగా శివరాంతో ఉన్న అనుబం ధాన్ని తెంచుకోవాలా లేక వారి కోసం 45 ఏళ్లుగా టీడీపీతో ఉన్న బంధాన్ని వదులుకోవా లో అర్థంకాక పలువురు సతమతమయ్యారు. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేష్, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి మధ్యవర్తిత్వంతో అసమ్మతి చల్లారింది. మొన్నటి వరకు గ్రామగ్రామాన రెండువర్గాలుగా విడిపోయి పనిచేసిన టీడీపీ శ్రేణులు ప్రస్తుతం ఏకతాటిపై పని చేయటానికి సిద్ధపడ్డాయి.


ఇంటూరి


బుర్రా

వైసీపీలో ఉలికిపాటు

టీడీపీలో అసమ్మతి జ్వాలలు చల్లారడం, ఇంటూరి బ్రదర్స్ చేతులు కలపడంతో వైసీపీ వర్గీయులు ఉలిక్కిపడ్డారు. ఆ పార్టీలోని వర్గ విభేదాలు తమకెంతో కలిసి వస్తాయన్న వారి ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. అనూహ్యంగా టీడీపీ నేతలంతా ఒకటికావటంతో పాటు వైసీపీలోని వర్గవిభేదాలు మెల్ల మెల్లగా వెలుగులోకి వస్తుండటం ఆ పార్టీ శ్రేణులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఐదేళ్లుగా ఆ పార్టీ అధికారంలో ఉండ టంతో సహజంగానే వర్గాలు ఏర్పడ్డాయి. దీనికితోడు నియోజక వర్గంపై పట్టున్న సిట్టింగ్ ఎమ్మెల్యే మహీధరరెడ్డిని కాదని, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌ను కందుకూరు అభ్యర్థిగా ప్రకటించటం కూడా పెద్ద సమస్యగా మారింది. ప్రతి గ్రామంలో రెండు మూడు వర్గాలు ఉండటం, వారిలో ఎవరి బలం ఎంతో ఎవరికి ఏమేరకు ప్రాధాన్యత ఇవ్వాలో బుర్రాకు అవగాహన లేకపోవటం ఆపార్టీకి తలనొప్పిగా మారింది. దీంతో ఒకరికి బాధ్యత ఇస్తే నలుగురు అలకబూనే పరిస్థితులు వైసీపీని అతలాకు తలం చేస్తున్నాయి. కొన్నిచోట్ల జనబలం లేని నేతలే ముందుకు వచ్చి పెత్తనం చేస్తుండటంతో ప్రజల్లో పట్టున్న నేతలు మొక్కుబడిగా పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. దీనికితోడు రెండు, మూడుసార్లు బుర్రాను కలిసి మాట్లాడిన గ్రామస్థాయి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులను కూడా ఆయన గుర్తు పెట్టుకోవటం లేదని విమర్శలు ఉన్నాయి. వీటన్నిటికీ తోడు ఎమ్మెల్యే మహీధరరెడ్డి వైసీపీ అభ్యర్థి బుర్రాకు మద్ధతి స్తున్నప్పటికీ ఆయనను అభిమా నించే కొంతమంది మహీధర్‌కు జగన్ టికెట్ ఉద్దేశపూర్వ కంగా ఇవ్వక పోవటాన్ని జీర్ణించుకోలేక పోతు న్నారు. జగన్‌కు తగిన బుద్ధి చెప్పాలన్న కృత నిశ్చయంతో ఉన్నట్లు బహిరంగంగానే వ్యాఖ్యా నిస్తున్నారు. జగన్‌కు తగిన సమాధానం చెప్ప టం అంటే వారంతా వైసీపీ ఓటమే లక్ష్యంగా టీడీపీకి ఓటు వేస్తారని అర్థమైపో తోంది. ఈ పరిస్థితుల్లో కందుకూరులో వైసీపీకి గడ్డుకాల మేనన్న ఆందోళన ఆ పార్టీ క్యాడర్‌లో నెలకొంది.

వర్తమానం..



కల్లుతో కానిద్దాం..!

ఎండాకాలం.. అందులోనూ ఎన్నికల సీజన్... దానికితోడు ప్రభుత్వ మద్యం దుకాణాలు మధ్యాహ్నానికే మూత... ఇంకేముంది...! మందుబాబులంతా కల్లు అంగళ్లపైకి మళ్లారు. జిల్లా వ్యాప్తంగా కొద్ది రోజుల నుంచి కల్లుకు బాగా డిమాండ్ పెరిగింది. జెగ్గు కల్లు రూ. 15లకే దొరుకు తుండటంతో అంతా అటువైపే మొగ్గుతున్నారు. ఎన్నికల సీజన్ కావడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఈసీ ఆంక్షలు విధించ డంతో దుకాణాలన్నీ మధ్యాహ్నానికే మూతపడుతున్నాయి. నిత్యం మద్యం సేవించేవారికి ఈ విధానం ప్రతికూలంగా మారడంతో వారంతా కల్లు దుకాణాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఉదయం, సాయంత్రం కూలీ పనులకు వెళ్లి వారి నుంచి, ఎన్నికల ప్రచారంలో పాల్గొనేవారు సైతం కల్లుతోనే సరిపెట్టుకుంటున్నారు. తాటిచెట్ల వద్దకు చేరుకుని లొట్టిల లెక్క కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. గతంలో ప్రధాన రహదారుల వద్ద దుకాణాలు పెట్టుకుని కల్లు అమ్ముతుండగా, ఇప్పుడు ఏకంగా తాటిచెట్ల వద్దే హోల్‌సేల్‌గా కల్లు కొనుగోలు చేస్తున్నారు.

- నెల్లూరు (సిటీ)



అదీ మందు

మందు లేకుంటే


ఎట్టా చెప్మా..!

- రాజకీయ పక్షాల తర్జన భర్జన
- దుకాణాల్లోని సగం సరుకు వైసీపీ నేతలకే..
- ముందుజాగ్రత్తగా నిల్వలు
- ఇతర రాష్ట్రాల మద్యం జోరు


కందుకూరు, ఏప్రిల్ 25: మందు లేకుంటే ఎట్టా చెప్మా.. ఎన్నికలంటే మందుబాబులదేకదా సందడి. నామినేషన్ల ఘట్టం మొదలు పోలింగ్ పూర్తయ్యేవరకు వారిని తృప్తిపరచకుంటే ఆ తలనొప్పి భరించేది కాదంటూ నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఓట్లకోసం ఎంత డబ్బు పంపిణీ చేసినా, చాలినంత మందు పోయలేకపోతే మందుబాబులంతా నెగెటివ్ ప్రచారం చేస్తారు. ఎన్నికల నగారా మోగి, ప్రచారంలో నేతలు తలమునకలై ఉన్నా వారి ఆలోచనలన్నీ మద్యం ఎలా తెప్పించాలనే... తీసుకువస్తే ఎక్కడ నిల్వ చేయాలి.. దాన్ని మందుబాబుల చెంతకు ఎలా చేర్చాలి..? అనే దానిపైనే చర్చలు సాగుతున్నాయి. అక్రమంగా మద్యం రవాణాలో ఆరితేరిన వారికి ప్రత్యేకంగా ఈ బాధ్యతలు అప్పగించి, అక్రమ నిల్వలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇప్పటికే నిల్వలు

కందుకూరులో ఇప్పటికే వైసీపీ నేతలు పెద్దఎత్తున మద్యాన్ని తెప్పించి అక్రమంగా నిల్వచేసినట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రస్తుతం మద్యం తయారీ, రవాణా, విక్రయం అంతా ప్రభుత్వం ముసుగులో నడుస్తుండటంతో వారికి కొంత వెసులుబాటు కనిపిస్తోంది. ఇటీవల మధ్యాహ్నానికే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నోస్టాక్ బోర్డులు పెట్టేస్తున్నారు. ఇందుకు కారణం మద్యం అంతా వైసీపీ అభ్యర్థులకోసం పక్కదారిపడుతుండడమే. కందుకూరులో ఇప్పటికే అధికారపార్టీ నేతలు రెండు లారీల చీప్‌లిక్కర్‌ను అక్రమంగా నిల్వ చేసినట్లు సమాచారం. కాగా మద్యం ఎలా నిల్వ చేయాలని టీడీపీ నేతలు సతమతమవుతున్నారు. అధికార పార్టీవారు రాష్ట్రంలో తయారయ్యే మద్యాన్ని అక్రమ పద్ధతుల్లో తెప్పించుకునే వెసులుబాటు ఉంది. అలాగే పక్కనే ఉన్న తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, గోవా తదితర రాష్ట్రాల నుంచి కూడా మద్యాన్ని అక్రమ మార్గంలో తెప్పించుకుని నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అయితే టీడీపీకి పక్క రాష్ట్రాల నుంచి మద్యం తెప్పించుకోవటం మినహా మరోమార్గం లేదు. ప్రభుత్వ దుకాణాల నుంచి కూడా వారికి మద్యం లభించే అవకాశం లేదు. గోవా రాష్ట్రానికి చెందిన మద్యాన్ని కందుకూరుకు చెందిన ఓ పార్టీ నేతలు తెప్పిస్తుండగా ముందస్తు సమాచారంతో ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు రెండురోజులక్రితం సీజ్ చేసిన విషయం తెలిసిందే. ధర ఎక్కువైనా ఫర్వాలేదు... మాకు అవసరం మేరకు మద్యం సరఫరా చేయమని మధ్యవర్తులతో చర్చలు జరుపుతున్నారు. చీప్‌లిక్కర్ కూడా సగానికి సగం అదనంగా చెల్లించి కొనుగోలు చేయటానికి సిద్ధపడుతున్నట్లు సమాచారం.


ప్రభుత్వ మద్యం దుకాణాలు మధ్యాహ్నానికి మూత

కోవూరు పట్టణ వ్యూ



రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం

ఎంతోమంది ప్రముఖులను అందించిన స్థానం

ముఖచిత్రం

చైతన్యానికి చిరునామా కోవూరు

కోవూరు, ఏప్రిల్ 25 : రాష్ట్ర రాజకీయాల్లో కోవూరు నియోజక వర్గానికి ప్రత్యేక స్థానముంది. చైతన్యానికి చిరునామాగా ఈ సెగ్మెంట్ నిలిచింది. ఇక్కడ నుంచి ఎన్నికయిన ఎంతో మంది ప్రముఖులు రాష్ట్రరాజ కీయాల్ని ప్రభావితం చేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన తరువాత కోవూరు నియోజకవర్గ పరిధిలోకి కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట మండలాలు చేరాయి. అంతకుముందు సంగం, బుచ్చి, కోవూరు, కొడవలూరు, విడవ లూరు మండలాలు మాత్రమే ఉండేవి. 1962 నుంచి ఇప్పటి వరకు 15 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలోనే రెండుసార్లు ఉపఎన్నికలు జరగ్గా నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి విజయం సాధించారు. మే13న జరగనున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో సుదీర్ఘ రాజకీయ అనుభవ మున్న నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి తలపడుతున్నారు.

● కమ్యూనిస్టుల కంచుకోట

1951 నుంచి 1962 వరకు కోవూరు కమ్యూనిస్టుల కంచుకోటగా ఉండేది.



కోవూరు నియోజకవర్గ మ్యాపు

ఇందుకూరుపేట, అల్లూరులతో కలిసిన ద్విసభ్య నియోజకవర్గం నుంచి కమ్యూనిస్టు పార్టీ నాయకులు బస్వారెడ్డి శంకరయ్య, స్వర్ణా వేమయ్య గెలుపొందారు. 1962లో కమ్యూనిస్టులపై పోటీచేసి గెలిచిన రేబాల దశరథరామిరెడ్డి అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1972,1978 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన పెళ్ళకూరు రామచంద్రారెడ్డి కోస్తా అభివృద్ధి మండలి చైర్మన్‌గా, ఇఫ్కో చైర్మన్‌గా పనిచేశారు. 1983లో టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించిన నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి రాష్ట మంత్రిగా పలు కీలకశాఖలు నిర్వహించారు.1983 ఎన్నికల్లో సీపీఎంకు కేటాయించక పోవడంతో వామపక్షాలు, టీడీపీ మధ్య పొత్తు కుదరలేదని చెబుతా రు. నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఎమ్మెల్యే ఎన్నికై నప్పటి నుంచి కోవూరు ఎప్పుడూ కూడా రాష్ట్ర రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూనే కన్పించింది.

● ఇక్కడ నుంచే పుచ్చలపల్లి ప్రస్థానం

కోవూరు నుంచి కేంద్ర, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసిన ఎందరో మహానుభావులు ఎన్నికయ్యారు. పార్లమెంటులో తొలి ప్రతిపక్షనాయకుడు, దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య నియోజకవర్గ పరిధిలోని అలగానిపాడు నుంచే రాజకీయ ఓనమాలు దిద్దుకున్నారు. ఆంధ్రరాష్ట్ర మొద టి ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి స్వగ్రామం బుచ్చిరెడ్డిపాళెం. ఆయన సోదరుడు బెజవాడ పాపిరెడ్డి గొప్ప పార్లమెంటేరియన్‌గా పేరుపొందారు. ఆయన కూడా బుచ్చి నివాసే.

ఇప్పటి వరకు కోవూరులో విజయం సాధించిన నేతలు

సంవత్సరం	విజేత	పార్టీ
1962	రేబాల దశరథరామిరెడ్డి	కాంగ్రెస్
1967	కే వెంకురెడ్డి	కాంగ్రెస్
1972	పెళ్ళకూరు రామచంద్రారెడ్డి	కాంగ్రెస్
1978	పెళ్ళకూరు రామచంద్రారెడ్డి	కాంగ్రెస్
1983	నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి	టీడీపీ
1985	నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి	టీడీపీ
1989	నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి	కాంగ్రెస్
1993	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడి	టీడీపీ
1994	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి	టీడీపీ
1999	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి	టీడీపీ
2004	పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి	కాంగ్రెస్
2009	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి	టీడీపీ
2012	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడి	వైసీపీ
2014	పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి	టీడీపీ
2019	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి	వైసీపీ


ఏబీ ఫారాలంటే...?

తెలుసుకుందాం

ఏ ఎన్నికల సమయంలో ఏ ఫారం, బీఫారం అనే పదాలు తరుచూ వింటుంటాం. గుర్తింపు పొందిన ప్రాంతీయ /జాతీయ పార్టీలు తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులకు బీఫారం ఇస్తాయి. అంటే పలానా నియోజకవర్గం నుంచి తమ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థి ఇతనే అని ఇచ్చే ధ్రువీకరణ పత్రమే ఇది. ఈ ఫారాన్ని పార్టీ అధ్యక్షుడుకాని, ఆ పార్టీకి చెందిన ప్రత్యేక ప్రతినిధి కానీ అభ్యర్థులకు అందిస్తారు. నామినేషన్ వేసే సమయంలో ఆర్వోకి బీఫారం దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇలా సమర్పించిన అభ్యర్థులకే ఎన్నికల కమిషన్ ఆ పార్టీ గుర్తును కేటాయిస్తుంది. లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తుంది. బీఫారం ఇచ్చే అధికారాన్ని అప్పగిస్తూ ఇచ్చేదే ఏ ఫారం. దీన్ని తీసుకున్న వ్యక్తే అభ్యర్థులకు బీఫారం ఇచ్చే అధికారం ఉంటుంది.

- సంగం

మాటకు ప్రాధాన్యం ఇచ్చేవారు..



యాభైఏళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో మాటకు ప్రాధాన్యమిచ్చేవారు. ఏ జాము అయినా నాయకుడు ఇళ్ల కాడికి వచ్చి... ఎన్నికల్లో నిలుస్తున్నా.. ఏమంటావ్... మనోళ్లతో మాట్లాడు... అని చెప్పేవాడు. డబ్బు మాటే మాట్లాడే వారు కాదు. సందేశ కుటుంబ సభ్యులతో కలసి మాట్లాడి ఓ నిర్ణయానికి వచ్చేవాళ్లం. అది కూడా ఇంటి పెద్ద నిర్ణయం మేరకు ఓట్లు వేసేవాళ్లం. ఆ రోజుల్లో అభివృద్ధి చేసే వాళ్లే పోటీ పడేవారు. మాటకు కట్టుబడి ఉండేవారు. ఈ రోజుల్లో అలాంటి వారు కరువయ్యారు.

- గనిపినేని నాగరాజు, బిట్రగుంట

నా జ్ఞాపకం

కోవూరు
సర్వేపల్లి

సర్వేపల్లిలో భారీ ఓటమి దిశగా కాకాణి : సోమిరెడ్డి

వెంకటాచలం, ఏప్రిల్ 25 : సర్వేపల్లి నియోజకవర్గంలో మే 13న జరిగే ఎన్నికల్లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి భారీ ఓటమి దిశగా వెళ్తున్నాడని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వేదాయపాళెంలోని సోమిరెడ్డి కార్యాలయంలో గురువారం సర్వేపల్లి, తిక్కవరప్పాడు, గొలగమూడి, నిడిగుంటపాళెం, తిరుమలమ్మపాళెం గ్రామాల నుండి 120 కుటుంబాలు, నిడిగుంటపాళెం వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు మేకల ప్రవళిక, వార్డు సభ్యులు నన్నం పెంచలయ్య, మేకల పద్మమ్మ, ఈగ వెంకటరమణయ్య, తిరుమలమ్మపాళెం సర్పంచ్ దాన శ్రీపద్మ, ఏడుకొండలు దంపతులు, పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వీరికి సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానిం చారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ మండలాధ్యక్షులు గుమ్మడి రాజా యాదవ్, కుంచి శ్రీనివాసులు యాదవ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుంకాల నాగేంద్రప్రసాద్, నాయకులు ఈపూరు మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు: : సోమిరెడ్డితోపాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు

సర్వేపల్లిలో అరాచకాలను అరికడతా..

తోటపల్లిగూడూరు: ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తే అండగా ఉంటానని టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నరుకూరు, కొత్తపాలెం గ్రామాలలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో అరాచకాలను అరికట్టాలంటే తనను గెలిపించాలని ప్రజలను సోమిరెడ్డి కోరారు. ముందుగా సర్పంచ్ చేవూరు పద్మావతి గజమాలతో సోమిరెడ్డిని సత్కరించి స్వాగతం పలికారు. ఈ కార్యక్ర మంలో నాయకులు బొమ్మి సురేంద్ర, సురేష్‌రెడ్డి, కొణతం రఘుబాబు, పాకం వెంకయ్య, అన్నం శ్రీనివాసులు, చేవూరు శ్రీనివాసులు, శ్రీరామ్ శ్రీహరి, వెంకటేశ్వర్లు, షేక్.కాలేషా, జనసేన బీజేపీ నాయకులు, తది తరులు పాల్గొన్నారు. కాగా, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు పాల్గొని సోమిరెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు.

ప్రజలే సోమిరెడ్డి బలం : సింధురెడ్డి

వెంకటాచలం : సర్వేపల్లి ప్రజలే తన తండ్రి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బలమని కుమార్తె డాక్టర్ సోమిరెడ్డి సింధురెడ్డి అన్నారు. మండలంలోని కురిచెర్లపాడు గ్రామంలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మావిళ్లపల్లి శ్రీనివాసులునాయుడు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

ప్రజల జోలికొస్తే ఊరుకోం : శృతిరెడ్డి

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు తాము అండగా ఉంటామని, అమాయక ప్రజల కొస్తే ఎంతటి వారైనా ఊరుకునేది లేదని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోడలు శృతిరెడ్డి పొదలకూరు వైసీపీ నాయకులను హెచ్చరించారు. టీడీపీ జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి పట్టణంలోని శ్రామికనగర్, వినాయకమాన్యం, పద్మావతినగర్, తొగట వీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, నువ్వుల కవిత, ఆదాల సుగుణమ్మ, వెంపులూరు అరుణ, కొంగి మస్తానమ్మ, పట్టణాధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జుననాయుడు, దేవరం సాయిసుధీషా, గ్రామ టీడీపీ నాయకులు దేవినేని నరసపనాయుడు, పోతుగుంట రామలింగయ్య, పిన్నెలి ప్రభాకర్, హరినారాయణ పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

పొదలకూరు, ఏప్రిల్ 25 : ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పొదలకూరు సీఐ రాంబాబు, ఎస్ఐ డి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం పొదలకూరు పట్టణంలోని సంగంరోడ్డు కూడలి నుంచి గేట్ సెంటర్ వరకు, అలాగే మండలంలోని తాటిపర్తి, విరువూరు గ్రామాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవచ్చని, ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీసుశాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రాంబాబు, ఎస్ఐ రామకృష్ణ, బీఎస్ఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

పొదలకూరు, ఏప్రిల్ 25 : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ నరసింహరావు ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలందరూ దోమకాటు వ్యాధులైన మలేరియా, చికున్‌గున్యా, డెంగ్యూ, మెదడువాపు, ఫైలేరియా లాంటి వ్యాధుల నుంచి రక్షణ పొందుటకు దోమల లార్వాను నిర్వీర్యం చేయడానికి ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఈ ర్యాలీలో డాక్టర్ స్రవంతి, డాక్టర్ కిరణ్ రిషిత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆదిలక్ష్మీ, ఆరోగ్య విస్తరణాధికారి టి రవికుమార్, సీనియర్ సహాయకులు వాసుదేవరావు, హెల్త్ సూపర్‌వైజర్ కె శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

తరుణవాయి పాఠశాలలో చోరీ

- ల్యాప్‌టాప్, ప్రింటర్, నాడు-నేడు ఫ్యాన్లు మాయం
- క్ల్యూస్ టీమ్ పరిశీలన

సంగం, ఏప్రిల్ 25: తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తలుపులను గుర్తుతెలియని దుండగులు పగలకొట్టి ల్యాప్‌ట్యాప్, ప్రింటర్, నాడు-నేడు వచ్చిన ఫ్యాన్లు చోరీకి పాల్పడ్డారు. ఈ విషయం గురువారం ఉదయం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉన్నత పాఠశాలకు ఇటీవల నాడు-నేడు పథకంలో ల్యాప్‌ట్యాప్, ఒక ప్రింటర్, ఫ్యాన్లు మంజూరయ్యాయి. మంగళవారం పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో ఉపాధ్యాయులు తాళాలు వేసుకుని వెళ్లారు. పాఠశాలకు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వాచ్‌మెన్‌గా ఉన్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రాధానోపాధ్యాయుల గదికి వేసిన తలుపు తాళాలు పగలకొట్టి ఉన్నాయి. సమాచారం అందుకున్న ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు వచ్చి చూడగా అందులోని ఉన్న ల్యాప్‌ట్యాప్, ప్రింటర్, నాడునేడు వచ్చిన ఫ్యాన్లు కనిపించలేదు. దండగులు చోరీకి పాల్పడి ఉంటారని భావించిన ప్రధానోపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



దుండగలు పగలకొట్టిన హైస్కూల్ తలుపు

'ఓపెన్'లో జిల్లాకు ఉత్తమ ఫలితాలు

- టెన్త్, ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం
- సత్తాచాటినఅభ్యాసకులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 25 : సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఫలితాల్లో ఈఏడాది రెండు విభాగాల్లోనూ జిల్లా ద్వితీయస్థానం సాధించింది. గురువారం విడుదల చేసిన ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో జిల్లాకు చెందిన అభ్యాసకులు సత్తా చాటారు. ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం, టెన్త్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు.

● నెలలోపే ఫలితాలు

ఓపెన్‌స్కూల్ ఆధ్వర్యంలో ఉన్నత చదువులు, పదోన్నతులు కోరుకునేవారికి ఈ ఏడాది మార్చి 18 నుంచి 27వతేదీ వరకు పదోతరగతి, ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. టెన్త్ పరీక్షలకు 1,713 మంది, ఇంటర్ పరీక్షలకు 3,591 మంది అభ్యాసకులు కలిపి మొత్తం 5,304 మంది హాజరయ్యారు. ఇందుకుగాను మొత్తం 30 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో గురువారం విడుదలైన ఫలితాల్లో పదోతరగతి పరీక్షలకు 1,624 మంది హాజరు కాగా 1,473 మంది ఉత్తీర్ణత పొందారు. 90.70 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో ద్వితీయస్థానం దక్కించుకున్నారు. అలాగే ఇంటర్ పరీక్షలకు 3,457 మంది హాజరు కాగా 2,985 మంది ఉత్తీర్ణత పొంది 86.35 శాతం ఉత్తీర్ణతను సాధించి రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచారు.

● జూన్ 1నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ

ఫెయిల్ అయిన విద్యార్థులకు జూన్ 1 నుంచి 8వతేదీ వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అసదుల్లాఖాన్ తెలిపారు. అలాగే రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ఏప్రిల్ 29 నుంచి మే7వతేదీ వరకు ఫీజు చెల్లించాలన్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలోని ఓపెన్‌స్కూల్ కేంద్రాలను సంప్రదించి ఫీజు వివరాలు, ఇతర సమాచారం తెలుసుకోవాలన్నారు. అక్కడే సందేహాలను కూడా నివృత్తి చేసుకోవాలని తెలిపారు.

ఏఆర్‌టీ, ఎంఆర్‌వీల తనిఖీ

బిట్రగుంట, ఏప్రిల్ 25: బిట్రగుంట రైల్వేస్టేషన్ సెక్షన్ పరిధిలోని ఏఆర్‌టీ (యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్), ఎంఆర్‌వీ (మెడికల్ రిలీఫ్ వ్యాన్) డ్రైవర్లు, గార్డుల విశ్రాంతి భవనాన్ని విజయవాడ ఏడీఆర్ఎం శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. విజయవాడ నుంచి ఆయన బుధవారం రాత్రి బిట్రగుంట రైల్వే అధికారుల విశ్రాంతి భవనానికి ఆయన చేరుకున్నారు. రైలు ప్రమాదాలు జరిగిన సమయంలో ఏఆర్‌టీ ద్వారా సంఘటనా స్థలానికి తీసుకువెళ్లాల్సిన పరికరాలను, వస్తు సామగ్రిని ఆయన పరిశీలించారు. ఆ సమయంలో ఎలా పనిచేస్తారనే విషయమై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డ్రైవర్లు, గార్డుల విశ్రాంతి భవనంలో వసతుల విషయమై సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట సీనియర్ డీఎంఈ రవికిరణ్, సీనియర్ డీఎస్‌వో ప్రశాంత్, స్థానిక రైల్వే వైద్యులు సుధాకర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఏఆర్‌టీలో పరిశీలిస్తున్న ఏడీఆర్ఎం శ్రీనివాసరావు

● వాకర్స్‌తో మాటామంతీ

రైల్వే క్రీడామైదానంలో ఏడీఆర్ఎం శ్రీనివాసరావు వాకర్స్‌తో కలిసి గురువారం ఉదయం వాకింగ్ చేశారు. ఈ సందర్భగా అసోసియేషన్ కోశాధికారి జీవన్‌కుమార్ రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానం అభివృద్ధిపై ఆయనతో మాట్లాడారు. కాగా అక్కడున్న కుండలోని నీటిని ఏడీఆర్ఎం పిడతతో ముంచుకుని తాగారు.

ఉత్తర కాలువకు నీటి సరఫరా తగ్గింపు

అనంతసాగరం, ఏప్రిల్ 25: సోమశిల జలాశయం నుంచి ఉత్తర కాలువకు సరఫరా చేస్తున్న నీటి మోతాదును తగ్గించారు. డ్యాం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారానికి ప్రాజెక్టులో 8.316 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర కాలువకు 100 క్యూసెక్కుల నుంచి 5, దక్షిణ కాలువకు 25 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

డిగ్రీ పరీక్షలలో నలుగురి డీబార్

వెంకటాచలం, ఏప్రిల్ 25 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ ఐదవ, ఆరవ సెమిస్టర్ పరీక్షల్లో 541 మంది, మధ్యాహ్నం జరిగిన నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో 44 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఉదయం కావలిలోని జవహర్ భారతీ డిగ్రీ కళాశాలలో ఒకరు, మధ్యాహ్నం నెల్లూరులోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఒకరు, కావలిలోని జవహర్ భారతీ డిగ్రీ కళాశాలలో ఇద్దరు మొత్తం నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి, రెండు కుక్కల మృతి

సీతారామపురం, ఏప్రిల్ 25: బసినేనిపల్లి పంచాయతీలోని పరమటి రొంపిదొడ్లలో పామూరుకు చెందిన నాగలూరి వెంకటేష్, రెండు కుక్కలు గురువారం పొలం వద్ద విద్యుదాఘాతానికి గురై మరణించాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పామూరు నాగలూరి వెంకటేష్, అతని బంధువులు వారితో పాటు రెండు కుక్కలతో అడవి పందులను వేటకు వెళ్లారు. గురువారం తెల్లవారు జామున 2గంటలకు ఇర్ల రామయ్య, ఇర్ల వెంటయ్య అనే రైతులు వారి మొక్కజొన్న పొలానికి వున్న కంచెకు విద్యుత్ సరఫరా ఇవ్వడంతో కరెంట్ షాక్ తగిలి రెండుకుక్కలు అక్కడికక్కడే మృతి చెందాయి. నాగలూరి వెంకటేష్‌కు విద్యుత్ తీగ తగిలి షాక్ తగిలి పడిపోగా అతన్ని అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ అక్కడ మరణించినట్లు ఎస్ఐ అనూష తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు సీతారామపురం ఎస్ఐ అనూష కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనికేపల్లిలో పోక్సో కేసు నమోదు

వెంకటాచలం: మండలంలోని అనికేపల్లి గ్రామానికి చెందిన రాజా అనే వ్యక్తిపై గురువారం పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. బుధవారం గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలుడికి గాలి పంపు ద్వారా రాజా గాలి కొట్టడంతో ఆ బాలుడి పొట్ట ఉబ్బిపోయి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆ బాలుడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈవిషయంపై గురువారం బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రాజాపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	138
లేయర్ లైవ్	93
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	272
లేయర్	158

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6848
వెండి కిలో ధర	రూ. 83,400
వెండి ఒక గ్రాము	రూ. 85.40

సైనికుల్లా పనిచేసి మెజార్టీ తీసుకురండి !

- వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కురుగొండ్ల

సైదాపురం, ఏప్రిల్ 25: ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా సమిష్టి కృషితో పని చేసి బూత్ లెవల్‌లో ఎక్కువ మెజార్టీతో గెలిపించాలని.. అనంతరం మీకు పనిచేసే బాధ్యత తనది అని ఉమ్మడి వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం వేములచేడు, నలబొట్లపల్లి, పాతాళపల్లి, పాలూరురాజుపాళెం, పాలూరు, అనంతమడుగు, గంగాదేవిపల్లి, ఊటుకూరుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు సూపర్-6 పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతమడుగులో అనారోగ్యంతో ఉన్న టీడీపీ సీనియర్ నాయకుడు మన్నారపు శ్రీనివాసులుయాదవ్ పరామర్శించారు. దళితవాడలో టీడీపీ సీనియర్ నాయకుడు దాశినేని దామోదర్‌నాయుడు, దాశినేని మోహన్‌నాయుడు సమక్షంలో వైసీపీకి చెందిన 15 కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి కురుగొండ్ల రామకృష్ణ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌రెడ్డి దోచుకోవడం దాచు కోవడం తప్ప అభివృద్ధి చేపట్టలేదన్నారు. సైకిల్ గుర్తుకు, కమలం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. టీడీపీ ప్రభుత్వం రాగానే భూ సమస్యలు ఉన్న వారందరికీ న్యాయం చేస్తామన్నారు. పాలూరు నుంచి నిండలి మధ్య కైవల్యానదిపై వంతెన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి కొళాయి నీటి సరఫరా, ఇళ్లులేని వారికి సొంత ఇంటి సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకీ నానాజీ, టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి, తిరుపతి పార్లమెంట్ నియోజక వర్గం టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు కొండూరు సుబ్రహ్మణ్యం రాజు, జోగిపల్లి సర్పంచు గుంటమడుగు కృష్ణంరాజు, తెలుగు రైతు మండల అధ్యక్షుడు కేపీ రాజు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు నలమారు వెంకటేశ్వర్లు రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు నోటి రమణారెడ్డి, బెల్లంకొండ మస్తాన్ నాయుడు, చెరుకూరు మునెయ్య నాయుడు, దశయ్య నాయుడు, మేడికొండ రమణయ్య నాయుడు పాల్గొన్నారు.



సైదాపురం: పాలూరు రాజుపాళెంలో కురుగొండ్ల రామకృష్ణకు స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు



అనంతమడుగులో టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు

ఆర్యవైశ్యుల ఆడపడుచును..
ఆదరించండి.. అండగా ఉంటాం!

- తిరుపతి ఎంపీ బీజేపీ అభ్యర్థి వరప్రసాద్ భార్య వెలగపూడి లక్ష్మి
- ఎంపీగా వరప్రసాద్, ఎమ్మెల్యేగా సోమిరెడ్డిని గెలిపించాలని ప్రచారం



పొదలకూరు ఆర్యవైశ్య నాయకులతో ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ భార్య వెలగపూడి లక్ష్మి

పొదలకూరు, ఏప్రిల్ 25: తాను ఆర్యవైశ్యుల ఆడపడుచునని, తన భర్త ఎన్డీఏ ఎంపీ అభ్యర్థి వెలగపూడి వరప్రసాద్‌ను ఆర్యవైశ్యులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించాలని, వారికి అండగా తాను ఉంటానని వరప్రసాద్ సతీమణి లక్ష్మీ అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి, అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆర్యవైశ్యుల ఆత్మీయ సభలో ఆమె మాట్లాడుతూ 2014 ఎంపీ ఎన్నికల సమయం నుంచి పొదలకూరు కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకోవడం, ఆలయ అభివృద్ధిలో తాను కూడా భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు. ఆర్యవైశ్యుల ఆడపడుచునైన తనను, మండల ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలందరూ ఆశీర్వదించాలని, తన భర్తకు అత్యధిక మెజారిటీ తెచ్చిపెట్టాలన్నారు. తన భర్త విజయం కోసం పాటుపడిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు అండగా ఉండి గుండెల్లో పెట్టి చూసుకుంటామన్నారు. అలాగే సర్వేపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కూడా ఈదఫా అత్యధిక మెజారిటీతో అసెంబ్లీకి పంపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎంపీగా వరప్రసాద్, సోమిరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా డబుల్ ఇంజన్‌తో పనిచేసి రాష్ట్ర అభివృద్ధితోపాటు, నియోజకవర్గం సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, వరప్రసాద్ తోడల్లుడు శ్రీనివాస్, రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమర్తలూరి చెంచయ్య, పొట్టి సుధాకర్, యువజన ప్రెసిడెంట్ సురేంద్ర, ఫైడా కామేశ్వరరావు, గుర్రం మీరామధు, కృష్ణం వెంకటరమణయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు అయోధ్యరామయ్యగౌడ్, బోగోలు భాస్కర్‌రెడ్డి, జొన్నలగడ్డ బ్రహ్మయ్య, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లిలో చివరిరోజు ఏడు నామినేషన్లు

వెంకటాచలం, ఏప్రిల్ 25: సర్వేపల్లి నియోజకవర్గానికి చివరిరోజైన గురువారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ పత్రాలను అభ్యర్థులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నఓబులేసుకు అందజేశారు. గురువారంతో నామినేషన్ పర్వం ముగియడంతో సర్వేపల్లి నియోజకవర్గానికి మొత్తానికి 16 మంది అభ్యర్థులు 23 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. పోటీలో టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బీఎస్పీ వంటి ప్రధాన పార్టీల అభ్యర్థులున్నారు. ప్రధాన పార్టీల నుండి ఎవరూ రెబెల్ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేయలేదు.

ఎవరైనా ఇంత నీచరాజకీయాలు చేస్తారా!?

- కోవూరు అభ్యర్థి ప్రశాంతిరెడ్డి భావోద్వేగం ● కన్నీటిపర్యంతం.. ఓదార్చిన మహిళలు



బుచ్చిరెడ్డిపాళెం: ప్రశాంతిరెడ్డిని ఓదారుస్తున్న మహిళలు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 25 : 'మేము చిన్న, పెద్ద అని ఆలోచించి సంస్కారంతో మాటాడేవాళ్లం. ఆయనకు (ఎమ్మెల్యే ప్రసన్న) సంస్కారం ఉంటే నిన్న, మొన్న చేసిన వ్యాఖ్యలతో ఇంత నీచమైన రాజకీయాలు చేసే మనుషులు కూడా ఉంటారా అనిపించింది. తల్లి, చెల్లి, భార్య, బిడ్డలున్న వారెవరైనా ఇంత నీచ రాజకీయాలు చేస్తారా!? అవి చూసి ఎవరి బిడ్డలైనా తట్టుకోగలరా!?' అని టీడీపీ కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి భావోద్వేగంతో అన్నారు. ఒకానొక దశలో ఆమె కన్నీటిపర్యంతం కావంతో అక్కడే ఉన్న మహిళలు ఓదార్చి మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. గురువారం మండలంలోని కాళయకాగొల్లు, చెల్లాయపాళెం, పల్లాప్రోలు, పోలినాయుడు చెరువు, నాగాయగుంట గ్రామాలలో ప్రశాంతిరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో మహిళలు, యువతీ, యువకులు ఒక సైన్యంగా తనతో నడుస్తున్నారంటే వారే తనకు ఆత్మస్థైర్యం, మనోబలం అని అన్నారు. ఇసుక, గ్రావెల్ మాఫియా, రియల్ దందా గురించి ప్రశ్నిస్తే దానికి సమాధానం చెప్పకుండా చెత్తవాగుడంతా వాగుతున్నాడని, ఖర్మకాలి తనకు అన్న వరుస అవుతాడని ఎమ్మెల్యే ప్రసన్నపై ఫైర్ అయ్యారు. సేవాభావంతో తాను, తన భర్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు సేవలు చేసుకుంటున్నామన్నారు. మాఫియాలు, దోపిడీలు చేసేవాళ్ళం కాదన్నారు. కోవూరు నియోజకవర్గంలో సమస్యలు లేకుండా నిరంతరం అభివృద్ధే నినాదంగా ప్రజల మధ్యే వుంటామని హామీ ఇచ్చారు. పోలినాయుడు చెరువులో ఆర్‌ఓ ప్లాంటు ఏర్పాటు, ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయా గ్రామాల నాయకులు శివ,శంకర్, జనార్దన్, మల్యాద్రి, సుధాకర్, సర్పంచు రజనీకాంత్, మురళి, వెంకటేశ్వర్లు, ,మల్లికార్జున, తిరుపాలు, వెంకటేశ్వర్లు, కూనంకి కృష్ణయ్య, జడ్పీటీసీ సభ్యురాలు సూరా ప్రదీప, పుట్టా ధనలక్ష్మి, కౌన్సిలర్ ప్రత్యూష, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

70 కుటుంబాలు టీడీపీలో చేరిక

బుచ్చిరెడ్డిపాళెంలో గురువారం 70 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఆర్‌కే రవితోపాటు ఆయన ఆధ్వర్యంలో 11, 14, 15 వార్డులనుంచి 40 కుటుంబాలు, వవ్వేరు వైసీపీ నాయకుడు శనగల శ్రావణ్‌కుమార్‌తోపాటు ఆయన అధ్వర్యంలో మరో 30 కుటుంబాలు వైసీపీని వీడి గురువారం వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ ఆమె కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.



కొడవలూరు : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నీలిమారెడ్డి

వేమిరెడ్డి దంపతులతోనే పేదల అభివృద్ధి

కొడవలూరు : వేమిరెడ్డి దంపతులతోనే పేదల అభివృద్ధి సాధ్యమని, ఓటమి భయంతో వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వారికి ప్రజలే ఓటుతో సమాధానం చెప్పనున్నారని కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి అన్నారు. మండలంలో యల్లయపాళెం గ్రామంలో ఏకోల్లు వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం జరిగింది. ఈకార్యక్రమంలో ఆమె పాల్గొ ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయని, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లగా ఏం అభివృద్ధి చేసిందో ప్రజలకు తెలపాలన్నారు. అన్యాయాలు, అక్రమాలు, ప్రజాధనం దోచుకోవడం తప్ప సంక్షేమం మరిచారన్నారు. మహిళల పట్ల చిన్న చూపు తగదన్నారు. ప్రజలు వైసీపీకి చరమ గీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బడుగు శ్రీనివాసులు, రియాజ్ బాషా, ప్రకాశం పాల్గొన్నారు.

వైసీపీ అసమర్థ పాలనకు చరమగీతం పాడదాం : నీలిమారెడ్డి

ఇందుకూరుపేట: వైసీపీ అసమర్థ పాలనకు చరమగీతం పాడదాం అని కోవూరు శాసనసభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొత్తూరులో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీచేసి బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కైలాసం ఆదిశేషారెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి, మునగాల రంగారావు, కుమార్, రామచంద్రయ్య, బీజేపీ నాయకులు కైలాసం లావణ్య, శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, తదితరులు పాల్గొన్నారు.



విడవలూరు: వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ వలంటీర్లు

వేమిరెడ్డి దంపతుల గెలుపే ధ్యేయం

విడవలూరు: వేమిరెడ్డి దంపతుల గెలుపే ధ్యేయంగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని అన్నారెడ్డిపాలెం మాజీ ఎంపీటీసీ సింహాద్రి అయ్యప్ప తెలిపారు. ఈమేరకు గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామానికి చెందిన 10 మంది మాజీ వలంటీర్లు టీడీపీలో చేరగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నివాసంలో వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి శేఖరయ్య, పి నాగేశ్వరరావు, హరి, మధుసూదన్, రవి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ
నెల్లూరు రూరల్

ఎన్నికల పర్వం

సిటీకి 26.. రూరల్‌కి 13

● పూర్తయిన నామినేషన్ల దాఖలు ● నేడు పరిశీలన

నెల్లూరు(సిటీ/వెంకటేశ్వర పురం), ఏప్రిల్ 25 : సార్వత్రిక ఎన్నికల సమరానికి సంబంధించి తొలి అంకం పూర్తయింది. ఈ నెల 18న మొదలైన నామినేషన్ల స్వీకరణ గురువారంతో ముగిసింది. చివరి రోజు నెల్లూరు సిటీ, రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ తరఫున ఆ పార్టీ నాయకులు రెండు సెట్ల నామినేషన్లను ఆర్వో వికాస్ మర్మత్‌కు అందజేశారు. నారాయణ సతీమణి రమాదేవి తరఫున మరో సెట్ పత్రాలు అందచేశారు. వైసీపీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ స్వయంగా నామినేషన్ పత్రాలను ఆర్వో అందచేయగా ఆ పార్టీ నాయకులు మరో సెట్ అందచేశారు. సీపీఎం అభ్యర్థి మూలం రమేష్ పేరిట ఆ పార్టీ నాయకులు రెండు సెట్ల నామినేషన్లు సమర్పించారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ నుంచి బండి గాంధీరెడ్డి, ర్యాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ధర్మయ్యగారు సునీల్‌కుమార్, జై భీంరావ్ భారత్‌పార్టీ నుంచి రామిశెట్టి రఘునాథ్, స్వతంత్రులుగా నారు రవికుమార్‌రెడ్డి, గుండాల పద్మరెడ్డి, బందరు వెంకటశ్రీధర్, దేశాయిశెట్టి హనుమంతురావు, వేలూరు రంగారావు, ఎస్డీపీఐ నుంచి సయ్యద్ మహ్మత్‌ఆలీ నామినేషన్ వేశారు. అలాగే, నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి ఆఖరి రోజు 8 మంది 10 సెట్ల నామినేషన్ పత్రాలను ఆర్వో మల్లోలకు అందజేశారు. టీడీపీ నుంచి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి సునందమ్మ నామినేషన్ వేశారు. కాంగ్రెస్ నుంచి షేక్ ఫయాజ్, సోషల్ డెమోక్రటిక్ పార్టీ నుంచి షేక్ మాస్తాన్‌వలీ, బహుజన సమాజ్‌పార్టీ నుంచి బీ శ్రీరాములు రెండేసి సెట్ల పత్రాలు సమర్పించారు. వైసీపీ నుంచి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, సోషల్ డెమోక్రటిక్ పార్టీ నుంచి సయ్యద్ ఫైజిల్, రెవల్యూషన్ సోషలిస్టు పార్టీ నుంచి సూరిశెట్టి అనిల్‌కుమార్ 2 సెట్లు ధాఖలు చేశారు. మొత్తంగా నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి 26 మంది వ్యక్తులు 39 సెట్ల నామినేషన్లు వేయగా, రూరల్ నుంచి 13 మంది 28 సెట్ల పత్రాలు సమర్పించారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన జరుగుతుందని నెల్లూరు రూరల్ ఆర్వో మల్లోల తెలిపారు.


నామినేషన్ పత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఎన్నికల నిబంధనల ప్రకారం నడుచుకోండి : రూరల్ సీఐ

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 25 : సార్వత్రిక ఎన్నికల నియమావళి ప్రకారం ప్రజలు నడుచుకోవాలని, మద్యం.. నగదు అక్రమ రవాణా చేయరాదని నెల్లూరు రూరల్ సీఐ మారుతీ కృష్ణ సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలనలో భాగంగా గురువారం చింతారెడ్డిపాళెం ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో నమోదయ్యే కేసులు కఠినంగా ఉంటాయని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని, అన్ని ప్రాంతాలపై పోలీసు నిఘా ఉందని హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వంతో వ్యాపారులకు మంచిరోజులు


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కేతంరెడ్డి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 25 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడటం ద్వారా వ్యాపారు లకు మంచిరోజులు రానున్నాయని టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణను ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ గురువా రం నగరంలోని 46వ డివిజన్‌లో ఆయన ప్రచారం చేశారు. వ్యాపారులందరూ కూటమికి అండగా ఉండి అభ్య ర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కప్పిరి శ్రీనివాసులుపై దాడి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 25 : టీడీపీ నాయకుడు కప్పిర శ్రీనివాసులుపై బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. సేకరించిన సమాచారం మేరకు... శ్రీనివాసులు మందుల కోసం రామచంద్రరెడ్డి వైద్యశాల పక్కనే ఉన్న మెడికల్ షాపునకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించి దాడి చేశారు. ఈ ఘటనలో ఆయనకు ముఖంతోపాటు శరీరమంతా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నారాయణ వైద్యశాలలో చేరారు. ఈ అంశంపై పోలీసులను వివరణ కోరగా ఇంకా కేసు నమోదు చేయలేదని తెలిపారు.

అశ్వవాహనంపై కోదండరాముడు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 25 : నగరంలోని బాలాజీనగర్ సీతారామమందిరం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అశ్వవాహనంలో కోదండరామునికి ఉత్సవం జరిగింది. ఈనెల 28న శ్రీరామ పట్టాభిషేకం ఉత్సవం జరుగుతుందని ఆలయం చైర్మన్ అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, గౌరవాధ్యక్షుడు టీవీ కిషోర్, అమరా మోహన్‌రావు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఆలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆవిష్కరించారు. ఉదయం మందిరంలో విశేష పూజలు, హోమాలు జరుగుతాయని తెలిపారు. సాయంత్రం 6.30గంటలకు వాకాటి నరసయ్య, శ్రీత్యాగరాజస్వామి కల్యాణ మండపంలో పూజలు, హోమాలు, వేద పారాయణం, శ్రీరామ పట్టాభిషేకం జరుగుతాయని చెప్పారు.

● సంతపేట ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో గురువారం రాత్రి యాళి వాహనంపై హనుమంతుడు దర్శనమిచ్చారు. వసంతోత్సవంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

● శబరి శ్రీరామక్షేత్రం బ్రహ్మోత్సవాల్లో గురువారం సాయంత్రం శ్రీరామకోటి స్తూప ప్రాంగణంలో పారువేట ఉత్సవం వైభవంగా, రాత్రి అశ్వ వాహనంపై నగరోత్సవం జరిగాయి. మాజీ మంత్రి సోమిరెడ్డి కుటుంబం ఉభయకర్తలుగా వ్యవహరించారు.


మూలాపేట వీధుల్లో వేణుగోపాల స్వామి రథాన్ని ఉత్సాహంగా లాగుతున్న యువకులు


పూలతో శోభాయమానంగా అలంకరించిన నవాబుపేట మల్లేశ్వరస్వామి రథం


స్టోన్‌హౌస్‌పేటలో సాగుతున్న కోదండరామస్వామి రథోత్సవం

రథోత్సవాల కళ

ఒకేసారి మూడు రథోత్సవాలు

ఉత్సాహంగా పాల్గొన్న యువత

మారుమోగిన హరిహర నామస్మరణ

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 25 : నగరంలో గురువారం ఒకేరోజు మూడు ప్రధాన ఆలయాల రథోత్సవాలు జరగడంతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. మూలాపేటలో వేణుగోపాలస్వామికి, ఉస్మాన్‌సాహెబ్‌పేటలో కోదండ రామస్వామికి, నవాబుపేటలో మల్లేశ్వరస్వామికి రథోత్సవాలు వైభవంగా జరిగాయి. భక్తుల హరిహర నామస్మరణతో వీధులు మారుమోగాయి. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని గోవిందా.. గోవింద, జైశ్రీరామ్, హరహర మహాదేవ నినాదాలతో ఉత్సాహంగా రథాలను లాగారు. భక్తులు కొబ్బరికాయలుకొట్టి, హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తప్పెట్లు, మంగళవాయిద్యాలు, పులివేషాలు, చిన్నారుల దేవతా వేషధారణతో వేణుగోపాల స్వామి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. మల్లేశ్వరస్వామి రథానికి పూలతో చేసిన అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. కోదండరామస్వామి రథోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ మూడు చోట్ల రథోత్సవాలకు తరలివచ్చిన భక్తులకు స్థానికులు, వ్యాపారులు, వివిధ సంఘాల వారు మంచినీరు, మజ్జిగ, శీతల పానీయాలు అందించి వేసవితాపం తీర్చారు. ఆయా ఆలయాల పాలకమండళ్లు, కార్యనిర్వాహక అధికారులు ఉత్సవాలను పర్యవేక్షించారు.

అధికారంలోకి రాగానే పేదలకు టిడ్కో గృహాలు

● మాజీ మంత్రి, టీడీపీ నగర అభ్యర్థి పొంగూరు నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 25 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలందరికీ టిడ్కో గృహాలను మంజూరు చేస్తామని మాజీ మంత్రి, నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నగరంలోని 3వ డివిజన్‌లో ఆయన ఇంటింట ప్రచారం నిర్వహించారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో నగరంలో రూ.710 కోట్లతో 650 కిలోమీటర్ల పొడవున రోడ్లు నిర్మించామన్నారు. అందుకే ప్రజలు ఏ ప్రాంతానికి వెళ్లినా బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గత ఐదేళ్లలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వకపోగా ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేయకపోవడంతో నగరం అస్తవ్యస్తంగా మారిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీకి అండగా ఉండి తనను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. అలాగే 5వ డివిజన్‌లో పర్యటించిన నారాయణ మాట్లాడుతూ ప్రజల సహకారంతో టీడీపీ మరికొన్ని రోజుల్లోనే అధికారంలోకి రాబోతోందని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో యువత భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అనంతరం టీడీపీ నాయకులు వెంకారెడ్డి, మామిడాల మధు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యువత, ప్రజలు నారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నేతలు పాల్గొన్నారు. 7వ డివిజన్‌లో నారాయణ సతీమణి రమాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు...

పొంగూరు నారాయణ సమక్షంలో వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరారు. గోమతినగర్‌లో ఉన్న నారాయణ క్యాంపు కార్యాలయంలో వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో అందరూ కష్టపడి టీడీపీ అధికారంలో వచ్చేందుకు కృషి చేయాలని కోరారు.


తెలుగుదేశం పార్టీలో చేరిన వారితో నారాయణ


ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న పొంగూరు నారాయణ

జేఈఈ మెయిన్స్‌లో జయకేతనం

● జాతీయ స్థాయిలో ర్యాంకులతో సత్తాచాటిన ప్రైవేటు కళాశాలల విద్యార్థులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 25 : జేఈఈ మెయిన్స్ సెషన్ పరీక్ష ఫలితాలను ఎన్‌టీఏ విడుదల చేసింది. నగరంలోని ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో జాతీయ స్థాయిలో సత్తా చాటారు. పలువురు విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్‌తో అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు.

● **నారాయణ విజయ కేతనం**



నారాయణ ఐఐటీ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని కళాశాలలో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు జనరల్ కేటగిరిలో షేక్ సూరజ్ 17వ ర్యాంకు, ఎం లావణ్య చంద్రిక 1028, బీ రితేష్‌రెడ్డి 1269, ఏ శ్రీనికేష్ 1475, జే చరితసాయి సుష్మ 1738, పీ సాయినితీష్ 1741, సీహెచ్‌వీఆర్ దినేష్‌కార్తీక్ 2418, పీ అభితేష్ 3685, ఎస్ హరిచరణ్‌తేజ 4088, ఎం శ్రీరామ్‌సుహాన్ 4481వ ర్యాంకు సాధించారని చెప్పారు. వెయ్యి ర్యాంకులలోపు 31 మంది, 5వేలలోపు ర్యాంకులు 85మంది, పదివేలలోపు ర్యాంకులు 128 మంది, 20వేలలోపు ర్యాంకులు 221మంది, 30వేలలోపు ర్యాంకులు 328 మంది సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● **విశ్వసాయి విజయం**

విశ్వసాయి కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో విజయాలు సొంతం చేసుకున్నారని కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్ సత్యనారాయణ తెలిపారు. గురువారం నగరంలోని కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన ఎం దివ్యశ్రీ 97.82 పర్సంటైల్, సీహెచ్ వెంకట యశ్వంత్ 97.52 పర్సంటైల్ సాధించగా, వై మోహనేష్ 2199వ ర్యాంకు సాధించారన్నారు. మొత్తం మీద 71 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కృష్ణమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.



● **శ్రీచైతన్య విజయభేరి....**

నగరంలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో విజయభేరి మోగించారని డీన్ జీ శ్రీరామ్ తెలిపారు. గురువారం కళాశాల ప్రాంగణంలో జరిగిన అభినందన కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు ఏ తనుశ్రీ 99.3 పర్సంటైల్, బీ భానుతేజ 98.27, డీ యజ్ఞశ్రీ 98.13 పర్సంటైల్ సాధించారన్నారు. వివిధ కేటగిరిల్లో 5వేలలోపు ర్యాంకులను 14 మంది విద్యార్థులు, పదివేలలోపు ర్యాంకులను 24 మంది విద్యార్థులు సాధించారని చెప్పారు.

● **ఓవెల్‌కు ఉత్తమ ఫలితాలు**

ఓవెల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ ఆర్ వేణు తెలిపారు. నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న కళాశాల ప్రాంగ ణంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు కే అర్పితా సజిత్ 208, ఎస్ వెంకట సంతోష్‌కుమార్ 493, ఏ వెంకట నిఖిత్‌బాబు 559, ఆర్ రాకేష్ 1203, పీ అఖిల్ 3611, పీ గీతేశ్వర్ 4219 ర్యాంకు సాధించారన్నారు. పదివేలలోపు 8 మంది, వివిధ కేటగిరిల్లో 28 మంది మంచి ర్యాంకులతో జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఈవో ప్రమీల, ఈడీ బాలు, ఏజీఎం గంగాధర్, టీమ్ లీడర్స్ సుధీర్, రాము, పుల్లారావు, పెద్దన్న, ప్రసాద్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



● **కృష్ణచైతన్య హవా**

నగరంలోని కృష్ణచైతన్య కళాశాల ఐన్‌స్టీన్ క్యాంపస్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ పర్సంటైల్స్‌తో హవా సృష్టించారని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ రాజా ప్రమోద్‌రెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన జే హర్షవర్ధన్ 374, జీ ప్రతాప్‌నాయుడు 2054 ర్యాంకులు సాధించారన్నారు. సూర్యప్రకాష్ 97.41 పర్సంటైల్, దివ్యశ్రీ 97.18, జ్యోతిర్మయి 97.07 పర్సంటైల్ సాధించారని చెప్పారు. జాతీయ స్థాయిలో వివిధ కేటగిరిల్లో వెయ్యిలోపు నలుగురు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. 19 మంది విద్యార్థులు 95 పర్సంటైల్‌కుపైగా, అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల డీన్ శిరీష్ బాబు, అకడమిక్ డీన్ రామ్‌గోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ రమేష్ పాల్గొన్నారు.

మలేరియా మరణాలు నివారించాలి : డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 25 : వైద్యపరంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా ఇంకా మలేరియా వ్యాధి మరణాలు సంభవిస్తున్నాయని, దీనిని నివారించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నెల్లూరులో ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి బీఈడీ కళాశాల వరకు జరిగిన ఈ ర్యాలీ సాగింది. డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ మలేరియా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మలేరియా వ్యాధికి కారణమైన దోమల నియంత్రణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటిలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ డ్రైడే పాటిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, డెమో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలసదన్ నుంచి ఇద్దరు బాలికల పరారీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 25 : బాలసదన్ నుంచి ఇద్దరు బాలికలు పరారయ్యారు. పోలీసుల సమాచారం మేరకు.. జలదంకి, మరుపూరు గ్రామాలకు చెందిన ఇద్దరు బాలికలు 15 రోజులుగా నగరంలోని రెవెన్యూ కాలనీలో గల బాలసదన్‌లో ఉంటున్నారు. గురువారం తెల్లవారుజామున వారు అక్కడి నుంచి పరారయ్యారు. ఇది గమనించిన సదన్ కార్యాలయం ఇన్‌చార్జి సంపూర్ణమ్మ చుట్టుపక్కల గాలించినా బాలికల జాడ తెలియకపోవడంతో విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియచేశారు. వారి ఆదేశాలతో దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీజీహెచ్‌కు పార్థివదేహం సమర్పణ

నెల్లూరు(వైద్యం): నగరంలోని ముత్తుకూరు గేట్ ప్రాంతానికి చెందిన పందిపాటి సుబ్బరాయుడు(75) గురువారం మృతిచెందడంతో ఆయన పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు అందజేశారు. ప్రభుత్వ వైద్యకళాశాల అనాటమీ విభాగానికి దేహాన్ని అందించారు.

ప్రజల ఆశీర్వాదమే కొండంత బలం


నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 25 : నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదమే తనకు కొండంత బలమని ఆ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం 28వ డివిజన్‌లో ఎన్నికల ప్రచార రోడ్‌షో నిర్వహించారు. తన కుటుంబ సభ్యులతో సమా నంగా ప్రజలనూ చూస్తూ, వారి కష్టసుఖాల్లో భాగస్వామినవుతూ వస్తున్నానన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ విజయం చారిత్రక అవసరమన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కాగా, మండలంలోని సౌత్‌మోపూరు గ్రామం అరుంధతీవాడలో ఉన్న 200 కుటుంబాలకు చెందిన వారంతా టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. బుజబుజనెల్లూరుకు చెందిన వైసీపీ మహిళ విభాగం మైనార్టీ సెల్ అధ్యక్షురాలు సయ్యద్‌నాగూన్‌బీ తన మిత్రబృందంతో కలిసి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలోకి వచ్చారు. కొత్తవెల్లంటికి చెందిన పోలయ్య, కట్టా చిన్నబ్బయ్య, వెంకట రమణయ్య మిత్రబృందం టీడీపీ కండువా కప్పుకుంది. వైసీపీకి రాజీనామా చేసిన నల్లగుట్ల ప్రభావతి తన మిత్ర బృందంతో కలిసి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మేయర్ భానుశ్రీ, నాయకులు రాజానాయుడు, పముజుల ప్రదీప్, రాపూరు చంద్రశేఖర్ పాల్గొన్నారు.


రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

విఘ్నేశ్వరాలయంలో 40వ వార్షికోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం): నగరంలోని పప్పులవీధి సిద్ధి విఘ్నేశ్వరాలయం 40 వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం పెన్నానది నుంచి నీటిని సేకరించి ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, సప్త మాతృకా పూజ, మహాలక్ష్మి పూజ, అగ్నిమధనం, అగ్నిప్రతిష్ఠ, కలశస్థాపన, గణపతి హోమం, మృత్యుంజయ హోమం, ఆయుష్య హోమం, పంచామృతాభిషేకం, పూర్ణాహుతి జరిగాయి. కలిశోద్వాసన, మహాకుంభాభిషేకం నిర్వహించారు. స్వామివారికి స్వర్ణ కవచ అలంకారం, సాయంత్రం పూల దర్బారు అలంకరణ, ఏకాంత సేవ జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ పూజా కార్యక్రమాలు అర్చకుడు మాచవోలు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిగాయి. పాండురంగ అన్నదాన సమాజం కార్యవర్గం, సిద్ధి విఘ్నేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.



తేల్చుకుందాం రా

- నామినేషన్ ర్యాలీలో వైసీపీ నేతల బాహాబాహి
- విస్తుపోయిన సూళ్లూరుపేట జనం



ప్రచార రథంపైనే వాగ్వాదం



వైసీపీ నేతలకు సర్దిచెబుతున్న సీఐ మధుబాబు



బుజ్జగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25: ఎన్నికల వేళ అధికార పార్టీ నేతలు మరోమారు బహిరంగంగా గొడవలకు దిగారు. ఎక్కడినుంచో వచ్చి ఇక్కడ దౌర్జన్యం చేస్తావా రారా... తేల్చుకుందాం అంటూ ఓ నాయకుడు సవాల్ విసరగా.. దిగి రారా నీ అంతు చూస్తానంటూ మరో నాయకుడు ప్రతి సవాల్ విసిరాడు.సూళ్లూరుపేటలో గురువారం వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య నామినేషన్ వేసేందుకు వెళ్లే ర్యాలీలో ప్రచారం రథంపైనే ఈ గొడవ చోటు చేసుకుంది. ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైసీపీ సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డి మధ్య జరిగిన ఈ వివాదం పార్టీలో తీవ్ర దుమారం రేపింది. సూళ్లూరుపేట వైసీపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మూడో సెట్ దాఖలు చేసేందుకు నియోజకవర్గంలో అన్ని మండలాల నుంచి జన సమీకరణ చేయించి ఆర్టీసీ బస్టాండు నుంచి ర్యాలీగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.బస్టాండు సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రచార రథాన్ని సిద్ధం చేశారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో నాయుడుపేట నుంచి వాహన ర్యాలీగా ప్రచార రథం వద్దకు కిలివేటి చేరుకొన్నారు. అప్పటికే ప్రచారరథంపై చెంగాళమ్మ ఆలయ ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ డి.బాలచంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ డి.శ్రీమంత్ రెడ్డి, వైసీపీ పట్టణ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి ఉన్నారు.కిలివేటి వెనుక వచ్చిన ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ప్రచార రథం పైకి ఎక్కా రు. కిలివేటి పక్కనే నిలబడి ఉన్న బాలచంద్రా రెడ్డి, శేఖర్‌రెడ్డిని నెట్టేందుకు యత్నించారు. మీరేంట్రా ప్రచార రథంపై ఉండేది.... కిందకు దింపండిరా అంటూ మాట్లాడడం వివాదానికి దారి తీసింది. వెంటనే జోక్యం చేసుకొన్న దువ్వూరు ఇది మంచి పద్ధతి కాదంటూ వారించేందుకు ప్రయత్నించారు. దీంతో శేఖర్ రెడ్డి ప్రచార రథం ముందుభాగం బ్యానెట్ పైకి చేరుకొని నువ్వెవడ్రా ఎక్కడ నుంచో వచ్చి ఇక్కడ మాట్లాడుతున్నావంటూ ప్రశ్నించారు. తొడలు కొట్టుకుంటూ చెప్పులు సైతం చూపించుకొంటూ సవాళ్లు ప్రతి సవాళ్లు విసురుకున్నారు. ఇదంతా కిందనుంచి చూస్తున్న వైసీపీ శ్రేణులు అసలు ఏమి జరుగుతుందోనని ఆందోళనకు గురయ్యారు.కిలివేటి ఆ ఇద్దరినీ బుజ్జగించినా ఫలితం లేకపోవడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది.సీఐ మధు బాబు ప్రచార రథం పైకెక్కి సత్యనారాయణ రెడ్డిని వారించి ప్రచార రథం బ్యానెట్‌పై శేఖర్ రెడ్డిని కూర్చోబెట్టారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కౌన్సిలర్ మీజూరు రామకృష్ణ కూడా ప్రచారం రథంపైకి ఎక్కేందుకు ప్రయత్నించగా పోలీసులు వారించారు. అదే సమయంలో సత్యనారాయణ రెడ్డి మున్సిపాలిటీ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డితో వాగ్వాదానికి దిగారు.కిలివేటి ఆ ఇద్దరినీ బుజ్జగించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. పోలీసులు ప్రచార రథం సమీపంలో ఉన్న నాయకులను పక్కకు పంపడంతో ర్యాలీ బయలుదేరింది. ఈ నెల 14న జరిగిన ప్రచారంలో కూడా ఇరు వర్గాలు బాహాబాహీకి దిగిన విషయం తెలిసిందే.ప్రశాంతంగా ఉండే సూళ్లూరుపేటలో వీధి రౌడీల్లా వైసీపీ నేతలు కయ్యానికి కాలుదువ్వడంపై అధికార పార్టీలో సైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.



వైసీపీ శ్రేణులను నిలువరిస్తున్న పోలీసులు - (ఇన్‌సెట్‌లో) రాయి విసురుతున్న వైసీపీ కార్యకర్త

అదుపుతప్పిన ఉత్సాహం



టీడీపీ కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు

చంద్రగిరి వైసీపీ, టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా ఉద్రిక్తత

- పోటాపోటీగా ఇరు పార్టీల భారీ ర్యాలీలు
- పోటాపోటీ నినాదాలతో తోపులాటలు
- లాఠీఛార్జితో రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు
- ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై దాడి
- పోలీసుల వైఫల్యమే కారణం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 25: ప్రశాంతంగా సాగిన నామినేషన్ల పర్వంలో చివరిరోజు ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ, టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు సందర్భంగా కార్యకర్తల నడుమ ఘర్షణ, రాళ్ళదాడి జరిగింది. పోలీసులు లాఠీఛార్జి చేయడంతో రెచ్చిపోయిన టీడీపీ వర్గీయులు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి వాహనంపై కర్రలు, రాళ్ళతో దాడి చేశారు.వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహితరెడ్డి, టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని గురువారం నామినేషన్లు దాఖలు చేసేందుకు చంద్రగిరిలో భారీ ర్యాలీలు నిర్వహించారు.అక్కడి నుంచీ వాహనాల కాన్వాయ్‌తో తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు.రెండు పార్టీలూ పోటాపోటీగా జనసమీకరణ చేయడంతో వేలసంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. వైసీపీ అభ్యర్థి మోహిత్ తన తండ్రి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డితో కలసి ఆర్డీవో కార్యాలయంలోకి వెళ్ళిన కాసేపటికి టీడీపీ అభ్యర్థి నానీ కూడా లోనికి వెళ్ళారు. వెలుపల టీడీపీ కార్యకర్తలు నినాదాలు చేస్తుండడంతో వైసీపీ కార్యకర్తలు ప్రతిగా నినాదాలు చేశారు. ఈ ఉత్సాహం అదుపు తప్పడంతో పరస్పరం ఘర్షణ పడ్డారు. రాళ్ళు, జెండా కర్రలతో కొట్టుకున్నారు.ఆలస్యంగా మేలుకున్న పోలీసులు లాఠీఛార్జి జరిపి టీడీపీ వర్గీయులను చెదరగొట్టారు. దీంతో రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు అప్పుడే ఆర్డీవో కార్యాలయం నుంచీ వెలుపలికి వచ్చి బయల్దేరి వెళుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై జెండా కర్రలు, రాళ్ళతో దాడి చేశారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఆయన వెళ్ళిపోయారు. ఆ సందర్భంగా కూడా ఇరు పార్టీల కార్యకర్తలూ పరస్పరం రాళ్ళు విసురుకున్నారు. అనంతరం పులివర్తి నానీ వెలుపలికి రావడంతో ఆయన వెంట కార్యకర్తలు వెళ్ళిపోయారు.మరి కాసేపటికి మోహిత్‌రెడ్డి బయటకు రాగా వైసీపీ కార్యకర్తలు ఆయ న వెంట వెళ్ళిపోవడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.

ఇద్దరు అభ్యర్థులూ ఒకేసారి రావడంతో....

మధ్యాహ్నం 12.40 గంటల సమయంలో మోహిత్‌రెడ్డి కొద్దిమంది వైసీపీ కార్యకర్తలతో కలిసి వాహనాల్లో ఎమ్మార్ పల్లి సర్కిల్ మీదుగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. రాస్ బిల్డింగ్ సమీపంలో 100 మీటర్ల నియంత్రణ రేఖవద్ద పోలీసులు వైసీపీ కార్యకర్తల వాహనాలను నిలువరించి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి కారును మాత్రం ఆర్వో కార్యాలయం వద్దకు అనుమతించారు. అయితే కొందరు వైసీపీ కార్యకర్తలు ఆర్వో కార్యాలయ సమీపంలోకి చేరుకున్నారు. తరువాత కొంత సేపటికి అన్నమయ్య సర్కిల్ వైపునుంచి టీడీపీ,బీజేపీ,జనసేన శ్రేణులతో కలసి పులివర్తి నాని ఊరేగింపుగా వచ్చారు. ఇటువైపు 100 మీటర్ల నియంత్రణ రేఖవద్ద ఉన్న పోలీసులు... అభ్యర్థితో పాటు నలుగురు మాత్రమే ఆర్వో కార్యాలయం వద్దకు వెళ్లాలని, మిగిలిన కార్యకర్తలకు అనుమతి లేదని సూచించారు.దీంతో అన్నమయ్య కూడలి నుంచి ద్విచక్రవాహనంపై నామినేషన్ కేంద్రం వద్దకు నాని వెళ్లారు. ఆ ప్రాంతంలో ఉన్న వైసీపీ కార్యకర్తలు నానీని చూడగానే జై జగన్ అంటూ నినాదాలు ప్రారంభించారు. ఇది చూసిన టీడీపీ కార్యకర్తలు ఒక్క ఉదుటన ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని జగన్ పోవాలి... సైకిల్ రావాలి , జై నానీ అని ప్రతి నినాదాలు చేశారు.

అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు:నాని

తన నామినేషన్‌ను అడ్డుకునేందుకు చెవిరెడ్డి, ఆయన వర్గీయులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని, తమ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారని నామినేషన్ తరువాత పులివర్తి నాని మీడియాకు చెప్పారు. మంచి ముహూర్తం ఉన్నందున చివరిరోజున ప్రధాన నామినేషన్ వేస్తానని తాను మొదటి రోజే చెప్పానని, అయితే వారు మూడు తేదీలు, సమయాలు మార్చుకుని తాను నిర్ణయించుకున్న సమయానికే నామినేషన్ పెట్టుకున్నారన్నారు. ఇది కాకతాళీయం కాదని గొడవ చేయాలనే తలంపుతో ప్రణాళిక ప్రకారం చేశారని ఆరోపించారు. ఓడిపోతున్నామనే అక్కసుతోనే చెవిరెడ్డి ఈ దాడులు చేయిస్తున్నారన్నారు. వారెన్ని దాడులు చేసినా తాము ఆవేశపడేది లేదని, ఎన్నికలయ్యేవరకు సంయమనంతో వ్యవహరిస్తామని ఆయన చెప్పారు. ఐతే ఈ దాడులపై ఈసీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

దీంతో సంయమనం కోల్పోయిన ఇరు వర్గాలూ బాహాబాహీకి దిగారు.జెండా కర్రలతో దాడులకు పూనుకున్నారు. ఈ క్రమంలో ఒకరిద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టేందుకు ప్రయత్నించినా ఎవ్వరూ వెనక్కు తగ్గలేదు.పరిస్థితి విషమిస్తుండడంతో పోలీసులు లాఠీచార్జి చేసి టీడీపీ శ్రేణులను చెదరగొట్టారు.మధ్యాహ్నం 1.20 గంటల సమయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆర్వో కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. జరిగిన ఘటనలతో అప్పటికే ఆవేశంతో ఉన్న టీడీపీ కార్యకర్తలు చెవిరెడ్డి కారును చుట్టుముట్టారు. నినాదాలుచేస్తూ కారును నిలువరించేందుకు ప్రయత్నించారు. ఆవేదనతో జెండా కర్రలతో కారుపై దాడిచేశారు. పక్కనే రోడ్డు మరమ్మతులకోసం తెప్పించి పెట్టిన కంకర రాళ్ళతో కారుపై దాడిచేశారు. పోలీసులు వారిని అడ్డుకుని చెవిరెడ్డి కారును సురక్షితంగా పంపించివేశారు. తరువాత కూటమి కార్యకర్తలు విసిరిన గులకరాళ్లతో వైసీపీ కార్యకర్తలు దాడికి దిగడంతో యుద్ధవాతావరణం చోటుచేసుకుంది. పోలీసులు కష్టమ్మీద ఇరు వర్గాలను అడ్డుకుని దాడులు తీవ్రతరం కాకుండా నిలువరించారు.తరువాత 2 గంటలకు పులివర్తి నాని నామినేషన్ ముగించుకుని ఆర్వో కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. నాయకులు, కార్యకర్తలతో కరచాలనం చేస్తూ కొంతసేపు అక్కడే ఉండి ఆ తరువాత అక్కడి నుంచి బయలుదేరారు.ఆయనతో పాటే కార్యకర్తలు కూడా అక్కడినుంచి వెళ్లిపోయారు. మధ్యాహ్నం సుమారు 2.20 గంటల సమయంలో వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి నామినేషన్ ముగించుకుని ఆర్వో కార్యాలయం నుంచి బయటకు వచ్చి తన అనుచరులతో కలిసి వెళ్లిపోయారు.

ముందుగానే తెలిసినా...

ఇద్దరు అభ్యర్థులు చివరి రోజునే, ఒకే సమయంలో నామినేషన్‌కు వస్తారని తెలిసినా పోలీసులు తగినవిధంగా బందోబస్తు చర్యలు చేపట్టకపోవడమే ఈ ఉద్రిక్తతలకు కారణంగా కనబడుతోంది. రెండు ప్రధాన పార్టీలు, పెద్దసంఖ్యలో కార్యకర్తల బలమున్న పార్టీలు నామినేషన్‌కు ర్యాలీగా తరలి రానున్న నేపథ్యంలో అందుకు తగినట్టు పోలీసు బలగాలను కూడా పెద్దసంఖ్యలో మోహరించాల్సి ఉంది. ఆ మేరకు బలగాలు లేకపోవడంతో ఇరు పార్టీల కార్యకర్తలు కలబడి దాడులు చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ఆర్వో కార్యాలయ మార్గంలో గులక రాళ్ల గుట్టలు ప్రమాదకరంగా మారుతాయని పోలీసులు గుర్తించలేక పోయారు.వీటిని ముందుగానే పరిగణనలోకి తీసుకోకపోవడం, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం వంటి పోలీసు వైఫల్యాలతోనే ఆర్డీవో కార్యాలయం వద్ద ఘర్షణ జరిగింది.



వైసీపీ శ్రేణులను అదుపు చేస్తున్న పోలీసులు



రాయి విసురుతున్న వైసీపీ కార్యకర్త

వెంకటగిరిలో కొండెక్కిన కోడ్

- వైసీపీ అభ్యర్థి నామినేషన్‌కు వచ్చిన జనానికి నగదు, బిరియానీ పంపిణీ
- జనానికి తప్పని ట్రాఫిక్ కష్టాలు





నగదు పంపిణీ

వెంకటగిరి/ వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 25 : వెంకటగిరిలో గురువారం వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. నామినేషన్ కార్యక్రమానికి వచ్చిన జనానికి బహిరంగంగానే రూ.300 నగదు, బిరియాని పొట్లాలు పంపిణీ చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు ఎక్కువ సంఖ్యలో రావడంతో ప్రధాన వీధులన్నీ రద్దీగా మారాయి.ట్రాఫిక్ స్తంభించిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.నగదు అందుకున్న జనంలో కొంతమంది ఎక్కడ మద్యం షాపులు కనిపిస్తే అక్కడ ఆగిపోయి తాగి తూలారు.వృద్ధులను, చిన్న పిల్లలను కూడా నామినేషన్ కార్యక్రమానికి తీసుకురావడంతో వారు ఎండతీవ్రతకు తాళలేక అల్లాడిపోయారు.సుదూర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన ప్రజలకు నీటి సౌకర్యం కూడా కల్పించకపోవడంతో తోపులాటలు చోటుచేసుకున్నాయి.



వైన్ షాపు వద్ద వైసీపీ శ్రేణులు

చివరి రోజు 155 నామినేషన్లు

- పార్లమెంటుకు 20... అసెంబ్లీకి 135
- అత్యధికంగా తిరుపతికి 34
- ఏడు రోజుల్లో ఎంపీకి48... అసెంబ్లీకి 242





భారీ ప్రదర్శనగా నామినేషన్ వేసేందుకు వస్తున్న పులివర్తి నాని

తిరుపతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల స్వీకరణకు చివరి రోజైన గురువారం భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. తిరుపతి పార్లమెంటుకు 20 నామినేషన్లు ఫైల్ కాగా ఏడు అసెంబ్లీ స్థానాలకూ కలిపి 135 నామినేషన్లు వచ్చాయి. వీటిలో తిరుపతికి అత్యధికంగా 34 నామినేషన్లు వేశారు. కాగా ఈనెల 18వ తేదీ నుంచీ గురువారం వరకూ ఏడు రోజుల్లో తిరుపతి పార్లమెంటు స్థానానికి మొత్తంగా 48 నామినేషన్లు ఫైల్ అయ్యాయి. అలాగే ఏడు అసెంబ్లీ స్థానాలకు కలిపి 242 నామినేషన్లు వచ్చాయి. స్థానాల వారీగా చూస్తే తిరుపతికి 83, చంద్రగిరికి 63, శ్రీకాళహస్తికి 44, సత్యవేడుకు 38, గూడూరుకు 35, సూళ్ళూరుపేటకు 31. వెంకటగిరికి 31 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి.కాగా చివరి రోజు నామినేషన్లు వేసిన ప్రధాన పార్టీల అభ్యర్థుల విషయానికి వస్తే తిరుపతి పార్లమెంటుకు బీజేపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు, బీజేపీ డమ్మీగానూ, ఇండిపెండెంట్‌గానూ వేసిన రిటైర్డు ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు, వైసీపీ అభ్యర్థి మద్దెల గురుమూర్తి, బీఎస్పీ అభ్యర్థిగా రిటైర్డు జడ్జి పి.గుర్రప్ప, సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి వేలూరు తేజోవతి వున్నారు. అసెంబ్లీ స్థానాల్లో సూళ్ళూరుపేటకు టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ, వైసీపీ అభ్యర్థి సంజీవయ్య, కాంగ్రెస్ అభ్యర్థి చందనమూడి శివ, సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థి బిగువు శ్రీనివాసులు వున్నారు. వెంకటగిరిలో టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ, వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్, సమాజ్‌వాదీ అభ్యర్థి పాతపాటి చిరంజీవి, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి చెముకుల శివకృష్ణ వున్నారు. గూడూరులో టీడీపీ అభ్యర్థి పాశం సునీల్ కుమార్, శ్రీకాళహస్తిలో టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి, సమాజ్‌వాదీ అభ్యర్థి డి.గోవింద స్వామి, సత్యవేడులో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రిటైర్డు ఐఏఎస్ అధికారి జి.విజయ్‌కుమార్ వున్నారు. చంద్రగిరిలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ, వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వున్నారు. తిరుపతిలో వైసీపీ డమ్మీ అభ్యర్థిగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నామినేషన్ వేశారు.

టీడీపీలో ముగ్గురికి పదవులు

జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనబాక లక్ష్మి

తిరుపతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి నియమితులయ్యారు. గురువారం పార్టీ చేపట్టిన నియామకాల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో ముగ్గురికి కీలక పదవులు లభించాయి. పనబాక లక్ష్మి జాతీయ కమిటీలో స్థానం దక్కించుకోగా తిరుపతికి చెందిన కోడూరు బాలసుబ్రమణ్యం రాష్ట్ర అధికార ప్రతినిధిగా అవకాశం దక్కించుకున్నారు. కాగా చిత్తూరు జిల్లా పూతలపట్టుకు చెందిన గుర్రం వెంకటేష్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు.తాజా ఎన్నికల్లో పనబాక లక్ష్మి ఎంపీ సీటు, ఆమె భర్త కృష్ణయ్యకు గూడూరు లేదా సూళ్ళూరుపేట అసెంబ్లీ టికెట్ ఆశించారు. అయితే సమీకరణలు అనుకూలించకపోవడంతో ఇద్దరిలో ఎవరికీ అవకాశం దక్కలేదు. దీన్ని దృష్టిలో వుంచుకుని అధినేత ఆమెకు జాతీయ కమిటీలో అవకాశం కల్పించారు. అలాగే తిరుపతి సీటు జనసేనకు కేటాయించి, అభ్యర్థిగా అరణి శ్రీనివాసులును ప్రకటించగా టీడీపీ నుంచీ కోడూరు బాలసుబ్రమణ్యం మినహా ఎవరూ ప్రారంభంలో మద్దతు ప్రకటించలేదు.ఈ కారణంగానే అధినేత ఆయనకు అధికార ప్రతినిధిగా అవకాశమిచ్చినట్టు సమాచారం.



సొల్మానుపురం వద్ద రోడ్డు మార్జిన్‌లో దహనక్రియలు జరుగుతున్న దృశ్యం

వారంతా పునరావాస ప్రజలు. పొట్టచేత పట్టుకుని కడప జిల్లా నుంచి ఊరుగాని ఊరొచ్చారు. చేతికందిన పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎలాగోలా పూట గడిచిపోతున్నా గ్రామంలో ఎవరైనా చనిపోతే దహనక్రియలకు మరుభూమి లేక అవస్థలు పడుతున్నారు. నిత్యం వాహనాల రద్దీ ఉండే రోడ్డు పక్కనే దహనక్రియలు చేసుకుంటున్నారు. 'ఒక్కచాన్స్' పేరుతో పాదయాత్ర చేస్తూ తమ ఊరికి వచ్చిన వైసీపీ అధినేత జగన్‌కు తమ సమస్యను మొరపెట్టుకున్నారు. అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానన్న జగన్ ఆరేళ్లు గడిచినా ఇప్పటికీ అతీగతీ లేదు.

మరుభూమికీ ఎన్ని కష్టాలయ్యా!?

- స్మశానం కోసం పాదయాత్రలో జగన్‌తో మొర
- అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ
- ఆరేళ్లవుతున్నా అతీగతీ లేదు!

సోమశిల ప్రాజెక్టు ముంపు గ్రామాల (కడప జిల్లా) నుంచి 40 ఏళ్ల క్రితం బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లి పంచాయతీ సొల్మానుపురానికి వలస వచ్చారు. గ్రామం, పరిసరాలు అభివృద్ధి చెందేకొద్దీ గ్రామానికి స్మశానం సమస్య ఏర్పడింది. గ్రామంలో 350 కుటుంబాలు, 1100 మంది జనాభా, 700 మంది ఓటర్లు ఉన్నారు. ఎవరైనా చనిపోతే ప్రధాన రహదారి పక్కనే దహనక్రియలు చేస్తున్నారు. దీనివల్ల ఆ రోడ్డుపై వెళ్లే వాహనదారులు, ప్రజలు ఇబ్బందిపడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల ముందు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లాలో చేపట్టిన పాదయాత్రలో భాగంగా జొన్నవాడ, బుచ్చి మార్గంలో పెనుబల్లి, సొల్మానుపురం మీదుగా బుచ్చికి వెళ్లారు. సొల్మానుపురం వద్ద ఆ గ్రామ ప్రజలు ఆయనకు స్వాగతం పలికి వారి భూములు, స్మశాన సమస్యలను విన్నవించుకున్నారు. దీంతో స్పందించిన జగన్ అధికారంలోకి రాగానే ఆ సమస్యల పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అయితే, ఇది జరిగే దాదాపు ఐదేళ్లు గడుస్తున్నా ఆ సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. స్మశాన వాటిక లేకపోవడంతో గ్రామంలో ఎవరైనా చనిపోతే మృతదేహాలను రోడ్డు మార్జిన్‌లోనే దహనం చేసుకుంటున్నారు. ఆరేళ్లు గడిచినా తమ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో సొల్మానుపురం వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

\- బుచ్చిరెడ్డిపాళెం

చేతులుడిగి చూస్తున్నాం

గ్రామ సమీపంలో ఆక్రమణలో ఉన్న సర్వే నెంబరు 151-సీలోని 53 సెంట్లు డొంక పోరంబోకును స్మశానానికి కేటాయిస్తూ గ్రామ పంచాయతీ తీర్మానించినా ప్రయోజనం శూన్యం. అప్పటి నుంచి పలువురు కలెక్టర్లు, తహసీల్దార్లు, మంత్రులకు మొరపెట్టుకున్నా న్యాయం చేయకపోగా ఆ డొంక పోరంబోకు భూమిని కూడా అధికారులు కబ్జాదారులకే కట్ట బెట్టారు. ఆరేళ్ల క్రితం మా సమస్యను ప్రస్తుత సీఎం జగన్‌కు విన్నవించుకున్నా ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో చేసేదిలేక చేతులుడిగి చూస్తున్నాం.

\- సిద్దన కొండారెడ్డి, మాజీ ఎంపీటీసీ

యువత భవితకు భరోసా ఇచ్చేవారికే ఓటు

యువగళం



యువత భవితకు భరోసా ఇచ్చే వారికే నా తొలి ఓటు. యువతీ,యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలసజీవు లుగా మారుతున్నారు. ఉచితాల పేరుతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చకుండా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ప్రభుత్వాలు ఆసరాగా నిలవాలి. ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం ఉచితంగా అందించేలా నేతలు కృషిచేయా లి. ప్రతి ఒక్కరూ ఆలోచించి తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలి.

\- మాదాల జనార్దన్, బీటెక్ సెకండ్ ఈయర్, ముసునూరు, కావలి

వినండహో..

ఉచితంగా 'లంచం-రాజకీయాలు' కరదీపిక



ఎన్నికల్లో గెలిపే పరమావధిగా అభ్యర్థులు ఓటర్లను వివిధ రకాలుగా ప్రలోభపెడుతున్నారు. ఇప్పటి వరకు ఎన్నికల్లో లంచం రాజకీయాలపై అక్షరాల నిప్పుకణికలను కరదీపికగా రూపొందించారు. రక్తదాత తిక్కవరపు సుకుమార్‌రెడ్డి సొంత ఖర్చులతో ముద్రించిన ఈ కరపత్రాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కావాల్సిన వారు రూపాయి విలువ కలిగిన తపాలా బిళ్ల అంటించి సొంత చిరునామా రాసిన 5 ఇంటూ 8 సైజు కవరును ఆయనకు పంపితే ఆ కరదీపికను పోస్టులో పంపుతారు. చిరునామా - తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, డోర్ నెంబరు 223/2వ అంతస్తు, సచివాలయం ఎదురు భవనం, ఈశ్వరప్రగడవారి వీధి, సుమంగళి కళ్యాణ మండపం ఎదురువీధి, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు-524002, ఫోన్ నెంబరు 0861-2325125.

\- నెల్లూరు (సాంస్కృతికం)

కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం కేడర్‌లో జోష్ కనిపిస్తోంది. ఇంటూరి నాగేశ్వరరావుకు టికెట్ ఇవ్వడాన్ని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, యువనేత ఇంటూరి రాజేష్‌లు తీవ్రంగా వ్యతిరేకించారు. తనను పార్టీ నిర్లక్ష్యం చేస్తున్నదన్న అసంతృప్తితో ఇండిపెండెంట్‌గా పోటీకి సిద్ధపడ్డ ఇంటూరి రాజేష్ తన మనసు మార్చుకున్నారు. నాగేశ్వరరావుపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతూ ఆయన విజయానికి పనిచేసేదే లేదని భీష్మించుకున్న దివి శివరాం సైతం మెత్తబడ్డారు. ఈ పరిణామాలు టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కొండంత ఉత్సాహాన్ని ఇచ్చాయి.

\- కందుకూరు



కందుకూరులో ఒక్కటైన టీడీపీ నాయకులు

వైసీపీ కేడర్‌లో గుబులు

ఇప్పుడిప్పుడే బయటపడుతున్న విభేదాలు

చల్లారిన జ్వాల.. తమ్ముళ్లలో జోష్!

వర్తమానం..

టీడీపీలోని వర్గవిభేదాలు తమకు కలిసివస్తాయని వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్‌తోపాటు ఆ పార్టీ నాయకులు సంబరపడ్డారు. మరోవైపు ఈ పరిణామాలతో టీడీపీ కేడర్‌లోనూ తీవ్ర నిరాశ నిస్పృహలు నెలకొన్నాయి. పంచా యతీ ఎన్నికల సమయంలో తమకు అండగా నిలిచిన రాజేష్‌ను కాదనాలా, ఎన్నో ఏళ్లుగా శివరాంతో ఉన్న అనుబం ధాన్ని తెంచుకోవాలా లేక వారి కోసం 45 ఏళ్లుగా టీడీపీతో ఉన్న బంధాన్ని వదులుకోవా లో అర్థంకాక పలువురు సతమతమయ్యారు. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేష్, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి మధ్యవర్తిత్వంతో అసమ్మతి చల్లారింది. మొన్నటి వరకు గ్రామగ్రామాన రెండువర్గాలుగా విడిపోయి పనిచేసిన టీడీపీ శ్రేణులు ప్రస్తుతం ఏకతాటిపై పని చేయటానికి సిద్ధపడ్డాయి.



ఇంటూరి



బుర్రా

- **వైసీపీలో ఉలికిపాటు**

టీడీపీలో అసమ్మతి జ్వాలలు చల్లారడం, ఇంటూరి బ్రదర్స్ చేతులు కలపడంతో వైసీపీ వర్గీయులు ఉలిక్కిపడ్డారు. ఆ పార్టీలోని వర్గ విభేదాలు తమకెంతో కలిసి వస్తాయన్న వారి ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. అనూహ్యంగా టీడీపీ నేతలంతా ఒకటికావటంతో పాటు వైసీపీలోని వర్గవిభేదాలు మెల్ల మెల్లగా వెలుగులోకి వస్తుండటం ఆ పార్టీ శ్రేణులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఐదేళ్లుగా ఆ పార్టీ అధికారంలో ఉండ టంతో సహజంగానే వర్గాలు ఏర్పడ్డాయి. దీనికితోడు నియోజక వర్గంపై పట్టున్న సిట్టింగ్ ఎమ్మెల్యే మహీధరరెడ్డిని కాదని, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌ను కందుకూరు అభ్యర్థిగా ప్రకటించటం కూడా పెద్ద సమస్యగా మారింది. ప్రతి గ్రామంలో రెండు మూడు వర్గాలు ఉండటం, వారిలో ఎవరి బలం ఎంతో ఎవరికి ఏమేరకు ప్రాధాన్యత ఇవ్వాలో బుర్రాకు అవగాహన లేకపోవటం ఆపార్టీకి తలనొప్పిగా మారింది. దీంతో ఒకరికి బాధ్యత ఇస్తే నలుగురు అలకబూనే పరిస్థితులు వైసీపీని అతలాకు తలం చేస్తున్నాయి. కొన్నిచోట్ల జనబలం లేని నేతలే ముందుకు వచ్చి పెత్తనం చేస్తుండటంతో ప్రజల్లో పట్టున్న నేతలు మొక్కుబడిగా పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. దీనికితోడు రెండు, మూడుసార్లు బుర్రాను కలిసి మాట్లాడిన గ్రామస్థాయి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులను కూడా ఆయన గుర్తు పెట్టుకోవటం లేదని విమర్శలు ఉన్నాయి. వీటన్నిటికీ తోడు ఎమ్మెల్యే మహీధరరెడ్డి వైసీపీ అభ్యర్థి బుర్రాకు మద్దతి స్తున్నప్పటికీ ఆయనను అభిమా నించే కొంతమంది మహీధర్‌కు జగన్ టికెట్ ఉద్దేశపూర్వకంగా ఇవ్వక పోవటాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. జగన్‌కు తగిన బుద్ధి చెప్పాలన్న కృత నిశ్చయంతో ఉన్నట్లు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. జగన్‌కు తగిన సమాధానం చెప్పటం అంటే వారంతా వైసీపీ ఓటమే లక్ష్యంగా టీడీపీకి ఓటు వేస్తారని అర్థమైపో తోంది. ఈ పరిస్థితుల్లో కందుకూరులో వైసీపీకి గడ్డుకాల మేనన్న ఆందోళన ఆ పార్టీ క్యాడర్‌లో నెలకొంది.

కల్లుతో కానిద్దాం..!

అదే మందు





ఎండాకాలం.. అందులోనూ ఎన్నికల సీజన్... దానికితోడు ప్రభుత్వ మద్యం దుకాణాలు మధ్యాహ్నానికే మూత... ఇంకేముంది...! మందుబాబులంతా కల్లు అంగళ్లపైకి మళ్లారు. జిల్లా వ్యాప్తంగా కొద్ది రోజుల నుంచి కల్లుకు బాగా డిమాండ్ పెరిగింది. జెగ్గు కల్లు రూ. 15లకే దొరుకుతుండటంతో అంతా అటువైపే మొగ్గుతున్నారు. ఎన్నికల సీజన్ కావడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఈసీ ఆంక్షలు విధించడంతో దుకాణాలన్నీ మధ్యాహ్నానికే మూతపడుతున్నాయి. నిత్యం మద్యం సేవించేవారికి ఈ విధానం ప్రతికూలంగా మారడంతో వారంతా కల్లు దుకాణాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఉదయం, సాయంత్రం కూలీ పనులకు వెళ్లి వారి నుంచి, ఎన్నికల ప్రచారంలో పాల్గొనేవారు సైతం కల్లుతోనే సరిపెట్టుకుంటున్నారు. తాటిచెట్ల వద్దకు చేరుకుని లొట్టిల లెక్క కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. గతంలో ప్రధాన రహదారుల వద్ద దుకాణాలు పెట్టుకుని కల్లు అమ్ముతుండగా, ఇప్పుడు ఏకంగా తాటిచెట్ల వద్దే హోల్‌సేల్‌గా కల్లు కొనుగోలు చేస్తున్నారు.


\- నెల్లూరు (సిటీ)

మందు లేకుంటే ఎట్టా చెప్మా..!

- రాజకీయ పక్షాల తర్జన భర్జన
- దుకాణాల్లోని సగం సరుకు వైసీపీ నేతలకే..
- ముందుజాగ్రత్తగా నిల్వలు
- ఇతర రాష్ట్రాల మద్యం జోరు

కందుకూరు, ఏప్రిల్ 25: మందు లేకుంటే ఎట్టా చెప్మా.. ఎన్నికలంటే మందుబాబులదేకదా సందడి. నామినేషన్ల ఘట్టం మొదలు పోలింగ్ పూర్తయ్యేవరకు వారిని తృప్తిపరచకుంటే ఆ తలనొప్పి భరించేది కాదంటూ నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఓట్లకోసం ఎంత డబ్బు పంపిణీ చేసినా, చాలినంత మందు పోయలేకపోతే మందుబాబులంతా నెగెటివ్ ప్రచారం చేస్తారు. ఎన్నికల నగారా మోగి, ప్రచారంలో నేతలు తలమునకలై ఉన్నా వారి ఆలోచనలన్నీ మద్యం ఎలా తెప్పించాలనే... తీసుకువస్తే ఎక్కడ నిల్వ చేయాలి.. దాన్ని మందుబాబుల చెంతకు ఎలా చేర్చాలి..? అనే దానిపైనే చర్చలు సాగుతున్నాయి. అక్రమంగా మద్యం రవాణాలో ఆరితేరిన వారికి ప్రత్యేకంగా ఈ బాధ్యతలు అప్పగించి, అక్రమ నిల్వలకు ఏర్పాట్లు చేస్తున్నారు.


ఇప్పటికే నిల్వలు



ప్రభుత్వ మద్యం దుకాణాలు మధ్యాహ్నానికి మూత

కందుకూరులో ఇప్పటికే వైసీపీ నేతలు పెద్దఎత్తున మద్యాన్ని తెప్పించి అక్రమంగా నిల్వచేసినట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రస్తుతం మద్యం తయారీ, రవాణా, విక్రయం అంతా ప్రభుత్వం ముసుగులో నడుస్తుండటంతో వారికి కొంత వెసులుబాటు కనిపిస్తోంది. ఇటీవల మధ్యాహ్నానికే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నోస్టాక్ బోర్డులు పెట్టేస్తున్నారు. ఇందుకు కారణం మద్యం అంతా వైసీపీ అభ్యర్థులకోసం పక్కదారిపడుతుండడమే. కందుకూరులో ఇప్పటికే అధికారపార్టీ నేతలు రెండు లారీల చీప్‌లిక్కర్‌ను అక్రమంగా నిల్వ చేసినట్లు సమాచారం. కాగా మద్యం ఎలా నిల్వ చేయాలని టీడీపీ నేతలు సతమతమవుతున్నారు. అధికార పార్టీవారు రాష్ట్రంలో తయారయ్యే మద్యాన్ని అక్రమ పద్ధతుల్లో తెప్పించుకునే వెసులుబాటు ఉంది. అలాగే పక్కనే ఉన్న తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, గోవా తదితర రాష్ట్రాల నుంచి కూడా మద్యాన్ని అక్రమ మార్గంలో తెప్పించుకుని నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అయితే టీడీపీకి పక్క రాష్ట్రాల నుంచి మద్యం తెప్పించుకోవటం మినహా మరోమార్గం లేదు. ప్రభుత్వ దుకాణాల నుంచి కూడా వారికి మద్యం లభించే అవకాశం లేదు. గోవా రాష్ట్రానికి చెందిన మద్యాన్ని కందుకూరుకు చెందిన ఓ పార్టీ నేతలు తెప్పిస్తుండగా ముందస్తు సమాచారంతో ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు రెండురోజులక్రితం సీజ్ చేసిన విషయం తెలిసిందే. ధర ఎక్కువైనా పర్వాలేదు... మాకు అవసరం మేరకు మద్యం సరఫరా చేయమని మధ్యవర్తులతో చర్చలు జరుపుతున్నారు. చీప్‌లిక్కర్ కూడా సగానికి సగం అదనంగా చెల్లించి కొనుగోలు చేయటానికి సిద్ధపడుతున్నట్లు సమాచారం.

కోవూరు పట్టణ వ్యూ



ముఖచిత్రం

రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం

ఎంతోమంది ప్రముఖులను అందించిన స్థానం

చైతన్యానికి చిరునామా కోవూరు

కోవూరు, ఏప్రిల్ 25 : రాష్ట్ర రాజకీయాల్లో కోవూరు నియోజక వర్గానికి ప్రత్యేక స్థానముంది. చైతన్యానికి చిరునామాగా ఈ సెగ్మెంట్ నిలిచింది. ఇక్కడ నుంచి ఎన్నికయిన ఎంతో మంది ప్రముఖులు రాష్ట్రరాజ కీయాల్ని ప్రభావితం చేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన తరువాత కోవూరు నియోజకవర్గ పరిధిలోకి కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట మండలాలు చేరాయి. అంతకుముందు సంగం, బుచ్చి, కోవూరు, కొడవలూరు, విడవ లూరు మండలాలు మాత్రమే ఉండేవి. 1962 నుంచి ఇప్పటి వరకు 15 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలోనే రెండుసార్లు ఉపఎన్నికలు జరగ్గా నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి విజయం సాధించారు. మే13న జరగనున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో సుదీర్ఘ రాజకీయ అనుభవ మున్న నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి తలపడుతున్నారు.

- **కమ్యూనిస్టుల కంచుకోట**

1951 నుంచి 1962 వరకు కోవూరు కమ్యూనిస్టుల కంచుకోటగా ఉండేది.



కోవూరు నియోజకవర్గ మ్యాపు

ఇందుకూరుపేట, అల్లూరులతో కలిసిన ద్విసభ్య నియోజకవర్గం నుంచి కమ్యూనిస్టు పార్టీ నాయకులు బస్వారెడ్డి శంకరయ్య, స్వర్ణా వేమయ్య గెలుపొందారు. 1962లో కమ్యూనిస్టులపై పోటీచేసి గెలిచిన రేబాల దశరథరామిరెడ్డి అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1972,1978 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన పెళ్ళకూరు రామచంద్రారెడ్డి కోస్తా అభివృద్ధి మండలి చైర్మన్‌గా, ఇఫ్కో చైర్మన్‌గా పనిచేశారు. 1983లో టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించిన నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి రాష్ట మంత్రిగా పలు కీలకశాఖలు నిర్వహించారు.1983 ఎన్నికల్లో సీపీఎంకు కేటాయించక పోవడంతో వామపక్షాలు, టీడీపీ మధ్య పొత్తు కుదరలేదని చెబుతా రు. నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఎమ్మెల్యే ఎన్నికై నప్పటి నుంచి కోవూరు ఎప్పుడూ కూడా రాష్ట్ర రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూనే కన్పించింది.

- **ఇక్కడ నుంచే పుచ్చలపల్లి ప్రస్థానం**

కోవూరు నుంచి కేంద్ర, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసిన ఎందరో మహానుభావులు ఎన్నికయ్యారు. పార్లమెంటులో తొలి ప్రతిపక్షనాయకుడు, దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య నియోజకవర్గ పరిధిలోని అలగానిపాడు నుంచే రాజకీయ ఓనమాలు దిద్దుకున్నారు. ఆంధ్రరాష్ట్ర మొద టి ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి స్వగ్రామం బుచ్చిరెడ్డిపాళెం. ఆయన సోదరుడు బెజవాడ పాపిరెడ్డి గొప్ప పార్లమెంటేరియన్‌గా పేరుపొందారు. ఆయన కూడా బుచ్చి నివాసే.

ఇప్పటి వరకు కోవూరులో విజయం సాధించిన నేతలు

సంవత్సరం	విజేత	పార్టీ
1962	రేబాల దశరథరామిరెడ్డి	కాంగ్రెస్
1967	కే వెంకురెడ్డి	కాంగ్రెస్
1972	పెళ్ళకూరు రామచంద్రారెడ్డి	కాంగ్రెస్
1978	పెళ్ళకూరు రామచంద్రారెడ్డి	కాంగ్రెస్
1983	నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి	టీడీపీ
1985	నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి	టీడీపీ
1989	నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి	కాంగ్రెస్
1993	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడి	టీడీపీ
1994	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి	టీడీపీ
1999	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి	టీడీపీ
2004	పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి	కాంగ్రెస్
2009	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి	టీడీపీ
2012	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడి	వైసీపీ
2014	పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి	టీడీపీ
2019	నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి	వైసీపీ

ఏబీ ఫారాలంటే...?

తెలుసుకుందాం

ఏ ఎన్నికల సమయంలో ఏ ఫారం, బీఫారం అనే పదాలు తరుచూ వింటుంటాం. గుర్తింపు పొందిన ప్రాంతీయ /జాతీయ పార్టీలు తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులకు బీఫారం ఇస్తాయి. అంటే పలానా నియోజకవర్గం నుంచి తమ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థి ఇతనే అని ఇచ్చే ధ్రువీకరణ పత్రమే ఇది. ఈ ఫారాన్ని పార్టీ అధ్యక్షుడుకాని, ఆ పార్టీకి చెందిన ప్రత్యేక ప్రతినిధి కానీ అభ్యర్థులకు అందిస్తారు. నామినేషన్ వేసే సమయంలో ఆర్వోకి బీఫారం దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇలా సమర్పించిన అభ్యర్థులకే ఎన్నికల కమిషన్ ఆ పార్టీ గుర్తును కేటాయిస్తుంది. లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తుంది. బీఫారం ఇచ్చే అధికారాన్ని అప్పగిస్తూ ఇచ్చేదే ఏ ఫారం. దీన్ని తీసుకున్న వ్యక్తే అభ్యర్థులకు బీఫారం ఇచ్చే అధికారం ఉంటుంది.

\- సంగం

మాటకు ప్రాధాన్యం ఇచ్చేవారు..

నా జ్ఞాపకం



యాభైఏళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో మాటకు ప్రాధాన్యమిచ్చేవారు. ఏ జాము అయినా నాయకుడు ఇళ్ల కాడికి వచ్చి... ఎన్నికల్లో నిలుస్తున్నా.. ఏమంటావ్... మనోళ్లతో మాట్లాడు... అని చెప్పేవాడు. డబ్బు మాటే మాట్లాడేవారు కాదు. సందేళ కుటుంబ సభ్యులతో కలసి మాట్లాడి ఓ నిర్ణయానికి వచ్చేవాళ్లం. అది కూడా ఇంటి పెద్ద నిర్ణయం మేరకు ఓట్లు వేసేవాళ్లం. ఆ రోజుల్లో అభివృద్ధి చేసే వాళ్లే పోటీ పడేవారు. మాటకు కట్టుబడి ఉండేవారు. ఈ రోజుల్లో అలాంటి వారు కరువయ్యారు.

\- గనిపిసేని నాగరాజు, బిట్రగుంట

అన్న ఫోనంటే హడల్!



ఇదీ మందు




"అన్నా.. బాగుండారు గదా.. గెలవబోయేది మళ్లీ మనమే. మనం కోరుకున్నది చేసుకోవచ్చు. ఎలక్షను ఖర్చులు బాగా పెరిగిపోయినాయని తెలుసుకదా. మనోడు వొచ్చి కలుస్తాడు. మరిచిపోబాకండి" అంటూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వ్యాపారులకు ఫోన్‌లు వస్తున్నాయి. అయిదేళ్లుగా అధికార పార్టీ దందాలు కళ్లజూసిన వీరు ఇటువంటి ఫోన్ రాగానే హడలిపోతున్నారు. మొబైల్ మోగగానే ఎక్కడి నుంచా అని ఆందోళనగా చూస్తున్నారు. నాయకుడి అసలు నెంబరు నుంచి గాక ప్రతిసారీ ఏదో కొత్త నెంబరు నుంచే ఫోన్‌లు వస్తున్నాయి. అడిగినంత ఇచ్చుకోలేక. అలా అని ఇవ్వకపోతే ఏమవుతుందో అనే భయం వదులుకోలేక వ్యాపారులు ఆందోళనపడుతున్నారు. 'ఇసుకలో బానే ఎనకేసుకున్నారు గదా. భూములు, పంచాయతీలు అని కోట్లు సంపాయిస్తిరి.. ఇప్పుడు మళ్లీ మనమింద పడ్డారేంది స్వామీ' అని ఒకరికొకరు కలబోసుకుని కడుపు చించుకుంటున్నారు.

- రేణిగుంట

రాష్ట్ర మంత్రి రోజా ఎక్కే గడప దిగే గడపతో సతమతమవుతున్నారు. పుత్తూరుకు చెందిన వైసీపీ కీలకనాయకుడు ఏలుమలై మొదలియార్ టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో ఆమె అలెర్ట్ అయ్యారు. అసమ్మతి వర్గ నేతల పట్ల ఇప్పటిదాకా ఉన్న బింకాన్ని సడలించుకుని వారి ఇళ్లకు తిరుగుతున్నారు. ఏలుమలై మొదలియార్ వర్గంకే చెందిన వైసీపీ నాయకుడు నారాయణబాబు ఇంటికి వెళ్లి తనకు సహకరించాలని రోజా కోరారు. అలాగే విజయపురం మండలంకు చెందిన అసమ్మతి నాయకుడు లక్ష్మీపతిరాజును కలిసేందుకు ప్రయత్నించినా ఆయన అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు. బుధవారం నగరి మున్సిపాలిటీకి చెందిన మొదలియార్ సామాజికవర్గంలో కీలక నాయకుడు పురుషోత్తం మొదలియార్‌ను ఆయన ఇంట్లోనే కలిశారు. అదే రోజు మధ్యాహ్నం నగరి మున్సిపల్ మాజీ ఛైర్మన్ కేజే కుమార్ ఇంటి గడప తొక్కారు. 'ఇప్పటి వరకు జరిగిందేదో జరిగిపోయింది...ఈ ఎన్నికల్లో నాకు సహకరించండి' అంటూ వారందరినీ కోరుతున్నట్లు సమాచారం. అయితే వెళ్లిన ప్రతిచోటా సానుకూలత లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నట్లు నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. రెండు వారాల క్రితం తిరుపతిలో శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ రెడ్డి వారి చక్రపాణిరెడ్డిని కలిసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారని తెలిసింది. 'జరగాల్సిన నష్టం జరిగిపోయాక ఇప్పుడు గడప గడపకు తిరిగి లాభం ఏమిటి' అనే నిట్టూర్పులు వైసీపీలోనే వినిపిస్తుండడం విశేషం.

- పుత్తూరు అర్బన్

ఎక్కే గడప ... దిగే గడప!



జన కేతనం

శుక్రవారం 26 ఏప్రిల్ 2024

ఖాతాల్లో జమ కాని విద్యాదీవెన, వసతి దీవెన సొమ్ము

విద్యా సంవత్సరం ముగుస్తోందని విద్యార్థులు ఆందోళన

అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్న తల్లిదండ్రులు


జగన్ మాటలకు మోసపోయామంటూ లబోదిబో

మీ బిడ్డల చదువుల విషయం నాకొదిలేయండి. జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాలతో పెద్ద చదువులు చదివించండి.

- విద్యార్థుల తల్లిదండ్రులకు సీఎం జగన్ తరచూ చెప్పే మాటలివి


రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని సీఎం జగన్‌రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇందుకు విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను క్రమం తప్పకుండా అమలుచేస్తున్నామంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆయన పచ్చి అబద్ధాలు చెబుతున్నారని అర్థం అవుతుంది. విద్యాదీవెన పథకంలో ప్రారంభ సంవత్సరం నుంచి పలు అంశాలను సాంకేతిక కారణాల సాకుగా చూపుతూ లబ్ధిదారుల సంఖ్యను కుదిస్తూ వచ్చారు. ఆఖరు సంవత్సరానికి మొత్తం చేతులెత్తేశారు.

- తిరుపతి(కలెక్టరేట్)



బటన్ నొక్కి రెండు నెలలు..

డబ్బులేవి జగన్ మామా..!



పేద విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలల్లో రూపాయి కూడా ఫీజు రూపంలో చెల్లించాల్సిన పని లేదని, అంతా ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చిన జగన్ ఆచరణలో విద్యార్థుల నడ్డివిరిచారు. విద్యాదీవెన, వసతి దీవెన కింద ఆర్థిక సాయాన్ని జమ చేయడానికి ఆయన బటన్ నొక్కి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జమ కాలేదు. ఐదేళ్లుగా పథకాలకు నిధులు సక్రమంగా విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ విద్యాసంవత్సర త్రైమాసికానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఈఏడాది మార్చి 1న ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ ఫోటో ఫోజులిచ్చి నమూనా చెక్కులు విడుదల చేశారే తప్ప డబ్బులు జమయ్యాయా లేదో తెలుసుకోలేదు. ఈ విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకున్నా పథకాల సొమ్ము అందలేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలు ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు ఫీజు చెల్లిస్తేనే వార్షిక పరీక్షలకు అనుమతిస్తామంటున్నాయి. దీంతో అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారు.

జిల్లాలో కాకిలెక్కలు

జిల్లాలో 2019 నుంచి ఇప్పటివరకు వసతి దీవెన కింద రూ.188.92 కోట్లు, విద్యాదీవెన కింద రూ.475.23 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు కాకి లెక్కలు చెబుతున్నారు. క్షేత్రస్థాయికి వచ్చే సరికి తల్లిదండ్రుల ఖాతాల్లో చాలా వరకు నగదు జమ కాలేదు. ఇక చివరకు ఈ ఏడాది మొదటి త్రైమాసికానికి 39,368 మంది విద్యార్థులకు రూ.29.50కోట్లు జమ చేస్తున్నట్లు ఫోటోలకు ఫోజులు ఇచ్చారు. కానీ తమకు అందలేదని విద్యార్థులూ, తల్లిదండ్రులూ చెబుతున్నారు.

అప్పు చేసి సర్టిఫికెట్లు తీసుకున్నాం



అప్పు చేసి రూ.56 వేలు ఫీజు కడితే సర్టిఫికెట్లు ఇచ్చారు. పుత్తూరులోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం కూడా పూర్తయింది. విద్యాదీవెన రాలేదు. అధికారులను అడిగితే తెలియదన్నారు. ఫీజు కడితే కానీ సర్టిఫికెట్లు ఇవ్వమని కళాశాల యాజమాన్యం చెప్పింది. చేసేది లేక మా తల్లిదండ్రులు అప్పు చేశారు. మాలాంటి పేదవారిపట్ల ప్రభుత్వం ఇలాగేనా ప్రవర్తించేది.

- వై.లోకేష్(బీటెక్), ఆర్‌సీపురం

ప్రభుత్వం మోసం చేసింది



మా తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లేవారు. లేకపోతే పూటగడవదు. ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదివినప్పుడు విద్యాదీవెన కింద ప్రభుత్వం రూ.8వేలు ఖాతాలో వేసింది. ఇపుడు డిగ్రీ పూర్తవుతోంది. ఇంత వరకూ ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. ఎలా ఫీజు కట్టేది. ప్రభుత్వం మమ్మల్ని మోసం చేయడం కరెక్టేనా.

- వినయ్, మిట్టగాంధీపురం, తిరుపతి రూరల్

ఒక విడత కూడా అందలేదు



విద్యాదీవెన ఆసరాగా ఉంటుందని ఓ ప్రైవేటు కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సులో చేరాను. ప్రభుత్వం ఇచ్చే రీయింబర్స్‌మెంట్ చదువుకు ఉపయోపడుతుందనుకున్నా. విద్యాదీవెన ద్వారా ఇప్పటి వరకు ఒక విడత కూడా సాయం అందలేదు. అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నా. విద్యా దీవెన ఎప్పటికొస్తుందో అర్థం కాకుండా ఉంది.

- వంశీకృష్ణ, చిల్లకూరు

ఇంకా జమకాలేదు



నేను తిరుపతిలోని ఓప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాను. జగన్ మామయ్య బటన్ నొక్కి రెండు నెలలవుతోంది. ఇప్పటికీ రూపాయి కూడా జమకాలేదు. విద్యాసంవత్సరం కూడా ముగుస్తోంది. డబ్బులు ఎపుడు వస్తాయో తెలియని పరిస్థితి.

- విశాల్, తిరుపతి రూరల్

డబ్బులు రాని బటన్ నొక్కడం ఎందుకు



అధికారంలోకి వస్తానే విద్యావ్యవస్థకు పెద్దపీట వేసి పేద విద్యార్థులకు సొంత మామయ్యలా అండగా ఉంటానని సీఎం జగన్‌రెడ్డి డాంబికాలు పలికారు. ఉత్తిత్తి బటన్లు నొక్కుతున్నారు. విద్యాసంవత్సరం ముగుస్తున్నా తల్లిదండ్రుల ఖాతాల్లో పైసా కూడా జమ కాకపోవడం దుర్మార్గం. ముమ్మాటికీ ప్రభుత్వం మోసం చేసినట్లే.

- ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి



మోసం గురూ!

టీడీపీకి పెట్టని కోట

1983 తరువాత ఆరుసార్లు గెలిచిన తెలుగుదేశం

రెండుసార్లు మాత్రమే కాంగ్రెస్ విజయం



సత్యవేడు,ఏప్రిల్ 24: టీడీపీకి సత్యవేడు నియోజకవర్గం పెట్టని కోట. 1983లో ఆ పార్టీ ఆవిర్భవించాక వరుసగా టీడీపీ విజయదుందుభి మోగిస్తోంది. కేవలం రెండు సార్లు మాత్రమే కాంగ్రెస్ గెలవగలిగింది. తమిళనాడు సరిహద్దులోని ఈ నియోజకవర్గం 1961కు ముందు ఆ రాష్ట్రంలోని నాటి చెంగల్‌పట్టు జిల్లా తిరువళ్ళూరు తాలూకాలో అంతర్భాగంగా ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా పటాస్కర్ అవార్డు ప్రకారం 1962 ఏప్రిల్ 2న ఆంధ్రప్రదేశ్‌లో కలిసింది. తొలుత ఏడు మండలాలుండేవి. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా తొట్టంబేడు, పెళ్ళకూరు మండలాలను దీని నుంచి వేరు చేశారు. నారాయణవనం, కేవీబీపురం మండలాలను కలిపారు. ఇప్పటి వరకూ అత్యధికంగా ఆరుసార్లు టీడీపీ గెలుపొందింది. ఐదుసార్లు కాంగ్రెస్ గెలుపొందింది. 1978 ఎన్నికల వరకూ ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయకేతనం గెలవగా తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం తర్వాత పరిస్థితి తారుమారు అయింది. టీడీపీ హవా కొనసాగించింది. కాంగ్రెస్ రెండుసార్లు మాత్రమే గెలిచింది. 1978లో గెలుపొందిన సీ.దాస్, 1999లో ఎన్నికైన ఎన్.శివప్రసాద్ మాత్రమే మంత్రులుగా పనిచేశారు.

సత్యవేడు చరిత్ర

ఎప్పుడు ఆవిర్భవించింది : 1962

ఎన్నిసార్లు ఎన్నిక జరిగింది: 13

నియోజకవర్గంలో మండలాలు:

సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, కేవీబీపురం.

ఎమ్మెల్యేలు

1962	టి.బాలక్రిష్ణయ్య	కాంగ్రెస్
1967	కె.మునస్వామి	స్వతంత్ర
1972	సి.దాస్	కాంగ్రెస్
1978	సి.దాస్	కాంగ్రెస్
1983	తలారి మనోహర్	టీడీపీ
1985	ఎం.సురాజ్	టీడీపీ
1989	సి.దాస్	కాంగ్రెస్
1994	ఎం.సురాజ్	టీడీపీ
1999	ఎన్.శివప్రసాద్	టీడీపీ
2004	కె.నారాయణస్వామి	కాంగ్రెస్
2009	హెచ్.హేమలత	టీడీపీ
2014	తలారి ఆదిత్య	టీడీపీ
2019	కోనేటి ఆదిమూలం	వైసీపీ

ఓటర్ల వివరాలు

మొత్తం : 2,11,378

పురుషులు : 1,02,568

మహిళలు : 1,08,797

ఇతరులు : 13

వైసీపీ నేతల చెరలో చెరువులు

- రూపాయి చెల్లించకుండా అక్రమార్జన

అధికారం అడ్డం పెట్టుకుని వైసీపీ నాయకులు చేస్తున్న అక్రమాలు అన్నీఇన్నీ కావు. ప్రశ్నిస్తే ఏం జరుగుతుందోనని ప్రజలు మౌనంగా భరిస్తున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంట మండల పరిధిలో పంచాయతీ చెరువులను అధికార పార్టీ నేతలు గుప్పెట్లో పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్నారు. ఒక్క రూపాయి కూడా ప్రభుత్వానికి చెల్లించకుండా దర్జాగా చెరువుల్లోని చేపలను అమ్ముకుంటున్నారు. లక్షల్లో వెనకేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మండల పరిధిలో పంచాయతీ, సొసైటీ చెరువులు 52 ఉన్నాయి. ఇందులో పంచాయతీ ఆధీనంలో 19 పెద్ద చెరువులున్నాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి సంవత్సరం వేలం పాట నిర్వహించారు. తరువాత 2020 కరోనా రావడంతో 2021లో గతంలో పాడిన వారికి నష్టాలు చూపుతూ కొనసాగించారు. ఆ తరువాత నుంచి గ్రామాల్లోని వైసీపీ నేతలు చెరువుల వేలం జరగనివ్వకుండా సిండికేట్ అయిపోతున్నారు. సాధారణంగా గత పాట ధరకు ప్రతి ఏటా పదిశాతం పెంచాల్సి ఉంది. వైసీపీ నేతల ఒత్తిడితో ఐదు శాతం మాత్రం పెంచుకుని 19 చెరువులనూ దక్కించుకున్నారు. ఎలమండ్యం, ఆర్ మల్లవరం, కరకంబాడీ, వెదళ్ల, అనుగుంట, చీరాలమ్మ, అత్తూరు, గాజులమండ్యం, తూకివాకం, కోట్ర మంగళం, జీపాళెం, ఆనేయపురం, రామపపురం చెరువులకు ఇప్పటి వరకు రూపాయి చెల్లించలేదు. గత ఏడాది పాడుకున్న తుమ్మలగుంట, లక్ష్మమాక చెరువులకు సైతం పైసా చెల్లించలేదు. రేణిగుంట మండల పరిధిలోని మత్స్యకార శాఖ ఆధీనంలోని 33 సొసైటీ చెరువులను సొసైటీ సభ్యుల పేరుతో వైసీపీ నేతల బినామీల అతి తక్కువ ధరతో దక్కించుకుంటున్నారని సమాచారం. ఇప్పటికీ ప్రతి వారంలో రెండుసార్లు చెరువులో చేపలను పట్టి దర్జాగా బహిరంగ మార్కెట్లో విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు.



వైసీపీ నేతల ఆధీనంలో ఉన్న వెంకటాపుం పెద్దచెరువు

- రేణిగుంట

విశేషం

'పేట' హ్యాట్రిక్ వీరుడు



మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పిట్ల వెంకటసుబ్బయ్య

సూళ్లూరుపేట హ్యాట్రిక్ వీరుడిగా పిట్ల వెంకటసుబ్బయ్యను అందరూ తలచుకుంటారు. పదహారేళ్ల ఎమ్మెల్యేగా చేసిన ఆయన పింఛను మీద ఆధారపడే చివరిదాకా జీవించారు. 1962లో సూళ్లూరుపేట నియోజకవర్గం ఏర్పడింది. 1967లో జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పిట్ల వెంకటసుబ్బయ్య పోటీ చేసి, తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి మేర్లపాక మునస్వామిపై 1853 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 1972 ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీచేసిన కటారి మునస్వామిపై 11,425 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1978 ఎన్నికల్లో జనతాపార్టీ అభ్యర్థి దొడ్డి వీరాస్వామిపై 21,414 ఓట్ల తేడాతో విజయఢంకా మోగించారు. ఈ హ్యాట్రిక్ రికార్డు సూళ్లూరుపేటలో ఇప్పటిదాకా ఎవ్వరూ బ్రేక్ చేయలేకపోయారు. 1994, 1999 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పరసా వెంకటరత్నయ్య రెండుసార్లు గెలుపొందినా, 2004లో ఓడిపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచారు. మూడోసారి పోటీ చేస్తున్నారు.

- తడ


నోట్ దిస్ పాయింట్

ప్రచారంలో గీత దాటితే..

నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ప్రచారాలు హోరెత్తుతున్నాయి. ఈ సందట్లో పార్టీలూ కార్యకర్తలూ నిబంధనలు మరచిపోయి అత్యుత్సాహంతో ప్రవర్తిస్తుంటారు. ఎన్నికల సంఘం ప్రచారాలకు స్పష్టమైన గీత గీసింది. ఆ నిబంధనలు ఇవీ...

- వెంకటగిరి/డక్కిలి

- ప్రచార వాహనాలకు రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి. అనుమతి పత్రాన్ని వాహనానికి అతికించాలి. వాహనాన్ని అనుమతి పొందిన అభ్యర్థే వాడాలి. ఇతరులు వాడితే చర్యలు తీసుకుంటారు.
- విద్యాసంస్థల్లో, వాటి మైదానాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదు.
- కరపత్రాలపై ముద్రణాలయాల పేరు, చిరునామా కచ్చితంగా ఉండాలి
- ప్రచారంలో టోపీలు, కండువాలు ఇవ్వవచ్చు, వీటిని ఎన్నికల ఖర్చులో చూపించాలి. ధరించే దుస్తులు మాత్రం ఇవ్వకూడదు.
- దేవుళ్ల ఫోటోలు, అభ్యర్థి ఫోటోతో కలిపి డైరీలు, క్యాలెండర్లు ప్రచురించకూడదు. వాహనాలపై కూడా మతపరమైన ఫోటోలు, అభ్యర్థి ఫోటోలు ఉండకూడదు.
- ప్రార్థనా స్థలాలకు, పాఠశాలలకు, పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల లోపు రాజకీయ పార్టీల తాత్కాలిక కార్యాలయాలు ఉండకూడదు.
- రాత్రి 10 గంటల తర్వాత, ఉదయం 6 గంటల లోపు మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదు.
- ఏజెంట్ సంబంధిత పోలింగ్ బూత్ పరిధిలో ఓటరై ఉండాలి.
- ఊరేగింపు రూటును ముందుగానే పోలీసులకు తెలియజేయాలి.
- దిష్టి బొమ్మలు తగల బెట్టకూడదు.



గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నాయుడుపేట వరకు మెమో రైళ్లను పొడిగించండి



డీఆర్‌ఎం తో మాట్లాడుతున్న ప్రజలు

నాయుడుపేట, ఏప్రిల్ 25: చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు వచ్చే దాదాపు 12 మెమో రైళ్లను నాయుడుపేట స్టేషన్ వరకు పొడిగించాలని సదరన్ రైల్వే డీఆర్‌ఎం బి.విశ్వనాథ్‌కు నాయుడుపేటకు చెందిన పలువురు విన్నవించారు. చెన్నైలోని సదరన్ రైల్వే కార్యాలయంలో డీఆర్‌ఎంను మర్యాదపూర్వకంగా కలిసిన స్థానికులు సదరన్ రైల్వే నాయుడుపేట, గూడూరు మండలం ఓడూరు వరకు ఉందని నాయుడుపేటలో సెజ్ ఉండటంతో పలు రాష్ట్రాల ప్రజలు ఇక్కడ ఉన్నారన్నారు. పలువురు చెన్నైకు వివిధ పనుల కోసం వెళ్తుంటారని అందరికీ అనువుగా చెన్నై నుంచి వచ్చే మెమో రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలని కోరారు. అలాగే రిజర్వేషన్ కౌంటర్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. బుకింగ్ కౌంటర్‌లోని రిజర్వేషన్ కౌంటర్ ఉండటంతో రైళ్ల రాకపోకల సమయంలో, తత్కాల్ సమయంలో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నట్టు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీఆర్‌ఎం ఈ మేరకు విచారించి తగు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. డీఆర్‌ఎంను కలసిన వారిలో ఎం.మస్తానయ్య, జోసెఫ్, రఘువరణ్, రామకృష్ణ, రఫి, కిరణ్, సాయి, మురళీ, ప్రసాద్, శ్రీను, సురేష్ తదితరులున్నారు.

వలంటీర్ల రాజీనామా

బాలాయపల్లి, ఏప్రిల్25: మండలంలోని హస్తకావేరి సచివాలయం పరిధిలోని హస్తకావేరి గ్రామానికి చెందిన ఇద్దరు వలంటీర్లు, కామకూరు గ్రామానికి చెందిన నలుగురు వలంటీర్లు, నిడిగల్లు సచివాలయ పరిధిలోని నిడిగల్లుకు చెందిన వలంటీరు కలిపి ఏడుగురు గురువారం రాజీనామా చేసినట్లు అధికారులు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

పెళ్లకూరు, ఏప్రిల్ 25: మండలంలోని చిల్లకూరులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంట కాలువల పనులను పరిశీలించి కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. పనులు జరిగే చోట కూలీలు సేద తీరేందుకు టెంట్, తాగునీరు సదుపాయం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో దయానందం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

సూళ్లూరుపేట, తడ, ఏప్రిల్ 25: సూళ్లూరుపేట నియోజకవర్గానికి సంబంధించి 16మంది అభ్యర్థులు 31 నామినేషన్లు దాఖలు చేశారని ఆర్వో చంద్రముని తెలిపారు. వీరిలో టీడీపీ నుంచి నెలవల విజయశ్రీ మూడు సెట్లు, వైసీపీ నుంచి కిలివేటి సంజీవయ్య, కిలివేటి సుభాషిణి, కాంగ్రెస్ నుంచి గాడి తిలక్ బాబు, బీఎస్పీ అభ్యర్థి టి.రమణయ్య, స్వతంత్ర అభ్యర్థి ఎస్.అరుణ మూడు సెట్ల నామినేషన్ల దాఖలు చేశారన్నారు. .

గూడూరు బరిలో 22 మంది

గూడూరు అర్బన్: గురువారం నామినేషన్ల పర్వం ముగియగా గూడూరు ఎస్సీ రిజర్వుడు స్థానానికి మొత్తం 35 నామినేషన్లు దాఖలయ్యాయి. తాజాగా గురువారం నాడు 10 నామినేషన్లు దాఖలైనట్టు రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కిరణ్‌కుమార్ వెల్లడించారు. మొత్తం 22మంది అభ్యర్థులు తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.

వెంకటగిరి టౌన్: వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 20 నామినేషన్లు దాఖలయ్యాయని ఆర్వో ధ్యాన్‌చంద్ తెలిపారు. వీరిలో వైసీపీ నుంచి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి మూడు సెట్లు, నేదురుమల్లి గౌతమ్ కుమార్ రెడ్డి రెండు సెట్లు, టీడీపీ నుంచి కురుగొండ్ల రామకృష్ణ రెండు సెట్లు, కురుగొండ్ల లక్ష్మీసాయి ప్రియ రెండు సెట్లు సహా కాంగ్రెస్, స్వతంత్రులు నామినేషన్లు వేసినట్లు ఆయన తెలిపారు.

షార్ ఉద్యోగి ఆత్మహత్య



కోదండ గంగేశ్వర్ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25: షార్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేసే ఎం.కోదండ గంగేశ్వర్ (31) ఉరేసుకున్నాడు. ఎస్ఐ కోట రహీంరెడ్డి సమాచారం మేరకు.. కాకినాడ జిల్లా తొండంగి మండలం, పెద్ద కొండ గ్రామానికి చెందిన గంగేశ్వర్ షార్‌లో ఎంవీఐటీ విభాగంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. సూళ్లూరుపేట షార్ ఉద్యోగుల కాలనీ కేఆర్‌పాలెం బీ4-153లో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. బుధవారం విధులకు హాజరయ్యాడు. గురువారం ఉదయం 10 గంటలైనా రాకపోవడంతో సహచర ఉద్యో గి ఆయన ఇంటికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉన్నట్టు గుర్తించాడు. వెంటనే చుట్టుపక్కల వారితో కలిసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని గదిని పరిశీలించారు. భవిష్యత్తును తలచుకొని వివాహమైతే ఎలా బతకాలో మనవేదనకు గురై ఉరేసుకుంటున్నట్టు రాసిన ఉత్తరాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరి మహిళపై వైసీపీ నేతల దాడి

బాలాయపల్లి, ఏప్రిల్ 25: మండలంలోని పిగిలాం గ్రామానికి చెందిన వెంకటరత్నమ్మ ఇంటి, పెరటి స్థలాలను ఇద్దరు వైసీపీ నేతలు ఆక్రమించారు. దీనిపై ప్రశ్నించినందుకు తనపై వైసీపీ నేతలు తమ అనుచరులతో దాడి చేయించారని బాలాయపల్లి పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాను ఒంటరి మహిళ అని, తనకు తన తల్లి ద్వారా సంక్రమించిన స్థలాన్ని ఇద్దరు వైసీపీ నేతలు చెరో స్థలం ఆక్రమించారని, ప్రశ్నిస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు.

దుకాణాల్లో యంత్ర సామగ్రి చోరీ

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 25: నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో రెండు మెకానికల్ దుకాణాల్లో రూ.2 లక్షల విలువ చేసే యంత్ర సామగ్రి చోరీకి గురైనట్లు బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎప్పటి లాగే వ్యాపారం ముగించుకొని బుధవారం రాత్రి దుకాణాలకు తాళాలు వేసుకొని ఇంటికి వెళ్లామన్నారు. గురువారం ఉదయం దుకాణాలు తెరిచేందుకురాగా తాళాలు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారు.

టీడీపీలో చేరిక

తడ, ఏప్రిల్ 25 : వైసీపీ పంచాయతీ వార్డు సభ్యుడు టీడీపీలో చేరారు. రామాపురం పంచాయతీకి చెందిన వార్డు సభ్యుడు రంజిత్‌కుమార్ తన సహచరులతో కలసి గురువారం సాయంత్రం టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. మురళీరెడ్డి, నీలకంఠం, టీకే శ్రీనివాస్, మనోహర్, శివాజీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం

కోట, ఏప్రిల్ 25: మండల పరిధిలోని సిద్ధవరం పంచాయతీలో గురువారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ కూటమి అభ్యర్థులైన వెలగపల్లి వరప్రసాదరావు, పాశిం సునీల్ కుమార్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. బీజేపీ తిరుపతి కోర్ కమిటీ సభ్యుడు డి.గిరిధర్‌రెడ్డి, కత్తి నిరంజన్, శ్రీనివాసులు, ప్రసాద్, పి.కోటేశ్వరరావు, సారంగం రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

చిల్లకూరు, ఏప్రిల్ 25: మండలంలోని తిప్పగుంట పాళెం, ముత్యాలపాడు, పారిచెర్లవారిపాళెంలోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో భానుమూర్తిరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. తిప్పగుంట పాళెంలోని పోలింగ్ కేంద్రంలో నీటి సౌకర్యాన్ని కల్పించామన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు శాసన సభ స్థానాల సాధారణ పరిశీలకుడు కరిగౌడ తెలి పారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల నియామక అధికారుల సమావేశంలో పోలింగ్ నిర్వహణ, ఎన్నికల నిబంధనల అమలు సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆర్డీవో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటూ క్రీడల్లో రాణించాలి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 25: విద్యార్థులు చదువుతోపాటూ క్రీడల్లో రాణించాలని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల హెచ్‌వోడీ హరి అన్నారు. గురువారం ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువులతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించి జాతీయస్థాయిలో రాణించేలా తీర్చిదిద్దుతామన్నారు.

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి: బీజేపీ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 25: కూటమి అభ్యర్థుల విజయానికి ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ నాయకులు అన్నారు. గురువారం మండలంలోని చెన్నూరులో ప్రచారం నిర్వహించారు. ఏ.బాల కృష్ణమనాయుడు, సునీల్‌కుమార్, సురేష్, శీనయ్యగౌడ్, కొండయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం చుట్టూ వైసీపీ జెండాలు





అంబేడ్కర్ విగ్రహానికి కట్టిన వైసీపీ జెండాలు - ఆర్టీసీ బస్టాండులో వైసీపీ నాయకుల వాహనాల పార్కింగ్

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ జెండాలు కట్టి కేరింతలు కొట్టి చిందులేసిన సంఘటన గురువారం సూళ్లూరుపేటలో జరిగింది. వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య నామినేషన్ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఎన్నికల నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. నామినేషన్ ర్యాలీకి వైసీపీ నాయకులు ఆయా ప్రాంతాల నుంచి జనసమీకరణ చేసుకుని ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నారు. ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ జెండాలు కట్టి హంగామా చేశారు. అక్కడే పోలీసులు, ఎంసీసీ, ఎన్నికల నిఘా టీంలున్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

ట్రాఫిక్ చిక్కులు...

కిలివేటి నామినేషన్ సందర్భంగా ఆర్టీసీ బస్టాండు వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. జీఎన్‌టీ రోడ్డు మీదుగా వచ్చే వాహనాలను పోలీసులు మళ్లించారు. నెల్లూరు, చెన్నై వైపు నుంచి వచ్చే బస్సులకు తిప్పలు తప్పలేదు. ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థుల ప్రచారం, నామినేషన్ కార్యక్రమాలకు ట్రాఫిక్ అంతరాయం కలగకూడదు. అధికార పార్టీకి ఇవేమి వర్తించడం లేదు. 11 గంటల నామినేషన్ ర్యాలీకి ఉదయం 9.30 గంటలకే ఆర్టీసీ బస్టాండు వద్దకు వైసీపీ పార్టీ శ్రేణులు జెండాలు పట్టుకొని చేరుకున్నారు. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. ఆర్టీసీ బస్టాండు ఆవరణలో సైతం నాయకుల కార్లను పార్కింగ్ చేసుకోవడం గమనార్హం. తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ఎవరు వెళ్లకూడదు. ఇవేవి తమకు వర్తించవంటూ అధికార పార్టీ నాయకులు నామినేషన్ కేంద్రం ఆనుకొనే ఎంపీడీవో కార్యాలయంలోకి వెళ్లి అక్కడే తిరుగుతూ కనిపించారు.

చంద్రన్న సారథ్యంలోనే సంక్షేమ ప్రభుత్వం: పాశిం



సూపర్ సిక్స్ కరపత్రాల పంపిణీలో సునీల్‌కుమార్

వాకాడు, ఏప్రిల్ 25: ఎన్నికలు అనంతరం రాష్ట్రంలో చంద్రబాబు సారథ్యంలో నిజమైన సంక్షేమ రాజ్యం రాబోతుందని గూడూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని వాకాడులో కూటమి నాయకులు సన్నారెడ్డి విజయ శేఖర్‌రెడ్డి, పి.పురుషోత్తమరెడ్డి, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు మహిళలకు అండగా నిలుస్తాయన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి పథకాలు అర్థమయ్యేలా వివరించారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్నా రాష్ట్రాభివృద్ధి జరగాలన్నా ఎన్డీఏ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. సీఎం జగన్ అధికారంలోకి రాగానే మద్యపాన నిషేదాన్ని అమలు చేశాకే ఓటు అడిగేందుకు వస్తానని చెప్పి మాటతప్పారని, మాట ఇచ్చి మడమతిప్పితే ఓట్లు వేయవద్దని ఓటర్లను కోరారు. టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎన్నో పథకాలు ప్రవేశపెడితే వాటిని తొలగించిన ఘనత జగన్‌దే అన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం టీడీపీ కూటమితోనే సాధ్యమని సైకిల్ గుర్తుపై ఓటువేసి తమను గెలిపించాలన్నారు. బి.ప్రమీల, ఎన్.సుధాకర్‌రెడ్డి, ఎ.చంద్రయ్య, షేక్ రహంతుల్లా, కె.దయాకర్, కోటా శ్రీనివాసులు, జానకిరామిరెడ్డి, చిరంజీవమ్మ, సునీత, డి. కృష్ణమూర్తి, అరావళి ప్రసాద్, పి.కృష్ణయ్య, వాకాటి సంపత్‌కుమార్, మామిడి గోవిందయ్య తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులతో టీడీపీ నాయకుల ఆత్మీయ సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 25: పట్టణంలో టీడీపీ సీనియర్ నేత శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి నివాసంలో గురువారం రాత్రి ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న టీడీపీ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ మాట్లాడుతూ... రాష్ట్రాభి వృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. మాజీ మంత్రి పరసా వెంకటరత్నం మాట్లాడుతూ... వైసీపీ పాలనతో అభివృద్ధి కుంటుబడిందని ప్రజలు రాష్ట్ర పరిస్థితులను మనస్సులో పెట్టుకొని టీడీపీని గెలిపించుకోవాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం మాట్లాడుతూ యువతక ఉపాధి అవకాశాలు రావాలంటే చంద్రబాబును సీఎం అయితేనే సాధ్యమన్నారు. అభ్యర్థి విజయశ్రీ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేం దుకే వైద్య వృత్తిని వదులుకొని రాజకీ యాల్లోక వచ్చానని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు రంగినేని క్రిష్ణయ్య, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, టీడీపీ నాయకులు తిరు మూరు సుధాకర్ రెడ్డి, కందల కృష్ణారెడ్డి, ఆదవరం మాధవయ్య, రఫీ, గూడూరు ప్రభావతమ్మ, సుధీర్ రెడ్డి, పెనల కిషోర్ బాబు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఉగ్గుముడి భాస్కర్ రెడ్డి, కట్టం రెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి, పెనల గంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేసుకుందాం



నాయుడుపేట, ఏప్రిల్ 25: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం చంద్రబాబును సీఎం చేసుకుందామని నాయుడుపేట మున్సిపల్ వైస్‌చైర్మన్ రఫీ అన్నారు. నాయుడుపేట పట్టణంలోని అశోక్‌నగర్, విన్నమాల రోడ్డు, కాళహస్తి బైపాస్‌రోడ్డులో ర్యాలీ చేపట్టారు. పీఎంగా నరేంద్రమోడీ, సీఎంగా చంద్రబాబు ఉంటేనే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని, అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇందుకోసం సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ, తిరుపతి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావును గెలిపించుకుందామన్నారు. నెలవల రాజేష్, డి.రాజేంద్ర, ముత్యాలయ్య, సులేమాన్, భావన్, పృథ్వీ, వెంకటాద్రి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళాభివృద్ధి



బాలాయపల్లి, ఏప్రిల్ 25: టీడీపీతోనే మహిళాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడు అన్నారు. మండలంలోని కోటంబేడులో ఇంటింటికీ తిరిగి టీడీపీ ప్రకటించిన పథకాలను వివరించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం ఇరవై ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. రాష్ట్రాభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం అయితేనే సాధ్యమవు తుందన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి రాయి సత్యంనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, ఏఎంసీ మాజీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్ రావు, దాసరి రాజగోపాల నాయుడు, దాసరి ప్రభాకర నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు వి.సురేంద్రరెడ్డి, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు





స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వరప్రసాద రావు - కొల్లూరి లక్ష్మికి సత్కారం

కోట, గూడూరు, ఏప్రిల్ 25: తనకు మరోసారి అవకాశం ఇస్తే తిరుపతి పార్లమెంట్‌ను అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చుదిద్దుతానని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. గురువారం ఆయన కోట పట్టణంలోని ఓ ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గూడూరు ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధిని వారికి వివరించారు. అక్కడ నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అక్కడ నుంచి నేరుగా గూడూరు పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. ఎన్డీఏ అభ్యర్థులకు అండగా ఉండాలని కేంద్రంలో మోదీని ప్రధాన మంత్రిగా చేయాలని, రాష్ట్రంలో చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. వారితోనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అనంతరం ఆయన పలువురు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులను కలుసుకొని మద్దతు కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, పొదలకూరు ఆర్యవైశ్య ప్రముఖులు శ్రీనివాస్, అమల్తూరి చెంచయ్య, పొట్టి సుధాకర్, సురేంద్ర, కామేశ్వర రావు, మీరా మధు, కృష్ణం వెంకట రమణయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు అయోధ్య రామయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరప్రసాద్ సతీమణి విస్తృత ప్రచారం

రాపూరు/పొదలకూరు: తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి కొల్లూరి లక్ష్మి కోరారు. గురువారం ఆమె రాపూరు, పొదలకూరులలో విస్తృత ప్రచారం నిర్వహించారు.

మహిళా శ్రేయస్సు కోసం బాబును సీఎం చేసుకుందాం



మహిళా శక్తి ముఖాముఖిలో సంధ్యారాణి

చిట్టమూరు, ఏప్రిల్ 25: మహిళా శ్రేయస్సు కోసం చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని గూడూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. గురువారం చిట్టమూరు టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన మహిళా శక్తి ముఖాముఖిలో ఆమె పాల్గొన్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్ 6 పథకాలను వివరించారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలుపించాలని కోరారు. తమ బిడ్డల భవిష్యత్తు కోసం ప్రతి మహిళా సైనికుల్లా పనిచేసి టీడీపీని గెలిపించాలని కోరారు. ఆరూరు ఎంపీటీసీ సభ్యురాలు భార్గవి పలువురు సహా పలువురు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

జగన్ పాలనకు అంతం పలుకుదాం: పరసా



ప్రసంగిస్తున్న పరసా రత్నం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25: వైసీపీ అరాచక పాలనకు అంతం పలికే రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి పరసా వెంకటరత్నం అన్నారు. గురువారం రాత్రి మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో అభ్యర్థి నెలవల విజయశ్రీతో ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరసా మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. అభ్యర్థి నెలవల విజయశ్రీ మాట్లాడుతూ... మరో 50 రోజుల్లో టీడీపీ ప్రభుత్వం రావడం ఖాయమని చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్ ఏజీ కిషోర్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్ రెడ్డి, బీజేజీ నాయకులు తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, మునస్వామి, సుబ్బయ్య ఆలీబాయ్, మేడా సాయి, వెంకీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాముడి రథోత్సవం

గూడూరు, ఏప్రిల్ 25: పట్టణంలోని కోనేటిమిట్ట సమీపంలో ఉన్న కోదండ రామాంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో గురువారం సీతారాముల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. సీతారాములను విశేషంగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించి రథంపై అధిష్ఠింపచేశారు. భక్తుల జైశ్రీరామ్, భక్తిగీతాల ఆలాపన నడుమ రథోత్సవం సాగింది. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

వెంకటగిరిలో వార్ వన్‌సైడే

- వైసీపీ అభ్యర్థి నామినేషన్‌కు కోట, వాకాడు నుంచి జనం తరలింపు
- టీడీపీ ప్రభంజనంలో వైసీపీ కొట్టుకు పోవడం ఖాయం
- మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల





టీడీపీ అభ్యర్థి కురుగొండ్లకు గజమాలతో సత్కారం - కురుగొండ్లకు హారతి పడుతున్న మహిళలు

వెంకటగిరి, డక్కిలి, ఏప్రిల్ 25 : వెంకటగిరిలో గురువారం వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి నామినేషన్ వేసే సమయానికి జనం లేక వెలవెల పోవడం చూస్తుంటే వెంకటగిరిలో వార్ వన్‌సైడే అన్ని టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన నియోజవర్గం పరిధిలోని సైదాపురం మండలం వేములచేడు, పాలూరు రాజుపాళెం, అనంతమడుగు, ఊటుకూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... రాంకుమార్ రెడ్డి నామినేషన్‌కు కోట, వాకాడు, గూడూరు నుంచి జనాన్ని తరలించడం చూస్తుంటే ఆయనకు నియోజకవర్గంలో జనం దొరక్క అక్కడి నుంచి తరలించారని వెంకటగిరివాసులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. నేదురుమల్లి స్థానికేతురుడు కాబట్టే ఆయన నామినేషన్ కార్యక్రమానికి తన సొంతూరైన వాకాడు, కోట ప్రాంతాల నుంచి జనన్ని తరలించారన్నారు. వెంకటగిరిలో తెలుగుదేశానికి జనం చూపుతున్న ఆదరణ చూస్తుంటే ఇక్కడ వార్ వన్‌సైడే అని చెప్పారు. తాను వెంకటగిరి నుంచి 50 వేలు పైచిలుకు ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. వెంకటగిరి ప్రజలు తనకు రాజకీయంగా పునర్జన్మ నిచ్చారని చెప్పారు. వారి కోసం తాను ప్రాణం ఉన్నంతవరకు సేవ చేస్తానని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లల్లో తనపై ఎనిమిది అక్రమ కేసులు బనాయిందని చెప్పారు. ఆ కేసులన్నీ అక్రమమే నని వెంకటగిరి ప్రజలకు తెలుసన్నారు. అలాంటిటప్పుడు ఎన్ని కేసులు పెట్టినా తాను భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనను గాలికొదిలేసి టీడీపీ తోపాటు మరికొన్ని వర్గాలను లక్ష్యంగా పెట్టుకొని వారిపై దాడులు చేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. రాష్ట్రం విడిపోయి ఐదేళ్లు కావస్తున్నా ఇవాళ రాజధాని ఏదో చెప్పుకోలేని పరిస్థితిలో ప్రజలు ఉన్నారంటే ఇంతకంటే దారుణం మరొకటి లేదన్నారు. ఇలాంటి వారికి మళ్లీ ఓట్లు వేస్తే పూర్తిగా దోచేసి ఏపీని పక్క రాష్ట్రాల వారికి అమ్మేసినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. వెంకటగిరిలో వైసీపీలో నాయకులు మారుతున్నారే తప్ప చిల్లిగవ్వంత అభివృద్ధి జరగలేదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్ ఎత్తివేస్తే తాను తన సొంత నిధులతో క్యాంటీన్ ఏర్పాటు చేసి వందలాది మంది పేదల ఆకలి తీరుస్తున్నానని గుర్తు చేశారు. వెంకటగిరి పట్టణంలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న రోజుల్లో తన సొంత నిధులతో ట్రాక్టర్లు ద్వారా తాగునీరు సరఫరా చేశానన్నారు. కరోనా వల్ల అందరు వారి వారి ప్రాంతాలకు వెళ్లిపోతే తాను స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండి చేతనైన సాయం చేశానన్నారు. అప్పుడెక్కడున్నారు ఇప్పుడు పోటీ చేసే నేతలు అని ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు మాత్రమే కనిపించే ఇలాంటి నేతలకు ఓట్లు వేస్తే పనులు కోసం వాకాడుకో, హైదరాబాద్‌కో లేక చెన్నైకో వెళ్లిల్సి వస్తుందన్నారు. ఇంటి బిడ్డగా ఇక్కడే బతుకుతున్న తనను ఆదరిస్తారో? సీజన్‌కు వచ్చి రాజకీయాలు చేసి వెళ్లే వ్యక్తులను ఆదరిస్తారో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. పెంచలకోన మాజీ చైర్మన్ నానాజీ, సుబ్రమణ్యం రాజు, కట్టా మోహన్‌కృష్ణారెడ్డి, కొండూరు సుబ్రమణ్యం రాజు, నోటి రమణారెడ్డి, కెపి రాజు, రాజశేఖర్ రాజు, మునియ్య నాయుడు, దశయ్య నాయుడు, దామోదర నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, జి. కృష్ణంరాజు, వెంకటేశ్వర్లు రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి షేక్ చాంద్ ఖాసీం, మహిళా మోర్చా జిల్లా సభ్యురాలు రేవతి, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ